www.andhrajyothy.com
వరంగల్
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 275
మంగళవారం | 2-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి సా. 5.12 తదుపరి సప్తమి; నక్షత్రం: పుబ్బ ఉ. 11.43 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా.7.50-9.38; దుర్ముహూర్తం: ఉ.9.02-9.46, రా.10.06-10.56; అమృతఘడియలు: తె.6.39; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





## కొంగొత్త విజయం

కొత్త ఏడాది తొలిరోజే ఇస్రో విజయ గీతిక

కృష్ణ బిలాల 'చీకటి'పై పీఎస్ఎల్వీ-సీ58 ఫోకస్

నింగిలోకి దూసుకెళ్లిన ఎక్స్‌పో శాట్

22 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి చేరవేత

తొలి ఎక్స్-రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రయోగం

విద్యార్థినులు రూపొందించిన పేలోడ్లూ కక్ష్యలోకి

'ఫ్యూయెల్ సెల్'తో అంతరిక్ష కేంద్ర ఏర్పాటులో తొలి అడుగు

సూళ్లూరుపేట/శ్రీహరికోట, జనవరి 1: కొత్త సంవత్సరం తొలి రోజే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సరికొత్త విజయాన్ని నమోదు చేసింది. అంతరిక్ష రహస్యం... అంతు లేని గురుత్వాకర్షణ శక్తితో కాంతిని సైతం తనలోకి లాగేసుకునే కృష్ణ బిలాల గుట్టు విప్పే అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. దీని కోసం రూపొందించిన పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగం విజయవంతమైంది. సోమవారం ఉదయం 9.10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ58 నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. 480 కిలోల బరువు గల 'ఎక్స్‌పోశాట్'ను 650 కిలోమీటర్ల

మిగతా 2వ పేజీలో...

# ఫార్మాసిటీ రద్దు కాదు

## శంషాబాద్ విమానాశ్రయానికీ మెట్రో రైలు ఉంటుంది

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా స్ట్రీమ్ లైన్ చేస్తున్నాం

ఫార్మాసిటీని ఔటర్ రింగ్‌రోడ్డు, ఆర్ఆర్ఆర్ మధ్య కాలుష్య రహిత క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తాం

కార్మికులకు ఇళ్లు సహా అన్ని ఏర్పాట్లు అక్కడే కల్పిస్తాం

విమానాశ్రయానికి మెట్రోరైల్ దూరాన్ని తగ్గిస్తాం

ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా మెట్రో మార్గం

నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఒవైసీ హాస్పిటల్ మీదుగా చాంద్రాయణగుట్ట వద్ద లింక్ చేస్తాం.. అక్కడే జంక్షన్

అవసరమైతే మియాపూర్ నుంచి రామచంద్రాపురం, మైండ్‌స్పేస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ దాకా పొడిగిస్తాం

స్టేట్ గెస్ట్‌హౌస్‌గా గత సీఎం క్యాంపు ఆఫీస్

విలేకరులతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌తో మంత్రి కొండా సురేఖ సెల్ఫీ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఫార్మాసిటీని గానీ, శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో రైల్‌ను గానీ రద్దు చేయడంలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వీటిని స్ట్రీమ్‌లైన్ చేస్తున్నామన్నారు. ఫార్మాసిటీని, విమానాశ్రయానికి మెట్రోను హోల్డ్‌లో పెడుతున్నామంటూ గత డిసెంబరు 16న సీఎం చేసిన ప్రకటనతో ప్రజల్లో భిన్నాభిప్రాయాలు నెలకొనడంతో వాటిపై తాజాగా స్పష్టత ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సోమవారం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఫార్మాసిటీని అంచెలంచెలుగా ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్‌ల మధ్య కాలుష్య రహిత క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆ క్లస్టర్లలో పనిచేసే కార్మికులు హైదరాబాద్ వరకు రావాల్సిన అవసరం లేకుండా వారికోసం ఎక్కడికక్కడే అన్ని ఏర్పాట్లు చేస్తామని, ఇళ్ల నిర్మాణాలు కూడా చేపడతామని వివరించారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మెట్రో దూరాన్ని కూడా గత ప్రభుత్వం ప్రతిపాదించిన దానికన్నా

మిగతా 13వ పేజీలో...

### కొత్త బడ్జెట్‌పై కసరత్తు షురూ

13

ప్రతిపాదనలు పంపాలని శాఖలకు ఆర్థిక శాఖ లేఖ

11లోపు అందాలని ఆదేశం

వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పంపాలని సూచన

### టీఎస్‌పీఎస్సీ రాజీనామాలపై త్వరగా నిర్ణయం తీసుకోండి

- గవర్నర్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి!
- రాజ్‌భవన్‌లో తమిళిసైతో ప్రత్యేక భేటీ
- రాజీనామాలపై నిర్ణయం తర్వాతే టీఎస్‌పీఎస్సీపై ముందుకెళ్లే అవకాశం
- పరీక్షల నిర్వహణ, కొత్త నోటిఫికేషన్ల జారీపై తదుపరి చర్యలకూ అవకాశం
- గవర్నర్ దృష్టికి తీసుకెళ్లిన ముఖ్యమంత్రి

13

### హైదరాబాద్ కా షాన్.. నుమాయిష్

మరింత గొప్పగా నిర్వహణకు సహకారం

సొసైటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

83వ నాంపల్లి ఎగ్జిబిషన్ ప్రారంభంలో రేవంత్

13

### రియల్‌కు మళ్లీ 'ఊతం'

ఫార్మా సిటీ, మెట్రో విస్తరణ రద్దు ఉండదన్న సీఎం

స్థిరాస్తి రంగానికి ఊపునిచ్చేలా దిద్దుబాటు చర్యలు

రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వర్గాల్లో హర్షాతిరేకం



జపాన్‌లోని వజిమాలో భూకంపం ధాటికి చీలిన నేల

2

## వణికిన జపాన్

కుదిపేసిన వరుస భూ ప్రకంపనలు

- ఆ దేశ పశ్చిమ తీరంలో 21 పైనే!
- ఒకదాని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6
- పలుచోట్ల సునామీ హెచ్చరికలు జారీ
- ప్రాణ నష్టం లేదు.. ప్రజలు జాగ్రత్త
- భారతీయుల కోసం కంట్రోల్ రూమ్

## హైదరాబాద్‌లో కరోనా నిశ్శబ్దవ్యాప్తి

14

- చాప కింద నీరులా విస్తరిస్తున్న వైరస్
- చాలామందిలో కనిపించని లక్షణాలు!
- నమోదవుతున్న కేసుల సంఖ్య తక్కువే
- 'పాజిటివ్' నమూనాలు జీనోమ్ పరీక్షకు
- వైరస్ అంత ఆందోళనకరం కాదుగానీ.. నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి: వైద్యులు




## 'వందేభారత్' హవా

ద.మ. రైల్వే పరిధిలో దూసుకెళ్తున్న 4 రైళ్లు

100 శాతానికిపైగా ఆక్యుపెన్సీ

12

## ఆర్నెల్లలో 60 లక్షలు

నారుతో సంపాదించిన రైతు సోదరులు

కుటుంబాలతో సహా ఆంధ్రప్రదేశ్‌లోని వినుకొండ నుంచి జనగామకు వలస

12

ఏడాదికి రూ.65 వేలు చెల్లించి ఓ రైతు వద్ద ఎనిమిదెకరాలు కౌలుకు

కోతుల బెడదతో పొగాకు నారుమళ్ల సాగు

4ఎకరాల్లో నారు.. 2 విడతల్లో 60లక్షల లాభం

దీక్ష, పట్టుదలతో సాగు.. ఉదయం నుంచి రాత్రి దాకా పొలం వద్దే

# అదనంగా అప్పివ్వండి

## బీఆర్ఎస్ సర్కారు ఖజానా ఖాళీ చేసేసింది

ఏడాది కోటా అప్పు 8 నెలల్లో లాగేశారు

ఈ 3 నెలలు అప్పు లేకుండా బతికేదెలా?

రూ.13 వేల కోట్లిస్తే ఎలాగోలా గట్టెక్కేస్తాం

ఇటీవలి భేటీలో ప్రధానిని కోరిన రేవంత్

గ్రాంట్లు, పన్నుల్లో వాటా పెద్దగా రాదు

భూములు, ఓఆర్ఆర్ ఇప్పటికే అమ్మేశారు

వాటిపై వచ్చిన రూ.26 వేల కోట్లు ఊదేశారు

మా సర్కారుకు అప్పు దారి లేకుండా చేశారు

అప్పిస్తేనే గట్టెక్కుతామని ప్రధానికి వివరణ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చింది. తాను ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి నిధుల కరువు ఏర్పడింది. నిధుల సమీకరణకు అప్పు తప్ప వేరే మార్గం కనిపించడం లేదు. ఎన్నికల ముందు భూముల అమ్మకం ద్వారా వచ్చిన భారీ మొత్తాలను బీఆర్ఎస్ సర్కారు వాడేసింది. బడ్జెట్‌లో పొందుపర్చిన అప్పులన్నీ కోటా మేరకు దాదాపుగా తీసేసుకుంది. ఈ రెండు ప్రధాన మార్గాలు మూసుకుపోవడంతో కొత్త ప్రభుత్వానికి కేంద్రం దయే శరణ్యమైంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అదనపు అప్పు ఇవ్వాలని కోరుతోంది. ఈ అదనపు అప్పు పుడితేనే ఎంతో కొంత గట్టెక్కవచ్చన్నది సర్కారు ఆలోచన. అందుకే, 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో



మిగతా 12వ పేజీలో...



## నర్సింగ్ కాలేజీలు మరో 64!

100 పడకల ఆస్పత్రి ఉన్నచోట కళాశాల

రేవంత్ సర్కారు సూత్రప్రాయ నిర్ణయం

ప్రాంతీయ ఆస్పత్రుల్లో మెరుగవ్వనున్న రోగుల సంరక్షణ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 64 నర్సింగ్ కాలేజీలు వచ్చే అవకాశాలున్నాయి. ప్రతి వందపడకల ఆస్పత్రిలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సులో 50 సీట్లకు తగ్గకుండా ఓ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రస్తుతం వందపడకల ఆస్పత్రులు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయి. వీటన్నింటిని ప్రాంతీయ ఆస్పత్రులుగా పిలుస్తున్నారు. ఇవి రాష్ట్రవ్యాప్తంగా 64 ఉన్నాయి. ఇవి కాకుండా.. సామాజిక ఆరోగ్య కేంద్రాల(సీహెచ్‌సీ)ను ప్రాంతీయ ఆస్పత్రులుగా మార్చారు. ఈ కోవలో మరో 25 ఆస్పత్రులున్నాయి. వీటిల్లో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర మౌలిక వసతులను కల్పించాల్సి ఉన్నందున.. ముందు నుంచి కొనసాగిన 64 ఏరియా ఆస్పత్రుల్లో నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. సర్కారు తాజా నిర్ణయంతో అన్ని ఉమ్మడి జిల్లాల్లో నర్సింగ్ కాలేజీలు ఏర్పాటవుతాయి. ఉమ్మడి రంగారెడ్డి

మిగతా 12వ పేజీలో...

# మందు చుక్క.. మాంసం ముక్క



ఏపీ సరిహద్దులోని సత్యనారాయణపురంలో కోడిపందేల స్థావరం వద్ద జనం

- రెండింటితో నూతన సంవత్సరానికి ఉత్సాహంగా ఆహ్వానం
- డిసెంబరు 31న రాష్ట్రంలో రూ.300 కోట్ల మద్యం అమ్మకం
- హైదరాబాద్‌లో 4.5 లక్షల కిలోల కోడి మాంసం హాంఫట్
- స్విగ్గీ ఫుడ్ యాప్‌లో 1.20 లక్షల బిర్యానీల ఆర్డర్
- ఏపీలో మద్యం విక్రయాలు 147 కోట్లు.. తెలంగాణలో సగం

హైదరాబాద్/సిటీ, సత్తుపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అసలే ఆదివారం.. ఆపై డిసెంబరు 31..! ఇంకేం? మద్యం చుక్క.. మాంసం ముక్క కలిసి చిందేశాయి..! కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికాయి.. బిర్యానీ ఆర్డర్లతో ఫుడ్ డెలివరీ యాప్‌లు బిజీబిజీగా కనిపించాయి.. ఇతర క్విక్ కామర్స్ యాప్‌లకూ ఈ తాకిడి తగిలింది. అటు ఎక్సైజ్ శాఖకు కిక్కిచ్చేంత ఆదాయం రాగా.. ఇటు రిటైల్ మాంసం దుకాణాల వారి జేబులు నిండాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ మందు బాబులు ఎంజాయ్ చేయడంతో డిసెంబరు 31న రికార్డు స్థాయిలో రాష్ట్రంలో రూ.300 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని అంచనా. హైదరాబాద్‌లో చాలాచోట్ల

మిగతా 14వ పేజీలో...



ఘరానా దొంగ.. రాయ్ యాఫ్రాఫ్

## దొంగ యుద్ధం!

2

నెతన్యాహు, రక్షణ మంత్రితో ఫొటో

సైనిక దుస్తుల్లో ఓ దొంగ చాకచక్యం

పలు ఆపరేషన్లలో ముందుండి కాల్పులు

క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలు కూడా

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ సమయంలో తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ

## ఎయిర్‌పోర్టులో సిటీసైడ్ చెక్-ఇన్

కారు పార్కింగ్ ప్రదేశంలోనే బ్యాగేజీ డ్రాప్, బోర్డింగ్ పాస్

14

శంషాబాద్ విమానాశ్రయంలో సేవలను ప్రారంభించిన జీఎంఆర్ ఈడీ

# జీతాల్లేని వీఆర్ఏలు

- పూర్వ వీఆర్ఏలకు 4 నెలలుగా అందని వేతనాలు
- ఇతర శాఖల్లో పనిచేస్తున్న 16 వేల మంది
- పేరుకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు
- పోస్టుల్లో నియమించి ఐడీలు ఇవ్వని వైనం
- పోస్టుల కోసం మరో 4 వేల మంది నిరీక్షణ
- కొత్త సర్కారు పరిష్కరిస్తుందని ఎదురుచూపులు



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై పోరాడి ఉద్యోగాల క్రమబద్ధీకరణ సాధించుకున్న వీఆర్ఏలు.. దాని ప్రయోజనాలను పొందకపోగా.. జీతాలు కూడా లేక అల్లాడుతున్నారు. సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి మరీ ఇతర శాఖల్లో వీఆర్ఏలను సర్దుబాటు చేసిన గత ప్రభుత్వం.. వారికి జాబ్ చార్ట్‌ను మాత్రం ఖరారు చేయలేదు. ఉద్యోగ గుర్తింపు నంబరు (ఐడీ నంబరు) కూడా జారీ చేయలేదు. దీంతో పేరుకు ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నా నెల నెలా వేతనం గానీ, ఇతర భత్యాలు గానీ అందడంలేదు. గడచిన నాలుగు నెలల జీతంతోపాటు ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం 80 రోజులపాటు సమ్మె చేసిన కాలానికి సంబంధించిన వేతనం కూడా ఇప్పటికీ అందలేదు. దీంతో 16 వేల మంది పూర్వ వీఆర్ఏలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఇంకా 4 వేల మంది వీఆర్ఏలు సర్దుబాటు పోస్టుల కోసం నిరీక్షిస్తున్నారు. కొత్తగా కొలువుదీరిన

మిగతా 3వ పేజీలో...



# శబరిమలకు పోటెత్తిన భక్తులు

» సన్నిధానం వద్ద ఉక్కిరిబిక్కిరి.. ఇక్కట్లపాలైన తెలుగు భక్తులు

శబరిమల, జనవరి 1: శబరిమలకు అయ్యప్ప భక్తులు పోటెత్తారు. మకరవిళక్కు సీజన్ సందర్భంగా శనివారం ఆలయం తలుపులు తెరుచుకోగా.. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం భక్తుల రద్దీ పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) వర్గాలు తెలిపాయి. సోమవారం ఉదయం రికార్డు స్థాయిలో 18 వేల మంది భక్తులు అయ్యప్పకు నెయ్యాభిషేకాలు నిర్వహించారని, వేల సంఖ్యలో భక్తులు వచ్చారని వివరించాయి. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా 80 వేల మంది, స్పాట్ బుకింగ్‌లో 10 వేల మంది, పులిమేడ్ రూట్‌లో మరో 8 వేల మంది భక్తులు దర్శనానికి వచ్చినట్లు వెల్లడించాయి. సాయంత్రం 4 గంటల సమయంలో సన్నిధానం వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌పై వందల మంది భక్తులు చేరడం.. దర్శనం ఆలస్యం అవ్వడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో దర్శనం క్యూలో చాలా మంది తెలుగు భక్తులే ఉన్నారు. చిన్నపిల్లలు, 50 ఏళ్ల పైబడ్డ మహిళాభక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు లేకపోవడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. క్యూలైన్ల వద్ద నిర్వహణ సరిగ్గాలేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలుగు భక్తులు ఆరోపించారు.

## కేరళ చానల్‌లో డీకే శివకుమార్ పెట్టుబడులు

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేరళలోని జైహింద్ చానల్‌లో పెట్టుబడులకు సంబంధించిన అంశంపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ భార్య, పిల్లలకు బెంగళూరు సీబీఐ అధికారులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 11న విచారణకు హాజరు కావాలని డీకే కుటుంబీకులు, చానల్ ఎండీకి సీబీఐ నోటీసులు ఇచ్చింది. డీకే శివకుమార్ అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని నమోదైన కేసును 2020లో సీబీఐ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో జైహింద్ చానల్‌లో డీకే పెట్టుబడులు పెట్టినట్టు విచారణలో గుర్తించారు. చానల్‌లో పెట్టిన పెట్టుబడులు, లాభాలు, షేర్ల వివరాలను ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. జైహింద్ చానల్‌లో డీకే శివకుమార్‌తో పాటు 30 మంది పెట్టుబడులు పెట్టినట్టు చానల్ ఎండీ బీఎస్ శిజు ఇప్పటికే స్పష్టం చేశారు. సీబీఐ నోటీసులపై శివకుమార్ స్పందిస్తూ.. రాజకీయంగా తనను అంతం చేయాలని కుట్ర సాగుతోందన్నారు.

# 'కొంగొత్త' విజయం!

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తులోని లియో ఆర్బిట్‌లోకి 22 నిమిషాల్లో చేరుకుంది. 'ఇస్రో' ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. అమెరికా తర్వాత ఈ ఘనత సాధించిన దేశం భారత్ మాత్రమే కావడం మరో విశేషం. పీఎస్ఎల్వీ-సీ58 ద్వారా వివిధ ప్రయోగాలకు ఉద్దేశించిన పది పరికరాలను కూడా కక్ష్యలోకి చేర్చారు. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో సూపర్ కంప్యూటర్ల ద్వారా ప్రయోగాన్ని వీక్షించిన ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ రాకెట్ తన నాలుగు దశలను పూర్తిచేసుకొని ఉపగ్రహాన్ని సంబంధిత కక్ష్యలోకి విజయవంతంగా చేర్చిన వెంటనే పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు.

### విద్యార్థినుల కీలక పాత్ర

పీఎస్ఎల్వీ చివరి దశలో కక్ష్యలోకి ప్రవేశపెట్టిన పది పరికరాల్లో తిరువనంతపురం ఎల్‌బీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాల విద్యార్థినులు రూపొందించిన ఉమెన్ ఇంజనీర్డ్ ఉపగ్రహం కూడా ఉంది. దీంతో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థినులు రూపొందించిన పేలోడ్లు ఉన్నాయి. ఇది దేశంలోని మహిళలకు స్ఫూర్తినిస్తుందని ఇస్రో పేర్కొంది.

### 'స్పేస్ స్టేషన్' దిశగా...

అంతరిక్షంలో 'స్పేస్ స్టేషన్'ను నిర్మాణంలో సోమవారం తొలి అడుగు పడింది. ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో పాటూ కక్ష్యలోకి ప్రవేశపెట్టిన 10 పరిశోధక పరికరాల్లో ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టమ్(ఎఫ్‌సీపీఎస్) కూడా ఉంది. భవిష్యత్‌లో భారతదేశం రోదసీలో నిర్మించబోయే అంతరిక్ష కేంద్రానికి ఈ ఫ్యూయల్‌సెల్ కీలకం కానుంది. ఫ్యూయల్‌సెల్ టెక్నాలజీని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ) అభివృద్ధి చేసింది. అంతరిక్షంలో సమర్థవంతమైన సుస్థిర శక్తి వనరులను తయారు చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. ఎలక్ట్రో కెమికల్ రియాక్షన్‌తో రసాయన శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే సాంకేతికత ఫ్యూయల్‌సెల్‌లో ఉంటుంది. సుదీర్ఘకాలం పాటు అంతరిక్ష కేంద్రానికి విద్యుత్‌ను ఇది సరఫరా చేయగలదు.

### గొప్ప ప్రారంభం: మోదీ


ఇస్రో చేపట్టిన ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో గొప్ప ప్రారంభంగా ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్‌కు ఉన్న నైపుణ్యాన్ని ఈ ప్రయోగం చాటి చెబుతుందన్నారు. ముఖ్యంగా ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న విద్యార్థినులు, మహిళా శాస్త్రవేత్తల కృషిని ఆయన అభినందించారు. ఈ మేరకు ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇస్రో ఎక్స్‌పోశాట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంతోషం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రయోగాల ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు.



### ఇవీ ప్రధాన లక్ష్యాలు

ఇప్పటి వరకు అంతుచిక్కని కృష్ణబిలాల (బ్లాక్ హోల్స్)ను అర్థం చేసుకోవాలనేది ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రధాన లక్ష్యం.

ఎక్స్‌రే ఫొటాన్లు, వాటి పోలరైజేషన్‌పై అధ్యయనం చేయడం ద్వారా కృష్ణ బిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల దగ్గర ఉన్న రేడియేషన్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకోనున్నారు.



### ఇది గగన్‌యాన్ సంవత్సరం: సోమనాథ్

పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగానంతరం ఇస్రో చైర్మన్ సోమనాథ్ మీడియాతో మాట్లాడారు. పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ కక్ష్యలోకి చేర్చిన ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహం(ఎక్స్‌పోశాట్) ప్రయోజనాలను వెల్లడించారు. 2021లో అమెరికా ఈ తరహా ప్రయోగం చేపట్టిందని, అమెరికా తర్వాత ఇలాంటి ప్రయోగం చేపట్టిన ఘనత భారతదేశానికే దక్కిందన్నారు. అంతరిక్ష ఆధారిత ఎక్స్‌రే ఖగోళ శాస్త్రంలో సంచలనాత్మక పురోగతికి ఈ ప్రయోగం నాంది పలకనుందని చెప్పారు. ఎక్స్‌రే పొలారిమీటర్ మూలాలను అన్వేషించడం ఎక్స్‌పోశాట్ లక్ష్యమని తెలిపారు. ఇది ఖగోళ శాస్త్రానికి ఒక కొత్త కోణాన్ని పరిచయం చేస్తుందన్నారు. ఇలా ఉండగా ఎక్స్‌పోశాట్ జీవితకాలం ఐదేళ్లు. కృష్ణబిలాల రహస్యాలను ఛేదించడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఈ ఏడాదిలో 12-14 ప్రయోగాలు చేపట్టనున్నామని సోమనాథ్ తెలిపారు. వీటిలో కీలకమైన 'గగన్‌యాన్' ఉందన్నారు. 2024 సంవత్సరం 'మిషన్ గగన్‌యాన్'గా నిలవనుందని ప్రకటించారు.





## ఆ యోధులు అక్కడివారే!

» కర్ణాటక, కేరళలోని పలు వర్గాల వారి జన్యువుల్లో వాయవ్య భారత మూలాలు

» సీసీఎంబీ అధ్యయనంలో వెల్లడి

కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని నాయర్లు, తియ్య, ఎళవ తదితర తెగలకు చెందిన యోధులు, భూస్వామ్యవర్గాలకు చెందినవారు వాయవ్య భారతదేశం నుంచి వలసవచ్చారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వారి జన్యువులు వాయవ్య భారతదేశానికి చెందిన వారి జన్యువులకు దగ్గరగా ఉన్నాయని డాక్టర్ కుమారసామి తంగరాజ్ సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం నిర్వహించిన పరిశోధనలో నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)' సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పరిశోధనలో భాగంగా సీసీఎంబీ శాస్త్రవేత్త తంగరాజ్ సారథ్యంలోని పరిశోధకుల బృందం నైరుతి తీరప్రాంతానికి చెందిన 213 మంది యోధులు, భూస్వామ్య వర్గాల జన్యువులను విశ్లేషించింది. కేరళలోని నాయర్లు, తియ్యలు, ఇజ్వాలు, కర్ణాటకకు చెందిన బంట్‌లు, హోయసల జన్యువులు.. వాయవ్య భారతదేశ జనాభా జన్యువులకు దగ్గరగా ఉన్నాయని ఆ బృందం నిర్ధారించింది. వీరి వలసలు కాంస్యయుగం చివరిలో లేదా లోహయుగం ప్రాంతంలో జరిగి ఉంటాయని అధ్యయనంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ లోమౌస్ కుమార్ తెలిపారు. కాగా, భౌగోళిక పరిశోధన, ఖనిజ నిక్షేపాల అన్వేషణ కోసం కోల్‌కతాకు చెందిన జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా.. హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియలాజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వంద కోట్ల రూపాయల విలువైన ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని 700 కిలోమీటర్ల మేర విస్తరించిన ప్రాంతంలో డీప్ సెస్మిక్ రిఫ్లెక్షన్ సర్వే, మాగ్నెటోటెల్యూరిక్ సర్వేలు నిర్వహిస్తారు.

- స్పెషల్ డెస్క్



భూకంపంతో ధ్వంసమైన రోడ్డు

# వణికిన జపాన్

» కుదిపేసిన వరుస భూప్రకంపనలు

» తీవ్ర స్థాయి సునామీ హెచ్చరికలు జారీ



టోక్యో, జనవరి1: కొత్త ఏడాది తొలి రోజునే జపాన్ పశ్చిమ తీరాన్ని భూ ప్రకంపనలు వణికించాయి. ప్రభుత్వం అత్యంత తీవ్రస్థాయి సునామీ హెచ్చరికలు జారీచేసి లక్షమందిని తక్షణమే ఖాళీ చేయించింది. ఇషికావాలోని నోటోలో మొదట 5.7 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఇక్కడి తీరం పరిధిలో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో 4.0కంటే అధిక తీవ్రతతో మొత్తం 21 ప్రకంపనలు సంభవించాయి. వీటిలో ప్రధాన ద్వీపం హోన్షులో వచ్చిన ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైందని జపాన్ వాతావరణ శాఖ ప్రకటించింది. ఇషికావాలోని వాజిమా నౌకాశ్రయంలో 1.2 మీటర్ల ఎత్తులో సునామీ అలలు ఎగిశాయి. వీధులు, భవనాలు దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్దఎత్తున పగుళ్లు వచ్చాయి. కాగా, హొక్కాయిడో నుంచి నాగసాకి వరకు సునామీ ముప్పుందని అధికారులు వెల్లడించారు. కొన్నిచోట్ల అలలు 5మీటర్ల ఎత్తువరకు రావచ్చొని హెచ్చరించారు. ఇషికావాకు తీవ్రమైన, హోన్షు, హొక్కైడో ఇతర ప్రధాన ద్వీపాలకు స్వల్ప స్థాయి సునామీ హెచ్చరికలను జారీ చేశారు. 16.5 అడుగుల ఎత్తున అలలు ఎగిసిపడే ప్రమాదం ఉందని జపాన్ అధికారిక ఎన్‌హెచ్‌కేటీవీ సూచించింది. 2-3 రోజుల్లో తీవ్ర ప్రకంపనల ప్రమాదం ఉందని హెచ్చరించింది. రాత్రికి సునామీ హెచ్చరికల తీవ్రతను జపాన్ ప్రభుత్వం తగ్గించింది. ప్రకంపనల కారణంగా 36 వేల ఇళ్లకు విద్యుత్తు నిలిచిపోయింది. సైన్యం రక్షణ చర్యల్లో నిమగ్నమైంది. రష్యా సఖాలిన్ ద్వీపం, ఉత్తర కొరియాల్లోని కొన్నిచోట్ల సునామీ హెచ్చరికలు జారీ చేశారు. జపాన్‌లోని భారతీయులకు సహాయపడేందుకు టోక్యోలోని భారత ఎంబసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. సాయం కావాల్సినవారు +818039301715, +817014920049, +818032144734, +818062295382, +818032144722 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించింది.

## పదేళ్ల ప్రగతిపై మోదీ జనాభిప్రాయ సేకరణ

న్యూఢిల్లీ, జనవరి 1: గడచిన పదేళ్లలో వివిధ రంగాల్లో దేశం సాధించిన పురోగతిపై ప్రధాని మోదీ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోగోరుతున్నారు. 3 నెలల్లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గత నెలలో 'నమో యాప్'లో సర్వే ప్రారంభించారు. తన ప్రభుత్వం, ఎంపీల పనితీరుతో పాటు వివిధ అంశాలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడం ఈ సర్వే ఉద్దేశం. 'గత పదేళ్లలో భారత్ పలు రంగాల్లో సాధించిన ప్రగతిపై మీరేమనుకుంటున్నారు? నమో యాప్‌లో జన్‌మన్ సర్వే ద్వారా మీ అభిప్రాయాలను నాతో నేరుగా పంచుకోండి' అని 'ఎక్స్'లో కోరారు. సర్వేలో పాల్గొనే లింకును కూడా షేర్ చేశారు.

## గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ ఉగ్రవాది: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 1: గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్‌ను కేంద్రప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. నిషేధిత ఖలిస్థానీ ఉగ్రసంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో కలిసి పనిచేస్తున్న గోల్డీ బ్రార్‌ను ఉపా చట్టం కింద ఉగ్రవాదిగా ప్రకటిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సోమవారం నోటీసు జారీ చేసింది. గోల్డీ బ్రార్, అతని అనుచరులు పంజాబ్‌లో మతపరమైన అల్లర్లకు కుట్రలు పన్నుతున్నారని కూడా తెలిపింది. కెనడాలో నివసిస్తున్న గోల్డీ బ్రార్.. 2022లో జరిగిన పంజాబీ గాయకుడు సిద్దూ మూసేవాలా హత్యకు తానే బాధ్యుడినని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## మణిపూర్‌లో మళ్లీ హింస.. నలుగురి మృతి

ఇంఫాల్, జనవరి 1: మణిపూర్‌లో సోమవారం మళ్లీ హింసాత్మక సంఘటనలు జరిగాయి. సాయంత్రం తౌబాల్ జిల్లా లిలోంగ్‌లో జరిగిన ఘర్షణల్లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో నలుగురు మరణించారు. దాంతో తౌబాల్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో మళ్లీ కర్ఫ్యూ విధించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కర్ఫ్యూ సమయాల్లో ఇచ్చిన వెసులుబాట్లను రద్దు చేశారు. మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ శాంతి భద్రతను కాపాడాలని ప్రజలను కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## బ్రిటన్‌లో విద్యార్థి వీసాలు మరింత కఠినం

లండన్, జనవరి 1: విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడంలో బ్రిటన్ మరింత కఠినంగా వ్యవహరించనుంది. చదువుల నిమిత్తం వచ్చేవారు తమ కుటుంబ సభ్యుల్ని, ఆశ్రితుల్ని ఎవర్నీ తీసుకురాకూడదని స్పష్టం చేసింది. పీజీ రీసెర్చి చేసేవారు, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందేవారికి దీని నుంచి మినహాయింపు ఉంది. భారతీయ విద్యార్థులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. సోమవారం నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి.

# అయోధ్య రాముడి పాదుకలు హైదరాబాద్ నుంచే..

» ఓల్డ్‌బోయిన్‌పల్లిలో రూపుదిద్దుకుంటున్న పంచలోహ పాదుకలు

» బరువు 12 కిలోల 800 గ్రాములు

ఓల్డ్‌బోయిన్‌పల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయోధ్య ఆలయ నిర్మాణ క్రతువులో భాగ్యనగరం మరో అదృష్టాన్ని దక్కించుకుంది. ఇప్పటికే బోయిన్‌పల్లిలోని అనురాధ టింబర్స్‌లో అయోధ్య ఆలయ ప్రధాన ద్వారాలు, ఇతర తలుపులు తయారవుతుండగా.. రాములోరి పాదుకలు కూడా హైదరాబాద్‌లోనే రూపుదిద్దుకున్నాయి. కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి పిట్లంపల్లి రామలింగాచారి ఏర్పాటు చేసిన శ్రీమద్విరాట్ కళాకుటీర్‌లో అయోధ్య రామయ్య పాదుకలను రూపొందించారు. రామలింగాచారితోపాటు.. ఆరుగురు నిపుణులైన శిల్పులు 25 రోజుల పాటు శ్రమించి, పంచలోహాలతో 12 కిలోల 800 గ్రాముల బరువున్న పాదుకలను తయారు చేశారు. ఇవి 100 ఏళ్ల వరకు కూడా చెక్కు చెదరని విధంగా తయారయ్యాయని రామలింగాచారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పాదుకలకు బంగారు తాపడం పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. ఈ పాదుకలు ఆదివారం రాత్రి అయోధ్యకు బయలుదేరాయని, మంగళవారం అక్కడికి చేరుకుంటాయని వివరించారు.

### 40 ఏళ్ల అనుభవం..

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం అంగడికూర్మపల్లికి చెందిన రామలింగాచారికి లోహశిల్పిగా 40 ఏళ్ల అనుభవం ఉంది. రాగి లక్ష్మీనారాయణ, రాగి వీరబ్రహ్మాచారి వద్ద ఆయన లోహశిల్పకళను అభ్యసించారు. 1986లో నల్లగొండలోని కేంద్ర ప్రభుత్వ జౌళీ పరిశ్రమల శిక్షణ సంస్థలో పనిచేశారు. 1987లో బెంగళూరులోని రీజినల్ డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రెండేళ్ల లోహశిల్పం విద్యలో మాస్టర్స్ పట్టా అందుకున్నారు. 1988లో హైదరాబాద్ నగరానికి వచ్చి పలు ఆలయాల్లో లోహశిల్పకళ పనులు చేసేవారు. 1993లో ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేట చౌరస్తా వద్ద వద్ద శ్రీమద్విరాట్ కళా కుటీర్‌ను స్థాపించారు. అప్పటి నుంచి అనేక ఆలయాల దేవతామూర్తులను, గాలిగోపురాలను తీర్చిదిద్దారు. యాదగిరిగుట్ట గర్భగుడిలో ఉన్న ఉత్సవ మూర్తులు, స్వామివారి కవచాలు, శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో నాగాభరణాలు, కడపలోని బ్రహ్మంగారి మఠంలో ఈశ్వరీదేవి సమాధి మండపం ఆయన చేతుల మీదుగా రూపుదిద్దుకున్నవే. తెలంగాణ, ఏపీతోపాటు.. పలు రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాల్లోనూ రామలింగాచారి చేతుల మీదుగా రూపుదిద్దుకున్న అలంకరణలున్నాయి. ఆయన అనుభవాన్ని గుర్తించిన అయోధ్య భాగ్యనగరం సీతారామ సేవాట్రస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చర్ల శ్రీనివాసశాస్త్రి పాదుకల పనిని అప్పగించారు.



పాదుకలను తయారు చేస్తున్న లోహశిల్పి రామలింగాచారి

### అయోధ్యలో ప్రతిష్ఠాపనకు మైసూర్ విగ్రహం

» బాల రాముని ఎత్తు 51 అంగుళాలు

మైసూర్, జనవరి 1: అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహం ఎంపిక పూర్తయింది. మైసూర్‌కు చెందిన ప్రసిద్ధ శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన బాల రాముని విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. రామ జన్మభూమి ట్రస్టు ఈ ఎంపికను ఓటింగ్ ద్వారా పూర్తి చేసింది. మైసూర్ జిల్లా బుజ్జెగౌడనపుర గ్రామంలో లభ్యమయ్యే ప్రత్యేకమైన కృష్ణ శిలను శిల్పాన్ని చెక్కడానికి వినియోగించారు. అరుణ్ యోగిరాజ్ నేతృత్వంలో శిల్పుల బృందం అత్యంత నైపుణ్యంతో చెక్కిన ఈ బాల రాముని విగ్రహం 51 అంగుళాల ఎత్తు ఉంటుంది. పీఠంతో కలుపుకుని ఎనిమిది అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పు ఉంటుంది.

# రామభక్తులకే ఆహ్వానం!

» అయోధ్యలో ఆలయ ప్రతిష్ఠపై ప్రధాన పూజారి

» ఉద్ధవ్, రౌత్‌పై సత్యేంద్రదాస్ ఆగ్రహం

అయోధ్య/న్యూఢిల్లీ, జనవరి 1: అయోధ్యలో 22న రామాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంపై బీజేపీ, ప్రతిపక్షాల నడుమ మాటల యుద్ధం కొనసాగుతోంది. ఆహ్వానాలు అందుకున్న టీఎంసీ, సీపీఎం హాజరు కాబోమని ప్రకటించగా.. కాంగ్రెస్ ఇంకా ఎటూ తేల్చుకోలేదు. తనకు ఆహ్వానం పంపలేదని ఉద్ధవ్ శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే చేసిన వ్యాఖ్యలపై అయోధ్య రామాలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్రదాస్ మండిపడ్డారు. రామభక్తులకు మాత్రమే ఆహ్వానాలు అందుతాయన్నారు. శ్రీరాముడి పేరుతో బీజేపీ ఎన్నికలకు వెళ్తోందన్న విమర్శలు అర్థరహితమన్నారు. రేపోమాపో శ్రీరాముడిని బీజేపీ తన అభ్యర్థిగా ప్రకటిస్తుందన్న ఎంపీ సంజయ్ రౌత్‌పైనా ఆచార్య విరుచుకుపడ్డారు. 'రాముడి పేరుతో రాజకీయాలు చేసింది వాళ్లే. శ్రీరాముడిని నమ్మినవారు అధికారంలో ఉన్నారు. రౌత్ రాముడిని అవమానిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇంకోవైపు.. రామాలయ ప్రారంభంపై బీజేపీ మంగళవారం వ్యూహాత్మక సమావేశం నిర్వహించనుంది. పార్టీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా పలువురు నేతలు, ప్రతి రాష్ట్ర శాఖ నుంచి ఇద్దరేసి ఆఫీసు బేరర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. కాగా, రామాలయ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఈ నెల 16న ప్రారంభమై వారంపాటు జరుగుతాయి. 22వ తేదీన ప్రాతఃకాల పూజల అనంతరం మృగశిర నక్షత్రంలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు.

## దేశంలోనే పొడవైన సముద్ర వంతెన



భారత్‌లోనే అత్యంత పొడవైన సముద్ర వంతెన(ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్) ఈనెల 12న అందుబాటులోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ వంతెనను ప్రారంభిస్తారు. ప్రస్తుతం ముంబై-పుణె నగరాల మధ్య ప్రయాణానికి 2 గంటల సమయం పడుతుండగా.. 21.8 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన అందుబాటులోకి వస్తే.. ఆ దూరం 15-20 నిమిషాలకు తగ్గుతుంది.


# దొంగ యుద్ధం!

» నెతన్యాహు, రక్షణ మంత్రితో ఫొటో

» సైనిక దుస్తుల్లో దొంగ చాకచక్యం

» పలు ఆపరేషన్లలో ముందుండి కాల్పులు

» తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ



నెతన్యాహుతో యాఫ్రాఫ్

అతనో ఘరానా దొంగ..! పేరు రాయ్ యాఫ్రాఫ్..! వయసు 35ఏళ్లు..! ఉండేది ఇజ్రాయెల్‌లోని టెల్-అవీవ్‌లో..! ఆర్మీ తుపాకులు, మందుగుండు సామగ్రిని దొంగిలించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించాలనుకున్నాడు! అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడితో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) బెల్ ఆఫ్ ఆర్మ్స్(ఆయుధాగారం)లోకి వెళ్లేందుకు అవకాశం కల్పించుకున్నాడు. సైన్యాధికారి దుస్తులు ధరించి, సైన్యంలోకి చొరబడ్డాడు. అదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణమంత్రి యోవ్ గలాంట్ హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్నారు. వారి దగ్గరకు వెళ్లి, ఫొటోలకు ఫోజులిచ్చాడు. ఆ ఫొటోలే అతనికి రక్షణ కవచాలయ్యా యి. అధికారి హోదాతో నకిలీ ఐడీకార్డును తయారు చేసుకున్నాడు. దాంతో సైన్యంలో అడ్డూఅదుపూ లేకుండా తిరిగాడు. అక్టోబరు7దాడి తర్వాత హమాస్ ఉగ్రవాదులు నక్కిన ఇళ్ల లో చేపట్టిన ఆపరేషన్‌లో కొన్ని దళాలను ముం దుండి నడిపాడు. గాజాలో సొరంగాల విధ్వంసంలో పాల్గొన్నాడు. తూటా గాయాలైన సైనికులకు ప్రథమచికిత్సలు చేసేవాడు. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లో, షిన్‌బెట్ సీక్రెట్ ఏజెంట్‌గా తనను తాను తోటి సైనికులకు పరిచయం చేసుకునేవాడు. వీలైనప్పుడు అసాల్ట్ రైఫిళ్లు, పిస్టళ్లు, తూటాలు, మందుగుండు సామగ్రి, స్మోక్ గ్రెనేడ్లను తస్కరించేవాడు. హమాస్ మృతదేహాల వద్ద తుపాకులనూ వెంట తెచ్చుకున్నాడు. గతనెల 17న ఆయుధాలు మాయమవుతుండడంపై ఐడీఎఫ్ నిఘాపెట్టడంతో ఆదివారం యాఫ్రాఫ్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్, చానల్-12 పేర్కొన్నాయి. యాఫ్రాఫ్ ఇంట్లో తుపాకులు, ఐఈడీలు, గ్రెనేడ్లను సీజ్‌చేశామని, అతనిపై మోసం, దొంగతనం సహా ఐదు అభియోగాలు మోపినట్లు టెల్-అవీవ్ పోలీసులు తెలిపారు. ఈ నేరాలకు అతనికి గరిష్ఠంగా 36ఏళ్ల జైలు శిక్షపడే అవకాశముందని న్యాయనిపుణులు చెబుతుండగా.. యాఫ్రా ఫ్ మాత్రం తాను స్వచ్ఛందంగా సైన్యంలో పనిచేశానంటున్నాడు.

- సెంట్రల్ డెస్క్

## మసూద్ అజహర్ హత్య?

» పాక్ మసీదు వద్ద పేలుడులో మృతి?

» 'గుర్తు తెలియని వ్యక్తి' పనే అంటూ ట్రెండింగ్



న్యూఢిల్లీ, జనవరి 1: నూతన సంవత్సరం వేళ 'ఎక్స్'లో 'గుర్తు తెలియని వ్యక్తి' మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చాడు. కాందహార్ విమానం హైజాక్, పుల్వామా పేలుళ్ల తదితర సంఘటనలతో సంబంధం ఉన్న మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, జైష్ ఎ మహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్ హత్యకు గురైనట్టు ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. సోమవారం ఉదయం 5గంటలకు పాకిస్థాన్‌లోని భావల్‌పూర్ మసీదు నుంచి వెళ్తుండగా బాంబు పేలడంతో మరణించినట్టు ఆ పోస్టులో ఉంది. ఈ సమాచారం ధ్రువపడలేదు. ఈ పోస్టుతోపాటు బాంబు పేలుడుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇందుకు 'గుర్తు తెలియని వ్యక్తే' కారణమన్న వ్యాఖ్యానాలు వినిపించాయి. మసూద్ అజహర్‌కు 2001 లో పార్లమెంటుపై దాడి, 2005 జూలై 5న అయోధ్య రామ జన్మభూమి మందిరంపై దాడి, ముంబై అల్లర్లు, అఫ్గానిస్థాన్ మజార్ ఎ షరీఫ్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయంపై దాడి తదితర ఘటనలతో సంబంధం ఉంది.

# కొలీజియం పారదర్శక వ్యవస్థే!

» అయోధ్య తీర్పు కర్తృత్వాన్ని ఏ ఒక్క జడ్జికీ ఆపాదించకూడదన్నది ఏకగ్రీవ నిర్ణయం

» ఆర్టికల్ 370 విషయంలో రాజ్యాంగం, చట్టం ఆధారంగానే నిర్ణయం తీసుకున్నాం

» 'పీటీఐ' ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ, జనవరి1: అయోధ్య కేసులో తీర్పు రాసిన న్యాయమూర్తి ఎవరో వెల్లడించకూడదని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా నిర్ణయించిందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదనడం సరికాదని పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370, స్వలింగ వివాహాలకు సంబంధించిన తీర్పులపైన, కేసుల కేటాయింపుపైనా ఆయన ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు. వందేళ్లకు పైబడి కొనసాగిన అయోధ్య వివాదంపై 2019 నవంబరు9న నాటి సుప్రీం సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ ధర్మాసనంలో ఉన్న జస్టిస్ చంద్రచూడ్ నాటి పరిణామాల గురించి వివరించారు. ఏదైనా తీర్పు వెలువరించేముందు ధర్మాసనంలోని సభ్యులంతా కలిసి చర్చించుకున్నట్టే అయోధ్య తీర్పుపై కూడా తాము చర్చించుకున్నామని.. ఆ తీర్పు కోర్టు తీర్పుగానే ఉండాలని నిర్ణయించామని ఆయన వివరించారు. అందుకే ఆ తీర్పునకు సంబంధించి కర్తృత్వాన్ని ఏ ఒక్క న్యాయమూర్తికీ ఆపాదించలేదన్నారు. సుదీర్ఘ సంఘర్షణతో కూడిన చరిత్ర ఉన్న ఈ కేసు విషయంలో విభిన్న దృక్కోణాలు ఉంటాయి కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇక, 370రద్దు రాజ్యాంగబద్ధమా కాదా అనే విషయంలో రాజ్యాంగం, చట్టం ఆధారంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఆ కేసు విషయంలో న్యాయమూర్తులు తాము చెప్పాలనుకున్న విషయాన్ని తమ తీర్పుల ద్వారా వెల్లడించారని.. అవన్నీ ప్రజాబాహుళ్యంలోనే ఉన్నాయన్నారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేమంటూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ప్రశ్నించగా.. ఏ కేసు ఫలితాన్నీ న్యాయమూర్తులు వ్యక్తిగతంగా తీసుకోరని, తీర్పు ఇచ్చాక దాన్ని అక్కడే వదిలేస్తారన్నారు. కొలీజియం వ్యవస్థలో పారదర్శకతకు సంబంధించి పలు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసుల కేటాయింపునకు సంబంధించి నిర్దిష్టమైన విధానం ఉందని, కేసులను రోస్టర్ ప్రకారం కేటాయిస్తామన్నారు.

## బైరి నరేశ్‌పై అయ్యప్ప భక్తుల ఆగ్రహం

» అతని కారు తగిలి భక్తుడికి గాయాలు

» ఏటూరునాగారంలో ఉద్రిక్తత

ఏటూరునాగారం, జనవరి 1: నాస్తికవాది బైరి నరేశ్‌పై అయ్యప్ప భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేశ్, భక్తుల మధ్య వాగ్వాదం ఉద్రిక్తతకు దారి తీసింది. ములుగు జిల్లా ఏటూరునాగారంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో భారతీయ నాస్తిక సంఘం ఆధ్వర్యంలో భీమాకోరెగావ్ స్ఫూర్తి దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బైరి నరేశ్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న అయ్యప్ప భక్తులు అక్కడికి చేరుకొని.. నాస్తిక వాదాన్ని ప్రోత్సహించే ఇలాంటి సమావేశాలు నిర్వహించొద్దని అడ్డుకున్నారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని నరేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సభా ప్రాంగణం నుంచి బయటకు వచ్చేసిన నరేశ్ కారు ఎక్కి వెళ్లిపోయేందుకు సిద్ధమవగా.. కారుకు అడ్డంగా వచ్చి, అయ్యప్ప భక్తులు నిరసన తెలిపారు. ఈ క్రమంలో డ్రైవర్ కారును ముందుకు పోనివ్వగా.. పోగు నరసింహారావు అనే భక్తుడి కాలికి గాయమైంది. అయినా నరేశ్ ఆగకుండా అక్కడి నుంచి కారులో వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఏటూరునాగారం శివారులోని కొమురంభీం నగర్ వద్ద అతని కారు చెట్టుకు ఢీకొని ప్రమాదానికి గురైంది. నరేశ్‌తోపాటు డ్రైవరు, మరో ఇద్దరు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని, నరేశ్‌తోపాటు ఆయన అనుచరులపై కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.

# జీతాల్లేని వీఆర్ఏలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరిస్తుందేమోనని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలంటూ చాలా కాలంగా డిమాండ్ చేస్తూ వచ్చిన వీఆర్ఏలు.. గత ఏడాది 80 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె చేశారు. చివరికి మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ సర్కారు దిగొచ్చి.. వారి డిమాండ్‌కు సూచనప్రాయంగా అంగీకరించింది. అనంతరం గత ఆగస్టులో క్రమబద్ధీకరణ నిర్ణయం తీసుకుంది. 2020 రెవెన్యూ చట్టాన్ని అమలు చేస్తూ వీఆర్ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది.

### 3 కేటగిరీలుగా విభజించి క్రమబద్ధీకరణ..

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 20,555 మంది వీఆర్ఏలను క్రమద్ధీకరిస్తున్నట్లు నాటి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని మంత్రివర్గం ప్రకటించింది. ఈ మేరకు వీఆర్ఏలను ఆరు విభాగాల్లో నియమించేందుకు ఆగస్టు 4న ఆర్థిక శాఖ కొత్త పోస్టులను మంజూరు చేసింది. వీరిలో 16,758 మంది వీఆర్ఏలను వారి విద్యార్హతల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. డిగ్రీ, ఆపై విద్యార్హతలున్న 3,680 మంది, ఇంటర్ పాస్ అయిన 2,761 మంది, 10వ తరగతి వరకు చదువుకున్న 10,317 మందిని వేర్వేరు కేటగిరీలుగా పేర్కొన్నారు. వీరుకాకుండా 61 ఏళ్ల వయసు దాటిన వీఆర్ఏలు మరో 3686 మంది ఉన్నారు. అయితే వీరందరిలో 16,697 మంది వీఆర్ఏలకు మాత్రమే పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. వీరిని విద్యార్హతల ఆధారంగా.. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా, రికార్డు అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేట్లుగా, చైన్‌మెన్ పోస్టుల్లో నియమించారు. మరికొందరికి మునిసిపల్ శాఖలో వార్డు ఆఫీసర్లుగా, నీటిపారుదల శాఖలో లస్కర్లు, మిషన్ భగీరథలో హెల్పర్లుగా పోస్టింగ్ ఇస్తూ ఆగస్టు 10న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీఆర్ఏలకు ఇతర శాఖల్లో పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అప్పటికే ఆయా శాఖల్లో పనిచేస్తూ ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నవారు తప్పుబట్టారు. ఈ నియామకాలపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వీఆర్ఏల విలీనం, ఇతర శాఖల్లో వారి సర్దుబాటుకు సంబంధించిన జీవో 81, 85లను హైకోర్టు సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి వీఆర్ఏలు ఎటూ కాకుండా పోయారు.



### రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి..!

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పూర్వ వీఆర్ఏలకు ప్రభుత్వం కొత్త పోస్టుల ప్రకారం జీతం చెల్లించలేదు. పాత పోస్టుకు సంబంధించిన జీతమైనా చెల్లిద్దామంటే వీఆర్ఏల రద్దు అంశం ఎలా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. దీంతో అప్పటినుంచి వారికి జాబ్ చార్టు గానీ, ఉద్యోగి ఐడీ గానీ కేటాయించకుండా, జీతాలూ చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఈ సమస్య పరిష్కారం కాకుండా ఇలా కొనసాగుతుండగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపై పడింది. వారికి నాలుగు నెలల పెండింగ్ వేతనాలతోపాటు గతంలో వీఆర్ఏలుగా ఉన్నప్పుడు చేపట్టిన 80 రోజుల సమ్మెకాలానికి సంబంధించిన వేతనం కూడా చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే కొందరు వీఆర్ఏలు జీతాలు రాక, ఆర్థిక కష్టాలతో ఆత్మహత్యలకు పాల్పడ్డ ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. వీరి సమస్యను పరిష్కరించడంతోపాటు పోస్టులు రాకుండా మిగిలిన దాదాపు 4 వేల మంది వీఆర్ఏల విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా.. గుర్తించిన వీఆర్ఏల్లో విధి నిర్వహణలో చనిపోయిన వీఆర్ఏ కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. మరోవైపు 61 ఏళ్ల వయసు పూర్తయిన వారి కుటుంబ సభ్యులకు, వివిధ కేసుల్లో సస్పెండ్ అయిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది. సాంకేతిక కారణాలతో పోస్టింగ్ ఆర్డర్ దక్కని వారికీ పోస్టులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం పూర్వ వీఆర్ఏలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న భరోసాతో ఉన్నారు.



# ఆ మహిళలు మనస్సులో ఉండిపోతారు

## తెలుగు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

» చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే ఏపీకి పునర్వైభవం

» టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): యాభై మూడు రోజుల పాటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జైలులో ఉన్నప్పుడు ఆయనకు అండగా నిలబడిన తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కేసులకు భయపడకుండా రెండు తెలుగు రాష్ట్రాల మహిళలు చంద్రబాబుకు మద్దతుగా నిలిచారని ఆమె తెలిపారు. ఆ మహిళలంతా జీవితాంతం తన మనసులో ఉండిపోతారని ఆమె అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నారా భువనేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో డిజిటల్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఎన్ని సమస్యలున్నా అందరూ చిరునవ్వుతో, సంతోషంగా ఉండాలి. అప్పుడే లక్ష్యాలను సాధించగలుగుతాం. ప్రతిరోజూ నూతన సంవత్సరంగానే భావించాలి" అని చెప్పారు. కాగా, చంద్రబాబు మళ్లీ ఏపీ సీఎం అయితేనే ఏపీకి పునర్వైభవం సాధ్యమని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అగ్రస్థానంలో ఉన్న ఏపీని జగన్ అథోగతి పాలుజేశారని ఆయన విమర్శించారు. సోమవారం చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయనకు కంభంపాటి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు నూతన సంవత్సర కానుకగా శ్రీమద్భగవద్గీతను అందజేశారు. చంద్రబాబు తలపెట్టిన కార్యక్రమాలు దిగ్విజయం కావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే టీటీడీపీ మహిళా అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి, టీడీపీ మీడియా కమిటీ చైర్మన్ ప్రకాశ్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాటు తెదేపా సెంట్రల్ మీడియా కమిటీ చైర్మన్‌గా పనిచేసిన ఎల్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రబాబుకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న కంభంపాటి

## జనవరిలో చలి తక్కువే!

### దేశవ్యాప్తంగా ఎక్కువ వర్షాలు: ఐఎండీ

విశాఖపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శీతాకాలం అనగానే గుర్తుకొచ్చేది జనవరి నెల. ఉత్తరాది నుంచి వీచే చలిగాలుల ఉధృతితో ప్రజలు గజగజలాడుతుంటారు. అయితే, ఈ ఏడాది జనవరిలో దేశంలో అనేకచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదుకానున్నాయి. మధ్య భారతంలో రోజుల తరబడి ఉండే చలిగాలుల ప్రభావం(కోల్డ్ డేస్) తగ్గే అవకాశం ఉంది. మొత్తంగా జనవరిలో అనేక ప్రాంతాల్లో రాత్రి వాతావరణం వెచ్చగా ఉంటుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. దీనికి సంబంధించి ఐఎండీ సోమవారం బులెటిన్ విడుదల చేసింది. రాత్రి ఉష్ణోగ్రతలు దక్షిణాన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌తోపాటు ఈశాన్య భారతం మొత్తం సాధారణం కంటే అత్యంత ఎక్కువగా, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఎక్కువగా నమోదవుతాయని అంచనా వేసింది. అదేవిధంగా మధ్యభారతంలో చలిగాలులు వీచే రోజులు(కోల్డ్ డేస్) తక్కువగా ఉంటాయి. జనవరిలో వాయువ్య, ఈశాన్య భారతాల్లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు సాధారణానికి మించి కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.



# బీఆర్ఎస్ కార్యకర్తల దాడి.. కాంగ్రెస్ నేత మృతి

న్యూ ఇయర్ వేడుకల్లో రేవంత్ పాట విషయంలో ఘర్షణ

కాంగ్రెస్ నేత ఛాతీపై బీరుసీసాతో బీఆర్ఎస్ కార్యకర్తల దాడి

అక్కడికక్కడే మృతి... కామారెడ్డి జిల్లా నాచుపల్లిలో ఘటన

ఊర్లో తీవ్ర ఉద్రిక్తత.. మృతుడి కుటుంసభ్యులు, నేతల ఆందోళన

నసురుల్లాబాద్, జనవరి 1: న్యూ ఇయర్ వేడుకల్లో ఇరు వర్గాల మధ్య నెలకొన్న ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై రూపొందించిన ఆడియో సాంగ్‌ను ఆపాలని బీఆర్ఎస్ కార్యకర్తలు.. ఆపొద్దంటూ కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడం.. ఘర్షణకు దారితీయడంతో ఆపేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతపై బీఆర్ఎస్ కార్యకర్తలు బీరు సీసాతో ఛాతీపై కొట్టారు. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో జరిగింది. మృతుడు కాంగ్రెస్ నాయకుడు, 45 ఏళ్ల సాదుల రాములు! గ్రామస్థులు, మృతుడి భార్య వివరాల ప్రకారం.. నాచుపల్లిలో ఆదివారం అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకలు జరిగాయి. రేవంత్‌రెడ్డిపై రూపొందించిన పాట పెట్టుకుని గ్రామానికి చెందిన యువకులు డ్యాన్స్ చేశారు. అక్కడికి బీఆర్ఎస్ కార్యకర్తలు కీసర రవి, కొంగల అనిల్, కొంగల వినోద్, గోపాల్ వెళ్లి ఆ పాటను ఆపేసి.. బీఆర్ఎస్ పాటలను పెట్టాలని వారికి చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా చేరుకుని రేవంత్ పాటను ఆపొద్దని చెప్పడంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య గొడవ మొదలైంది. విషయం తెలుసుకున్న సాదుల రాములు అక్కడికి వెళ్లారు. రెండు పార్టీల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు బీరు సీసాతో రాములు ఛాతీపై కొట్టారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బసవరాజ్ పటేల్ సోమవారం ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. రాములును హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించొద్దంటూ అడ్డుకున్నారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలతో మాట్లాడారు. న్యాయం చేస్తామంటూ ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రాములుకు భార్య సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామానికి చెందిన కీసర రవి, కొంగల అనిల్, కొంగల వినోద్, గోపాల్ కలిసి పథకం ప్రకారం తన భర్తను చంపారని, దీని వెనుక గ్రామ పీఏసీఎస్ చైర్మన్ చలసాని సుధీర్ ప్రోద్బలం ఉందని సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొడవను ఆపేందుకు వెళ్లిన తన భర్త రాములును చంపేస్తామని బెదిరించారని.. ఆ తర్వాత ప్రాథమిక పాఠశాల వద్ద అడ్డుకొని బూతులు తిడుతూ ఛాతీపై దాడి చేసి చంపారని ఆమె ఆరోపించారు.



రాములు (ఫైల్)

## దేశంలో మళ్లీ తగ్గిన విమానయాన ఇంధన ధరలు

న్యూఢిల్లీ, జనవరి 1: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దేశంలోని విమానయాన సంస్థలకు కొత్త సంవత్సర వేళ కేంద్రం శుభవార్తను అందించింది. విమానాల్లో ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను 4 శాతం మేర తగ్గిస్తూ సోమవారం నిర్ణయం తీసుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో విమానయాన ఇంధన ధర కిలో లీటరు (వెయ్యి లీటర్ల)పై రూ. 4,162.5 మేర తగ్గి రూ. 1,01,993 వద్ద కొనసాగుతోంది. విమానయాన ఇంధన ధరలు గతేడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు తగ్గడం విశేషం. అలాగే పలు నగరాల్లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు స్వల్పంగా తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటి వరకు రూ. 1,757గా ఉన్న 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర స్వల్పంగా రూ. 1.50 మేర తగ్గి రూ. 1,755.50 వద్ద కొనసాగుతోంది. వాణిజ్య రాజధాని ముంబైలో ఇప్పటివరకు రూ.1,710కి లభిస్తుండగా ఇప్పుడు రూ.1,708.50కి లభ్యం కానుంది. చెన్నైలో అత్యధికంగా రూ. 5 మేర తగ్గింది. ఇప్పటి వరకు అక్కడ రూ. 1,929కి వాణిజ్య గ్యాస్ సిలిండర్ లభిస్తుండగా ఇప్పుడు రూ. 1,924కి లభ్యం కానుంది. అయితే గృహ గ్యాస్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు.

## కొత్త ఏడాది ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన డ్రోన్లు

» రికార్డు స్థాయిలో 90 షాహెద్ తరహా డ్రోన్లతో దాడి

కీవ్, జనవరి 1: నూతన సంవత్సరం తొలిరోజే రష్యా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. సోమవారం తెల్లవారుజామున రికార్డుస్థాయిలో 90 షాహెద్ తరహా డ్రోన్లతో రష్యా దాడికి పాల్పడినట్టు ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. ఒడెసా నగరంలో డ్రోన్ దాడికి నివాస భవనం కూలిపోయి ఒక బాలుడు మరణించగా, ఏడుగురు గాయాలపాలయ్యారని పేర్కొంది. డ్రోన్ దాడుల వల్ల ఒడెసాలోని ఓడరేవులోనూ మంటలు చెలరేగాయి. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఉక్రెయిన్ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వివాదాస్పద మిలటరీ కమాండర్ రోమన్ షుఖెవిచ్ స్మారకార్థం ల్వీవ్ నగరంలో నిర్మించిన మ్యూజియం కూడా తాజా డ్రోన్ దాడుల్లో తీవ్రంగా ధ్వంసమైంది. డుబ్లియానీ పట్టణంలో యూనివర్సిటీ భవనాలు కూడా ధ్వంసమయ్యాయి. అయితే ఇక్కడ ప్రాణనష్టం ఏమీ జరగలేదు. మరోవైపు రష్యా ఆధీనంలోని డొనెట్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ జరిపిన క్షిపణి దాడుల్లో నలుగురు మరణించగా, 13 మంది గాయాలపాలయ్యారని రష్యా మీడియా తెలిపింది. బాధితుల్లో ఒక జర్నలిస్టు కూడా ఉన్నారని పేర్కొంది. అలాగే, రష్యాలోని సరిహద్దు పట్టణం షెబెకినో ప్రాంతంలో జరిగిన క్షిపణి దాడుల్లో ఒకరు మరణించగా, మరొకరు గాయపడ్డారు.

## తెలంగాణ సీఎం వద్దకు ఏపీ లారీ యజమానులు!

» కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల కోసం విజ్ఞప్తి చేసే యోచన

» నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని జగన్ ప్రభుత్వం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

తెలుగు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలని ఏపీ లారీ యజమానుల సంఘం భావిస్తోంది. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి రెండు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల అంశంపై ఏపీ లారీ యజమానుల సంఘం ప్రయత్నిస్తోంది. ఏపీ రవాణాశాఖ ఉన్నతాధికారులతో కొంతకాలంగా దీనిపై సంప్రదింపులు చేస్తుంటే.. ఇది మనం ఒక్కరం తీసుకునే నిర్ణయం కాదని, తెలంగాణ నుంచి కూడా ఆమోదం రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం లారీ యజమానుల సంఘం ప్రయత్నించినా చాలాకాలంగా లభించలేదు. దీంతో రవాణా రంగంలో సంక్షోభ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవాలని ఏపీ లారీ యజమానుల సంఘం భావిస్తోంది. అపాయింట్‌మెంట్ తీసుకుని.. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల అంశాన్ని ప్రస్తావించాలని యోచిస్తోంది. ఈ పర్మిట్ల వల్ల లారీ యజమానులకు ఆర్థికంగా వెసులుబాటుతోపాటు, రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు గణనీయంగా ఆదాయం కూడా పెరుగుతుంది. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లతో రెండు రాష్ట్రాల్లో మాత్రమే లారీలను నడిపేందుకు అనుమతి ఉంటుంది. ఈ పర్మిట్లు లేకపోవటంతో.. రెండు రాష్ట్రాల్లో నేషనల్ పర్మిట్ మీద లారీలను నడపాల్సి వస్తోంది. దీనివల్ల లారీ యజమానుల మీద అధిక భారం పడుతోంది. నేషనల్ పర్మిట్ వల్ల వచ్చే ఆదాయం ఆ పర్మిట్ పరిధిలోని రాష్ట్రాలన్నిటికీ దామాషా ప్రకారం వెళుతుంది. అదే కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల వల్ల పూర్తి ఆదాయం రెండు రాష్ట్రాలకే వస్తుంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సహకరించాల్సిందిగా ఏపీ లారీ యజమానుల సంఘం నాలుగున్నరేళ్లుగా జగన్ ప్రభుత్వాన్ని కోరుతున్నా అర్థం చేసుకోవటం లేదు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# 'చరిత్రాత్మకం'

ఈశాన్యంలోని ఏ సాయుధ తిరుగుబాటు సంస్థతో ఒప్పందం కుదిరినా, మరీ ముఖ్యంగా, అందులో కేంద్రం భాగస్వామి అయితే, అది కచ్చితంగా 'చరిత్రాత్మక'మే అవుతుంది. అంతిమంగా సదరు ఒప్పందం ఏ మేరకు అమలవుతుందో, క్షేత్రస్థాయిలో అది నెరపే ప్రభావం ఏమిటన్నవి వేరే విషయాలు. అసోంకు చెందిన సాయుధ వేర్పాటువాద సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం— ఉల్ఫా'తో మూడురోజుల క్రితం త్రైపాక్షిక ఒప్పందం కుదిరినప్పుడు హోంమంత్రి అమిత్ షా దానిని చరిత్రాత్మకంగా అభివర్ణించారు. కేంద్రం, రాష్ట్రం, సదరు సంస్థ మధ్య కుదిరిన ఈ ఒప్పందం అసోంలో దశాబ్దాలుగా సాగుతున్న తిరుగుబాటుచర్యలకు తెరదించుతుందని, శాంతిని నెలకొల్పి రాష్ట్రం ఇక ప్రగతిపథంలో నిర్నిరోధంగా పరుగులు తీస్తుందని అమిత్ షాతోపాటు, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సగర్వంగా ప్రకటించారు. 1985లో రాజీవ్ గాంధీ చేసుకున్న అసోం ఒప్పందం గురించి మాటమాత్రంగా కూడా ప్రస్తావన చేయకుండా, అరబింద రాజ్‌ఖోవా సారథ్యంలోని ఒక వర్గంతో కుదుర్చుకున్న ఇప్పటి ఒప్పందాన్ని పాలకులు ఘనంగా కీర్తించారు.

పరేష్ బారువా నేతృత్వంలో ఇంకా సాయుధపోరాట మార్గాన్నే అనుసరిస్తున్న ఒక వర్గాన్ని పక్కనబెట్టి, 2011లోనే రాజీకీ, చర్చలకు సిద్ధపడిన రాజ్‌ఖోవా వర్గంతో ప్రస్తుత ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం, సదరు సంస్థ రద్దవుతుంది, వీరంతా ఆయుధాలు వదిలేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతారు. కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షన్నరకోట్ల అభివృద్ధి పనులు చేపడతాయి, రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేకంగా ఓ ఐదువేలకోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ ఇస్తుంది. డీలిమిటేషన్ సహా అన్ని విషయాల్లోనూ భవిష్యత్తులో సైతం స్థానికుల ప్రయోజనాలు దెబ్బతినకుండా కేంద్రం జాగ్రత్తలు తీసుకుంటుంది. బారువా వర్గాన్ని వదిలిపెట్టడం సరికాదని, ఉల్ఫాతో అసోంకు ఉన్న ముప్పు పూర్తిగా తొలగిపోవాలంటే ఆయనను కూడా కలుపుకొనిపోవాలని పదిహేను పక్షాల ఏజీపీ అంటోంది. అసోం సహా పలు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయానికి రాజఖోవా వర్గం పరోక్ష సహకారం ఉన్నదని బారువా సహా చాలామంది ఆరోపణ. గత కొద్దినెలల్లోనే మూడు అతి పెద్ద బాంబు పేలుళ్ళతో, ప్రధానంగా ఈశాన్య అసోంలోని సైనికస్థావరం సమీపంలో నవంబరులో జరిపిన దాడితో బారువా వర్గం తన ఉనికిని చాటుకుంది. బలగం తక్కువే అయినా, శాంతిని విచ్ఛిన్నం చేయగల సమర్థత దానికి బలంగానే ఉన్నది.

సరిగ్గా మూడేళ్ళక్రితం, నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్ (ఎన్‌డిఎఫ్‌బి)తో ఇదేవిధంగా ఓ త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. స్వతంత్ర బోడోరాష్ట్రం కోసం తీవ్రస్థాయిలో పోరాడుతున్న అల్ బోడో స్టూడెంట్ యూనియన్ (ఏబిఎస్‌యు) ఈ ఒప్పందంలో ఒక కీలకభాగస్వామి. స్వతంత్ర రాష్ట్రం డిమాండ్ వినా, సమస్త బోడో ప్రజల భాష, సంస్కృతీ పరిరక్షణకు, వారి రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి ఈ ఒప్పందం హామీ పడింది. అన్ని నిషేధిత బోడో గ్రూపులతో జరిగిన ఈ ఒప్పదంతో అవన్నీ రద్దయిపోయి, అసోం ముక్కలయ్యే ప్రమాదం ముగిసిపోయిందంటూ అప్పట్లో దానిని కూడా అమిత్ షా చరిత్రాత్మకమనే అభివర్ణించారు. ఇప్పుడు ఉల్ఫాలోని ఒక వర్గంతో కేంద్రం త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకున్న తరువాత, మూడేళ్ళనాటి తమ ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం వీసమెత్తు గౌరవించలేదని, పైగా దాని స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నదంటూ ఏబిఎస్‌యు అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. ఒప్పందంలో హామీ ఇచ్చిన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు దక్కని పక్షంలో మళ్ళీ ఉద్యమాలు తప్పవని హెచ్చరిక చేశారు.

ఎంతోకాలంగా చర్చలకు సానుకూలంగా బలమైన రాజ్‌ఖోవా వర్గంతో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో, బారువా మీద కూడా ఒత్తిడిపెరిగి అస్త్రసన్యాసం చేసినపక్షంలోనే అసోంకు పూర్తిశాంతి చేకూరినట్టు. 'విదేశీ'యులకు వ్యతిరేకంగా, స్థానికుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంతో సుదీర్ఘకాలంగా సాగుతున్న పోరాటాలు ఇటువంటి ఒప్పందాలతో తాత్కాలికంగా చల్లారవచ్చు. సార్వత్రిక ఎన్నికల ముందు వాటిని తమ విజయంగా చూపవచ్చు, చరిత్రాత్మకమని అభివర్ణించవచ్చు. కానీ, అమిత్ షా హామీ ఇచ్చినట్టు కామాలు, ఫుల్‌స్టాప్‌లతో సహా అవి అమలైనప్పుడు మాత్రమే, పోరాటాలు తిరిగి రాజుకోవు, మొండికేసిన గ్రూపులు కూడా దారికివస్తాయి. తమకు అనాదిగా అన్యాయం జరుగుతున్నదని భావిస్తున్న ప్రజలు ఈ ఒప్పందాలతో తమ ప్రయోజనాలకు భద్రత చేకూరిందని నమ్మడం ముఖ్యం.

# శ్రీరామతత్వమే భారతీయత

సమస్త హిందువులూ జనవరి 22 ఎప్పుడొస్తుందా అని వేచి చూస్తున్నారు. అయోధ్యలో రామ జన్మభూమిలో శ్రీరాముడి మందిరాన్ని ప్రతిష్ఠాపించే రోజు అది. ప్రతి హిందువు ఇంటిలో పూజించే ఇష్టదైవం శ్రీరాముడు. భారత జాతీయ జీవనంలో రాముడు, రామాయణానికి ఉన్న ప్రాధాన్యం అపారమైనది. రామాయణం కొన్ని దశాబ్దాలుగా భారతీయుల సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తోంది. అది మానవ ఉద్వేగాలు, నైతిక సందిగ్ధాల సమ్మేళనం. రామాయణం అనువాదం కాని భాష అంటూ దేశంలో లేదు. రామాయణ గాథ అన్ని భాషల్లో, సాహిత్యాల్లో సృజనాత్మకతను ప్రతిఫలించింది. ప్రతి జానపద సంప్రదాయంలోనూ శ్రీరాముడున్నాడు. 'రామ్' అన్న పేరు లేకుండా దేశంలో ఏ కులమూ, మతమూ లేదు. సిక్కుల పవిత్ర గ్రంథం గురుగ్రంథ్ సాహిబ్‌లో శ్రీరాముడి పేరు కొన్ని వేలసార్లు ప్రస్తావితమయింది. తులసీదాస్ నుంచి సూరదాస్ వరకూ, కబీర్ నుంచి తుకారాం వరకూ, అస్సాంలో శంకర దేవ్ నుంచి తమిళనాడులో కంబ, తెలుగులో విశ్వనాథ వరకూ అనేకమంది శ్రీరాముడుని అనేక రీతుల్లో అభివర్ణించారు. పర్షియన్ కవి అల్లామా ఇక్బాల్ కూడా శ్రీరాముడిని 'ఇమామ్ ఏ హింద్' (భారత ఆధ్యాత్మిక నాయకుడు)గా అభివర్ణించారు. శ్రీరామ తత్వమే భారతీయత అన్న విషయంలో సందేహంలేదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

సనాతన ధర్మానికి, సంస్కారానికి, పితృవాక్య పరిపాలనకూ, దుష్ట సంహారానికీ పేరొందిన శ్రీరాముడు మనదేశంలో అనాదిగా నెలకొన్న విలువలకు ప్రతీక. ఆ విలువలు సార్వత్రికమైనవి, శాశ్వతమైనవి. అయోధ్యలో జన్మించిన శ్రీరాముడి ఆనవాళ్లు శ్రీలంక వరకు అడుగడుగునా ఉన్నాయి. రాముడి పాదాలను దేశమంతా ప్రజలు పూజిస్తారు. కోదండ రాముడి మందిరం లేని ఊరు మన దేశంలో లేదు. కోట్లాది భారతీయుల ఇళ్లలో ఇప్పటికీ రామకోటి రాసేవారున్నారు. మహాత్మాగాంధీయే స్వయంగా రామరాజ్యాన్ని భారతదేశానికి ఆదర్శంగా భావించారు. చివరి క్షణంలో కూడా ఆయన హే రామ్ అని తనువుచలించారు. రాముడు ఒక ఆదర్శవంతమైన రాజు. ఉన్నత మానవ లక్షణాల సమ్మేళనం. రామరాజ్యం అనేది సుపరిపాలనకు సంకేతం. బీజేపీ ఈ సుపరిపాలననే కోరుకుంటుంది.

అలాంటి శ్రీరాముడి చరిత్రాత్మక మందిరం ఇప్పుడు ప్రారంభమవుతున్నదంటే ప్రతి భారతీయుడి మేను భక్తితో పులకరిస్తోంది. ప్రధాని మోదీ పిలుపునిచ్చినట్లుగా జనవరి 22న ప్రతి భారతీయుడి ఇల్లూ శ్రీరామ జ్యోతి దీపకాంతులతో దీపావళి రోజు మాదిరి శోభాయమానం కానున్నాయి. ఘర్ ఘర్ యాత్ర పేరుతో జనవరి 1 నుంచి 15 వరకు దేశంలో ఇంటింటికీ చేరుకుని అయోధ్యలో రామమందిర నిర్మాణానికి మోదీ ప్రభుత్వం చేసిన కృషి వివరించేందుకు బీజేపీ ఉద్యుక్తమైంది.

భారతదేశంలో ప్రజల నమ్మకాలు, విశ్వాసాలు, దైవభక్తి చరిత్రతో ఏ విధంగా ముడివేసుకుని ఉన్నాయో భారతీయ జనతా పార్టీకి తెలిసినంతగా మరే పార్టీకి తెలియదు. సోమనాథ మందిరం మాదిరే అయోధ్యలో శ్రీరామ మందిరం కూడా ఒక ముస్లిం దురాక్రమణదారు దాడికి గురైందన్న చరిత్ర తెలిసినా ఆ పార్టీలన్నీ ప్రజల నమ్మకాలను అవహేళన చేసి విశ్వాసాలతో చెలగాటమాడుకున్నవే. కొన్ని దశాబ్దాల పాటు శ్రీరాముడిని ఆయన జన్మభూమిలోనే బందీ చేసిన పార్టీలవి. ఆయనను ప్రజలు దర్శించకుండా అడ్డుకున్న పార్టీలివి. న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి శ్రీరాముడికే న్యాయం జరగకుండా నిరోధించిన పార్టీలవి. ఎవరైతే శ్రీరాముడి మందిరం స్థానంలో కట్టడం నిర్మించారో వారి తరఫున వకాల్తా పుచ్చుకున్న పార్టీలవి. కరసేవ చేసేందుకు వచ్చిన వేలాది మందిపై కాల్పులు జరిపి అయోధ్య వీధుల్లోనూ, దేశ వ్యాప్తంగానూ ప్రాణాలు బలిగొన్న పార్టీలవి. కాంగ్రెస్ పార్టీ ఊగిసలాట ధోరణి, ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల ఎప్పుడో పరిష్కారం కావల్సిన అయోధ్య వివాదం కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా మిగిలిపోయింది. లౌకిక వాదానికి కాంగ్రెస్, ఇతర పార్టీలు తప్పుడు అర్థాన్నిచ్చాయి. మన రాజ్యాంగ నిర్మాతల ప్రకారం లౌకికవాదం అంటే సర్వమతాల పట్ల సమభావంతో ఉండటం. మన చరిత్రను, సంప్రదాయాన్నీ తిరస్కరించినట్లు ఎంత మాత్రమూ కాదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం భారతీయ జనతా పార్టీ 1990లలో చేపట్టిన ఉద్యమానికి అపూర్వ ప్రతిస్పందన లభించింది. 1990 సెప్టెంబర్ 25న సోమనాథ్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు లాల్ కృష్ణ అద్వాణీ చేపట్టిన రథయాత్రను జెండా ఊపి ప్రారంభించింది నాడు సాధారణ నాయకుడుగా ఉన్న నరేంద్రమోదీ. ఇప్పుడు ఆయన చేతుల మీదుగానే అయోధ్యలో రామమందిర ప్రారంభం కావడం అపూర్వం.



శ్రీరాముడిని 'ఇమామ్ ఏ హింద్' (భారత ఆధ్యాత్మిక నాయకుడు)గా అల్లామా ఇక్బాల్ అభివర్ణించారు. రామరాజ్యం అనేది సుపరిపాలనకు సంకేతం. ఈ సుపరిపాలననే భారతీయ జనతా పార్టీ కోరుకొంటోంది. దేశప్రజల అభ్యున్నతికై ఆ సుపాలనను అందించేందుకు అది నిబద్ధమయింది.

ప్రధాని మోదీకి భారతదేశ ఆత్మ తెలుసు కనుకనే అభివృద్ధితో సమానంగా ఆధ్యాత్మికతకు విలువ ఇచ్చారు. 'నా శరీరంలో ప్రతి కణంలో దైవభక్తి ఉన్నది. ఒక భారతీయుడుగా నేను కూడా రామమందిర ప్రతిష్ఠాపన కోసం ఆతురతతో ఎదురుచూస్తున్నాను. మనం 550 సంవత్సరాలు వేచి చూశాం. ఇక మరికొన్ని రోజులు వేచి చూస్తే చాలు..' అని మోదీ రెండు రోజుల క్రితం అయోధ్యలో ప్రకటించారు. అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణానికి అన్ని అడ్డంకులూ తొలగించిన మోదీ శ్రీరాముడి నగరంలో రూ. 15వేల కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి అయోధ్య భారతదేశ చిత్రపటంలో సుస్థిరస్థానం పొందేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. వాల్మీకి మహర్షి రామాయణంలో వర్ణించిన మాదిరే అయోధ్యా నగరి ఆధునిక వసతులతో ఒప్పారేలా నిర్మించేందుకు మోదీ కంకణం కట్టుకున్నారు. 1943 డిసెంబర్ 30న నేతాజీ సుభాష్ చంద్రబోస్ అండమాన్‌లో త్రివర్ణ పతాకం ఎగుర వేశారు. 2023 డిసెంబర్ 30న నరేంద్రమోదీ నూతన భారతానికి అనుగుణంగా నూతన అయోధ్య నగరాన్ని ప్రారంభించారు. అయోధ్యలో నిర్మించిన విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు పెట్టి మోదీ ప్రారంభించారు.

ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే తన ప్రాచీన వారసత్వాన్ని కాపాడుకోవాలి. వర్తమానానికీ, గతానికీ మధ్య వారధి నిర్మిస్తూనే భవిష్యత్‌కు బాటలు వేయాలి. మోదీ ప్రభుత్వం చేస్తున్నదదే. అభివృద్ధి పథకాలను అమలు చేయడమే కాదు, వాటి ప్రయోజనం పొందినవారిని చేరుకోవాలన్నదే మోదీ సంకల్పం. డిసెంబర్ 30న ఆయన ఉజ్వల యోజన వల్ల ప్రయోజనం పొందిన ఒక దళిత లబ్ధిదారుడి ఇంటిని సందర్శించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో తన ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన ప్రతి ఒక్కరినీ కలుసుకొమ్మని ఆయన నేతలను ఆదేశించారు. తాను స్వయంగా లబ్ధిదారులను కలుసుకోవడం ప్రారంభించారు. పథకాల అమలు పట్ల చిత్తశుద్ధి గల నేత చేసే పని ఇది.

శ్రీరాముడి మందిర నిర్మాణాన్ని రాజకీయం చేయాల్సిన అవసరం బీజేపీకి లేదు. ఎందుకంటే రామజన్మభూమి ఉద్యమాన్ని నిర్వహించింది బీజేపీయే అని ఈ దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అయోధ్యలో నిర్మిస్తున్నది శ్రీరాముడి మందిరం కాదు. బీజేపీ మందిరం అని ఒక కాంగ్రెస్ నేత అన్నారు. బీజేపీ ప్రతి నేత హృదయంలో శ్రీరాముడి మందిరం ఉంటుందని ఈ దేశ ప్రజలకు తెలుసు.

# ఆధునిక ప్రపంచం అసలు గుట్టు ఏమిటి?

సృష్టి రహస్యంపై ఆసక్తిలేని మనిషి ఉండడు. అది ప్రేరేపిస్తున్న అన్వేషణే మన చరిత్ర అయింది. ఆ క్రమంలోనే మతాలు పుట్టాయి. పురాణాలు పురుడు పోసుకున్నాయి. సాహిత్యాలు ఉద్భవించాయి. తత్వ జిజ్ఞాసలు ఎదిగాయి. విజ్ఞానాలు వికసించాయి. కాలక్రమంలో లోక సృష్టిపైనే కాదు.. సమాజ పుట్టుక గురించీ కొత్తచూపు మొదలైంది. ఆర్థిక అంతరాల మూల కారణాలపై పరిశోధనలు పెరిగాయి. ధనిక పేద సమాజాల చరిత్రపై లోతైన విశ్లేషణలు మొదలయ్యాయి. అట్లా వచ్చిన వాటిల్లో 'రాబర్ట్ బి మార్క్స్' రాసిన 'ఆధునిక ప్రపంచ మూలాలు' అన్న రచన చాలా ముఖ్యమైంది. ఎంతో చరిత్ర కలిగిన దేశాలు వెనుకబడి పోవటం అందరికీ తెలిసిందే. పరాయి పాలనలోనూ మగ్గిపోయాయి. స్వంతపాలన కోసం విన్నపాలూ విప్లవాలూ చేయాల్సి వచ్చింది. ఆర్థిక, సాంకేతిక పరాధీనతలు సర్వసాధారణం అయ్యాయి.

ఈ దుస్థితికి కారణాలేమిటి? మన సనాతన సంస్కృతుల్లోనే లోపం ఉందా? ఆర్థిక పరుగుకు పనికిరాని మత నమ్మకాలు, విలువల్లో మనం కూరుకుపోయామా? కార్యకారణ సంబంధాలను వెతికే శాస్త్ర విజ్ఞానాన్ని విస్మరించి విఫల జీవులం అయ్యామా? ప్రయోగశీలతకు యూరపు సంస్కృతి మాత్రమే పెద్దపీట వేసిందా? సంప్రదాయాలను సమూలంగా ప్రశ్నించిన మహామహులు యూరపులోనే పుట్టి శాస్త్ర సాంకేతిక ఆధిక్యతను సంపాదించి పెట్టారా? వీటన్నిటికీ అవుననే సమాధానాలకు మనం అలవాటు పడిపోయాం. యూరపు మేధావులూ ఆ భావాల్నే కలగచేశారు. వీటిని ప్రశ్నించటం కొంతకాలం నుంచి మొదలైనా వాటి ప్రభావం ఇంకా బలంగానే ఉంది. ఇప్పటికీ పాశ్చాత్య ప్రమాణాలను, ఆర్థిక ఉన్నతిని అందుకోవటమే మనకు లక్ష్యంగా ఉంది.

వ్యవసాయం, చేతి వృత్తులపై ఆధారపడిన సమాజాలన్నీ వేల ఏళ్లు కొనసాగాయి. ఈ రంగాల్లోని శ్రమజీవులు సృష్టించిన సంపదలో భారీగా వాటాలు రాబట్టి రాజులు, జమిందార్లు ఆధిపత్యం చలాయించారు. ఆధునిక ప్రపంచం ఆవిర్భావం అంటే ఈ సమాజం మౌలికంగా మారిపోవటమే. మరి కొత్త ప్రపంచం స్వభావం ఏమిటి? ప్రధానంగా అది నాలుగు పరిణామాల చుట్టూ తిరిగింది. ఇంకా తిరుగుతూనే ఉంది. అందులో మొదటిది.. పారిశ్రామికీకరణ ఊపందుకోవటం. రెండోది.. జాతీయ రాజ్యాలు (నేషన్ స్టేట్స్) ఏర్పడటం. మూడోది.. దేశాల మధ్యా దేశాల లోపలా ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరగటం. నాలుగోది.. పర్యావరణాన్ని కనీవినీ ఎరగని రీతిలో ప్రమాదకరంగా మార్చివేయటం. ఈ పరిణామాలు అభివృద్ధికి ఎంతగా కారణమయ్యాయో అంతే స్థాయిలో విధ్వంసాలనూ సంక్షోభాలనూ యుద్ధాలనూ సృష్టించాయి. 21వ శతాబ్దంలోనూ మనం దీన్నుంచి బయటపడలేదు. ప్రపంచాన్ని వణికిస్తున్న గ్లోబల్ వామింగ్, యుద్ధాలు, ఆర్థిక దోపిడీలే ఇందుకు నిదర్శనం.

ఈ నాలుగు పరిణామాలు జరక్క ముందు యూరపుకు ఆధిపత్యం లేదు. ఆసియానే చాలా వాటిల్లో అగ్రగామిగా ఉండేది. జనాభా, సాంకేతికత, పరిశ్రమలు, రాజ్యనిర్మాణం.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా ఆసియా ఆధిక్యత కనపడేది. ప్రపంచ జనాభా ఇప్పుడు 800 కోట్లు దాటింది. కానీ 1400 సంవత్సరంలో అది 38 కోట్లు మాత్రమే ఉండేది. అందులో 25 నుంచి 40 శాతం వరకూ చైనాలో ఉంటే భారత్‌లో మరో 20 శాతం మంది జీవించేవారు. యూరపులో 25 శాతం వరకూ ఉండేవారు. మిగిలిన జనాభా ముస్లిం రాజ్యాల్లోనూ, ఆఫ్రికా, అమెరికా ఖండాల్లోనూ ఉండేవారు. ఆనాడున్న 25 పెద్ద నగరాల్లో తొమ్మిది చైనాలో ఉండేవి. నాన్జింగ్ (చైనా) అత్యంత పెద్ద నగరం. రెండోది కర్ణాటకలోని మన విజయనగరం. ఇక మూడోది కైరో. ప్యారిస్ నాలుగో స్థానంలో ఉండేది. పెద్ద నగరాల్లో అయిదు మాత్రమే ఆనాడు యూరోపులో ఉండేవి. 1750 నాటికి ప్రపంచ జనాభా 100 కోట్లకు చేరుకున్నా దాని ప్రాంతీయ విస్తరణలో పెద్దగా మార్పు రాలేదు. ప్రపంచ ఆర్థిక సంపదలో మూడింట రెండు వంతుల వాటా భారత్, చైనాల నుంచే ఉండేది. వందేళ్ల తర్వాత అంటే 1850ల నాటికి పరిస్థితిలో స్పష్టమైన మార్పు వచ్చింది. యూరోపు ఆధిపత్యం దాదాపుగా స్థిరపడి పోయింది. ఇది ఎందుకు జరిగింది? యూరపు సంస్కృతి గొప్పతనం దానికి కారణం కాదు. అదే ఉంటే 1750లకు ముందూ యూరపు పలు రంగాల్లో అగ్రగామిగా ఉండేది. మరి కారణం ఏమిటి? కాలం కలిసొస్తే అనూహ్య ఘటనలు జరుగుతాయని మనం అనుకుంటాం కదా! అట్లాంటివే కొన్ని జరిగి యూరపు ఆధిక్యతకు దోహదం చేశాయి. ఇందులో ప్రధానమైంది అమెరికా ఖండాన్ని యాదృచ్ఛికంగా కనుక్కోటం.





ప్రపంచ జనాభా ఇప్పుడు 800 కోట్లు దాటింది. కానీ 1400 సంవత్సరంలో అది 38 కోట్లు మాత్రమే. ఆనాడున్న 25 పెద్ద నగరాల్లో తొమ్మిది చైనాలో ఉండేవి. నాన్జింగ్ (చైనా) అత్యంత పెద్ద నగరం. రెండోది కర్ణాటకలోని మన విజయనగరం. ఇక మూడోది కైరో. ప్యారిస్ నాలుగో స్థానంలో ఉండేది. పెద్ద నగరాల్లో అయిదు మాత్రమే ఆనాడు యూరోపులో ఉండేవి. 1850ల నాటికి పరిస్థితిలో స్పష్టమైన మార్పు వచ్చింది. యూరోపు ఆధిపత్యం దాదాపుగా స్థిరపడి పోయింది. ఇది ఎందుకు జరిగింది?

వెయ్యి ఏళ్ల కిందట చైనా సాధించిన అభివృద్ధి ప్రభావం ఆనాటి ప్రపంచమంతా పడింది. ఆ తర్వాత కొన్నాళ్లకు అంటే 1400 నుంచి 1800 వరకూ ఇంకా పుంజుకుని ప్రబల ఆర్థిక శక్తిగా మారింది. కాస్త ఆలస్యంగానైనా భారత్ కూడా గణనీయ ప్రగతినే సాధించింది. కచ్చితంగా చెప్పుకోవాలంటే ప్రపంచ ప్రధాన ఉత్పత్తుల్లో 70 నుంచి 80 శాతం ఆసియాలోనే ఉత్పత్తి అయ్యేవి. చైనా సిల్కు, పింగాణి, తేయాకుకు.. భారత వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలకు ఎనలేని గిరాకీ ఉండేది. వెండి నాణేల మారకం ఆధారంగా రెండు సమాజాల్లోనూ వ్యాపార లావాదేవీలు బాగా సాగేవి. దీంతో వెండికి విపరీతమైన డిమాండు ఏర్పడింది. అమెరికాలో అప్పనంగా దొరికిన వెండి యూరపు గతిని మార్చింది. ఆ వెండితో భారత్, చైనా ఉత్పత్తులను విరివిగా యూరపు వ్యాపారులు కొనుగోలు చేయటం మొదలు పెట్టారు. అప్పటికి ఉన్ని వస్త్రాల్లాంటి రెండుమూడు ఉత్పత్తులకు తప్ప దేంట్లోనూ యూరపుకు చెప్పుకోదగిన ప్రత్యేకత లేదు. ముఖ్యంగా భారత్, చైనాలకు అమ్మదగిన ప్రత్యేక వస్తువులు యూరపు దేశాల దగ్గర పెద్దగా లేనేలేవు. అమెరికా వెండితో ఆఫ్రికను బానిసలను కొని మళ్లీ అమెరికాకే తీసుకు పోయేవారు. అప్పటికే యూరపు వాసులు అంటించిన అంటువ్యాధులతో స్థానిక అమెరికన్లు కోట్లల్లో చనిపోయారు. 1491 నాటికి అమెరికా ఖండంలో 7 కోట్ల ప్రజలుంటే 1600 నాటికి ఆ సంఖ్య 80 లక్షలకు పడిపోయింది. పనికి మనుషులే దొరకకుండా పోయారు. క్రమేపీ బానిసల తరలింపు బాగా పెరిగింది. 1800 నాటికి 90 లక్షల మందిని పట్టుకెళ్లారు. బానిసల శ్రమతో చెరకు తోటలను పెంచారు. పత్తిని పండించారు. తయారైన చక్కెరను, ముడిపత్తిని భారీగా యూరపునకు తరలించారు. ఇక్కడో విచిత్రాన్ని చెప్పుకోవాలి. 1650 నాటికి శ్వేతజాతీయుల కంటే ఆఫ్రికన్లే అమెరికాలో అధిక సంఖ్యలో ఉండటమే ఆ విచిత్రం. కొల్లగొట్టిన బంగారం, వెండితో పాటు బానిసల శ్రమతో పండించిన పంటలు యూరపు వాసుల చేతుల్లో సంపదపోగు పడేలా చేసింది. దీనికి తోడు 1750 తర్వాత భారత్‌లాంటి దేశాల్లో నెలకొల్పిన వలసపాలనతో మొదలైన సంపద తరలింపూ దీనికి జోడైంది.

పారిశ్రామిక విప్లవం మొదలవ్వటానికి డబ్బులు ఒక్కటే సరిపోవు. అలా సరిపోతే అమెరికా నుంచి తరలించిన వెండి నిల్వలతో స్పెయిన్ అగ్రగామి పారిశ్రామిక దేశంగా ఎదిగి పోయేది. 1730—50ల నాటికి చైనాతో పాటు ఇంగ్లండు లాంటి దేశాల్లో అటవీ సంపదను విపరీతంగా వాడేశారు. పచ్చదనం చాలావరకూ హరించుకుపోయింది. లండన్‌లో చలికాచుకోటానికి కలప లభించని పరిస్థితి ఎదురైంది. అప్పుడే లండన్ చుట్టూ భూఉపరితలానికి చాల దగ్గరలో విస్తృతంగా బొగ్గు నిల్వలు ఉన్న విషయం బయటపడింది. చైనాకు ఆ అవకాశం దక్కలేదు. బొగ్గు వాడకం బ్రిటన్ గతినే మార్చివేసింది. ప్రకృతి ప్రసాదించిన ఈ వనరును మండించటంతో ఇనుము ఉత్పత్తి బాగా పెరిగింది. ఆవిరి శక్తి పెద్దఎత్తున ఉపయోగంలోకి వచ్చింది. క్రమేపీ వస్త్ర తయారీలో యంత్రాలను ప్రవేశపెట్టారు. బొగ్గుని తరలించటానికి రైలుమార్గాలను ఏర్పరచారు. క్రమేపీ ఒకటి తర్వాత ఒకటి అనేక పనులకు యంత్రాలు రూపొందాయి. ఆయుధాల తయారీలోనూ వాటి వాడకం మొదలైంది. నౌకా నిర్మాణంలో ఇనుము వాడకం పెరిగింది. వాటి నుంచి ఫిరంగులను ప్రయోగించటం ఆరంభమైంది. యూరపు ఆయుధ సంపత్తికి తూగలేని ఆసియా దేశాలు యుద్ధాల్లో ఓడిపోయాయి. దేశాలను ఓడించొచ్చు. కానీ పారిశ్రామిక ఆధిక్యతను అంత తేలికగా దెబ్బతీయలేరు. అది జరగాలంటే చైనా, భారత్ ఉత్పత్తులను పోటీ నుంచి తొలగించాలి. వాటి దిగుమతిపై అధిక సుంకాలు విధించి బ్రిటన్ వస్త్రపరిశ్రమలకు పోటీ లేకుండా చేశారు. ఆ తర్వాత వివిధ చౌక ఉత్పత్తులతో ఆసియా దేశాల మార్కెట్లను ముంచెత్తారు. క్రమేపీ ఆ దేశాలను ముడిసరుకు సరఫరా ప్రాంతాలుగా మార్చివేశారు.



■ రాహుల్ కుమార్

జాతీయ రాజ్యాలు ఏర్పడటంలో యుద్ధాలు నిర్వహించిన పాత్ర అంతా ఇంతా కాదు. ఆసియాలో పెద్దపెద్ద సామ్రాజ్యాలు ఉంటే యూరపు ముక్కలు చెక్కలుగా పరస్పరం సంఘర్షించే దేశాలుగా విభజితమై ఉండేది. 1400 నాటికే వందల రాజ్యాలు ఉన్నాయి. 1000 నుంచి 1500 సంవత్సరం వరకూ యూరపు పాలకులకు యుద్ధాలే ప్రధాన వ్యాపకం. ప్రతిరోజూ ఏదో మూల యుద్ధాలు జరుగుతూనే ఉండేవి. ఆ యుద్ధ అవసరాల కోసమే రాజ్యాల కేంద్రీకరణ మొదలైంది. ఆ కేంద్రీకరణను బలోపేతం చేయటానికే జాతీయవాద భావాలు ఉనికిలోకి వచ్చాయి. అనేక యుద్ధాలకూ, ఉన్మాదాలకూ కూడా ఈ భావాలు తోడ్పడ్డాయి. దేశభక్తి సిద్ధాంతాలూ యుద్ధాల నేపథ్యం నుంచే పుట్టాయి. నిరంతర యుద్ధాలతో సైన్యాలను ఆధునికీకరించాల్సిన అగత్యం ఏర్పడింది. పారిశ్రామిక విప్లవం కలిగించిన ఆధిక్యతతో చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఇతర దేశాలను దోచుకోవటంతో అసమానతలు అసాధారణంగా పెరిగాయి. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని కొల్లగొట్టటం ఒకనాడు గొప్ప ప్రగతిశీల చర్య అయింది. 1970ల వరకూ ఈ విధ్వంసం ఆగకుండా సాగింది. అప్పటి నుంచి పెరుగుతున్న పర్యావరణ అవగాహనతో విధ్వంసం కాస్త నిదానించినా మానవజాతి ఇంకా ప్రమాదమార్గంలోనే ఉంది. సమగ్ర దృష్టితో చూస్తే ఆధునిక ప్రపంచ ఆవిర్భావంతో అంతా మంచే జరిగిందని చెప్పలేం. 500 ఏళ్ల చరిత్ర చెబుతున్న చేదు నిజం అదే. అందులో మంచి చెడులను సమీక్షించుకుని అడుగులు వేయకపోతే మానవ మనుగడకు భరోసా ఉండదు.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

# ఖైదీల సమస్యలపై సమీక్ష తక్షణావసరం

ప్రజా దర్బార్ ప్రారంభమైన రోజు నుంచి బెయిల్ మీద ఉన్న దీర్ఘకాలిక ఖైదీలు, వారి కుటుంబాల మధ్య ఒక వీడియో చక్కర్లు కొడుతోంది. అది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటుకు ఓటు ఆరోపణతో ఒక నెల రోజులు చర్లపల్లి జైలుకు విచారణ ఖైదీగా వెళ్లి వచ్చిన తర్వాత 2015 జూలై 19న 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో మాట్లాడినది. అందులో ఆయన ముఖ్యమైన ఖైదీల సమస్యలు ప్రస్తావించారు. ఆనాడు న్యాయస్థానం ద్వారా ప్రత్యేక తరగతి ఖైదీ హోదా పొందిన ఆయనకు నాగయ్య అనే ఒక జీవిత ఖైదీని వంటవాడిగా, సహాయకుడిగా జైలు అధికారులు నియమించారు. అతను ఒక దళితుడు. అతని ఇంగిత జ్ఞానాన్ని, రాజకీయ పరిజ్ఞానాన్ని రేవంత్ రెడ్డి చాలా మెచ్చుకున్నారు. అతనికి, అతని చిన్నాన్నకు మధ్య భూమి తగాదాలో చిన్నాన్న భార్య చేతిలో బిడ్డతో మధ్యకు రావడం వల్ల, పోట్లాటలో ఆ బిడ్డ చనిపోవడంతో, అతనికి జీవిత శిక్ష పడింది.

మన జైళ్లలో నాగయ్య లాగా క్షణికావేశంతో నేరం చేసినవారే అత్యధికులు. ఈ విచక్షణ లేకపోవడం వల్ల సమాజం వారి పట్ల కాఠిన్యాన్ని ప్రదర్శిస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కాఠిన్యం మరింత పెరిగింది. గత పదేళ్లలో రెండుసార్లు మాత్రమే జీవిత ఖైదీలను ప్రభుత్వం విడుదల చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ నాలుగు సార్లు ఖైదీలను వదిలిపెట్టింది. తెలంగాణ ప్రభుత్వం 2016లో, 2020లో ఏడేళ్ల వాస్తవ శిక్షా కాలాన్ని, సత్ప్రవర్తనకు ఖైదీలు సంపాదించుకునే మూడేళ్ల రెమిషన్‌తో కలిపి పదేళ్లు పూర్తి చేసుకున్న వారిని విడుదల చేసింది. ఏళ్ల విరామం తర్వాత అయినా అతి తక్కువ మందికి క్షమాభిక్ష ప్రసాదించింది. దీనికి కారణాలు అనేకం. మొదటిది, 2016లో ఖైదీల విడుదలకు ఐదు అర్హతలు నిర్దేశిస్తే, విడుదల చేయకపోవడానికి 19 అనర్హతలు విధించింది. పిల్లలు, స్త్రీల మీద జరిగే నేరాలు, ప్రభుత్వ ఉద్యోగుల మీద, పౌర సరఫరాల చట్టం కింద, మతకలహాలు లాంటి నేరాలకు పాల్పడిన వారిని విడుదలకు అనర్హులు అని ప్రకటించింది. పిల్లల మీద నేరం చేసిన వారు పద్నాలుగేళ్ళ వాస్తవ శిక్ష, రెమిషన్ కలిపి పద్దెనిమిదేళ్ళు పూర్తి అయితే కానీ విడుదలకు అర్హులు కారు అనే షరతు వల్ల నాగయ్య లాంటి వారు ఇంకా జైలులో మగ్గుతున్నారు. 2020కి వచ్చే సరికి 28 క్యాటగిరీల కింద వచ్చే ఖైదీలను అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. దాని ప్రకారం అవినీతి నిరోధక చట్టం కింద, ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టు అయిన జీవిత ఖైదీలు పదేళ్లు పూర్తి చేసుకున్నా విడుదల కావడానికి అర్హులు కారు. ఒక్క హైదరాబాద్‌లో విచక్షణా రహితంగా ప్రివెంటివ్ డిటెన్షన్ ప్రయోగించి 150మందిని జైలు పాలు చేయడంపై రేవంత్ రెడ్డి ఆ చర్చలో ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు రెండుసార్లు చీవాట్లు పెట్టిన తర్వాత కూడా 2022లో 393 మంది మీద ఈ చట్టాన్ని పోలీసులు ప్రయోగించారు. కనీసం 2016 జీవోలో తీవ్ర నేరాలకు పాల్పడినవారు పద్దెనిమిది లేక ఇరవై నాలుగేళ్ళ తర్వాత విడుదలయ్యే అవకాశం ఉందని ప్రకటించారు. కానీ 2020 జీవోలో ఈ 28 మినహాయింపుల కింద వచ్చేవారు ఎన్ని ఏళ్లకు విడుదలకు అవుతారో కూడా నిర్ణయించలేదు. ఇది ఏడేళ్ళు పూర్తి చేసుకున్న ఖైదీలను తీవ్రమైన మానసిక ఆందోళనకు గురి చేసింది. ఖైదీల శిక్షా కాలానికి సంబంధించిన ఈ అహేతుకమైన షరతులను ప్రభుత్వం సమీక్షించాలి, ప్రజాస్వామీకరించాలి.

ఖైదీల జీవితాలు ఇంత నిరంకుశత్వానికి, అనిశ్చితికి గురి కావడానికి కారణాలు అనేకం. మొదటిది, ఖైదీలలో ఏ మార్పు వస్తే వారు సంస్కరించబడినట్టు అన్న అవగాహన వ్యవస్థకు లేదు. దానిని తరచు అంచనా వేసే యంత్రాంగం లేదు. దాని ప్రాతిపదికగా మనిషి మారాడా లేదా అని మూల్యాంకనం చేసే పద్ధతి లేదు. ఇవి ఏవీ లేకపోవడం వల్ల చట్టప్రకారం ప్రతి మూడు నెలలకు శిక్ష ప్రభావాన్ని సమీక్షించి విడుదలకు సిఫార్సు చేసే సలహా సంఘం గత ముప్పై ఏళ్లలో ఎన్నడూ సమావేశం కాలేదు. ఫలితంగా పదేళ్ల ముందు చేసిన నేరాన్నే ప్రాతిపదికగా చేసుకుని ప్రభుత్వం విడుదలను నిర్ణయిస్తూ ఉంది. జైలు శిక్షలో ఒక వ్యక్తి పది నుంచి ఇరవై ఏళ్ల జీవితాన్ని, న్యాయంగానో, అన్యాయంగానో కోల్పోతే దానికి ఎటువంటి విలువా కట్టడం లేదు. ఈ చట్ట వ్యతిరేక విధానం పోవాలి. జీవిత శిక్షకు ఒక నిర్దిష్ట కాలాన్ని నిర్ణయించి ఆ సమయానికి ఆరు నెలల ముందే విడుదలకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించాలి.

జైలు శిక్షలో ఒక వ్యక్తి పది నుంచి ఇరవై ఏళ్ల జీవితాన్ని, న్యాయంగానో, అన్యాయంగానో కోల్పోతే దానికి ఎటువంటి విలువా కట్టడం లేదు. ఈ చట్ట వ్యతిరేక విధానం పోవాలి. ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులు పునరుద్ధరిస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం జైళ్ల వ్యవస్థను, ఖైదీల స్థితిగతులను సమగ్రంగా సమీక్షిస్తే బాగుంటుంది.



2015లో రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ఖైదీల రోజువారి వేతనం రూ.30 నుంచి నేడు రూ.70కు పెరిగింది. పేద ఖైదీల జమానత్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ఇటీవల ప్రకటించింది. ఏ ప్రమాణాల ప్రకారం చూసినా రోజుకు రూ.70 వేతనాన్ని సమర్థించడం కష్టం. కర్ణాటక రూ.663, ఢిల్లీ రూ.308, ఆంధ్ర, తమిళనాడు రూ.200, పుదుచ్చేరి రూ.180, బీహార్ రూ.156, ఒడిశా రూ.145 వేతనాన్ని రోజుకు ఖైదీలకు చెల్లిస్తున్నాయి. మన రాష్ట్ర ఖైదీలు ఏడాదికి సగటున రూ.52,331 విలువైన ఉత్పత్తులు సృష్టిస్తున్నారని జాతీయ గణాంక సంస్థ 2022లో ప్రకటించింది. పెట్రోల్ పంపుల నిర్వహణ వల్లనే అయినప్పటికీ జైలు డిపార్టుమెంట్ ఆదాయం ఏడాదికి రూ.800వందల కోట్లు. అది ఖైదీల శ్రమ లేకుండా రావడం లేదు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వానికీ జైళ్ల శాఖ నుంచి ఇంత ఆదాయం లేదు. అయినా ఇంత తక్కువ వేతనాలు ఇవ్వడం అన్యాయం. పదేళ్లు పని చేసి విడుదలయ్యే సమయానికి ఖైదీకి రూ.40 నుంచి 80 వేలు మాత్రమే పొదుపు చేసిన సొమ్ముగా చేతికి అందితే చేసిన శ్రమ ఏమైనట్టు అనేది ఖైదీల ప్రశ్న. ఈ వేతనంతో కుటుంబాన్ని ఆదుకునే మార్గం లేదు. ఆదాయం కోట్లకు చేరిన తర్వాత నైపుణ్యం ఉన్న దీర్ఘకాలిక ఖైదీలను విడుదల చేయకూడదనే ఉద్దేశంతోనే వారి విడుదలకు అనర్హతల చిట్టాను ప్రభుత్వం పెంచిందని వాళ్ళు ఆరోపణ చేస్తుంటే వారిని తప్పుపట్టడం కష్టం. పెరిగిన ఆదాయం జైళ్ల సంస్కరణకు గుర్తు కావచ్చు, కానీ ఖైదీల పునరావాసానికి గుర్తుగా అనుకోలేము. తమను చౌక శ్రామిక శక్తిగా భావించడం వల్లే విడుదల చేయడం లేదనే ఖైదీల వాదనను ప్రభుత్వం పరిశీలించాలి. వారి వేతనాలను ఎన్నో రేట్లు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి న్యాయమైన వేతనం ఇస్తే, కనీసం ఖైదీల కుటుంబాలు నిలబడతాయి, వాళ్ళు బయటకు వచ్చాక నిలదొక్కుకోవడానికి ఒక గడ్డిపోచ అంత ఆసరా దొరుకుతుంది.

రేవంత్ రెడ్డి ఆ ఇంటర్వ్యూలో ఇంకొక ముఖ్యమైన విషయాన్ని యథాలాపంగా ప్రస్తావించారు. జైలుకు వచ్చే ముందు నేరస్తులు ఏ వృత్తిలో ఉంటే — మంగలి, తోటమాలి, వంట— దాన్ని గుర్తించి వారికి ఆ పని చెబుతారు జైలు అధికారులు అని. అందులో భాగంగానే ఖైదీ నాగయ్యను తనకు వంట చేసి పెట్టడానికి నియమించారని చెప్పారు. వృత్తులకు, కులాలకు మధ్య ఉన్న సంబంధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు. కొంత మార్పు వచ్చినప్పటికీ, గత రెండు వందల ఏళ్లుగా ఇది దేశంలో అన్ని జైళ్లలో కొనసాగుతూనే ఉంది. బహుజన కులాలకు సంబంధించిన ఖైదీలకు మాత్రం ఇది దొరల రాజ్యం కొనసాగింపే. గత ఏడాది రాజస్థాన్‌లో మైల సఫాయి వృత్తి నుంచి పారిపోయి వచ్చిన ఖైదీ కులాన్ని బలవంతంగా కనుక్కుని జైలు అధికారులు అతని చేత ఆ పని చేయించారని 'ది వైర్'లో పరిశోధనాత్మక వ్యాసం వస్తే, రాహుల్ గాంధీ జోక్యంతో జైలు మాన్యువల్‌ను అక్కడ సవరించారు. కాంగ్రెస్ అధినాయకుని అభీష్టానికి అనుగుణంగా రేవంత్ రెడ్డి ఇక్కడ కూడా ఆ మార్పును తీసుకు రావాలి. ఈ వ్యవస్థకు, తక్కువ వేతనానికి ఏమైనా సంబంధం ఉందేమో పరిశీలించాలి.

1984 వరకు ఉమ్మడి రాష్ట్రంలో రాయలసీమ ఫ్యాక్షన్‌కు చెందిన రాజకీయ నాయకులు, నక్సలైట్లు తగిన సంఖ్యలో ఖైదీలు ఉండడం వల్ల వాళ్ళ ఒత్తిడికి ఒగ్గి ప్రతి ఏడాది ఐదేళ్ళు పూర్తి చేసుకున్న వారిని విడుదల చేసేవారు. ఆ తర్వాత ఏడేళ్ళు పూర్తి చేసిన వారిని విడుదల చేసేది తెలుగుదేశం ప్రభుత్వం. వాటి ప్రయోజనాలు సాధారణ ఖైదీలకు అందేవి. బలమైన హక్కుల ఉద్యమం, దళిత ఉద్యమాలు కూడా ఖైదీల సమస్యల మీద గొంతు ఎత్తేవి. చిలకలూరిపేట బస్సు దహనం కేసులో శిక్ష పడిన వారిని ఉరికంబం నుండి కాపాడగలిగిన హక్కుల ఉద్యమం ఒక్కపుడు ఉండేది. మొత్తంగా ఉద్యమాలకు పట్టిన గతి ఖైదీల జీవితాల మీద చాలా పడింది. ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులు పునరుద్ధరిస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం జైళ్ల వ్యవస్థను, ఖైదీల స్థితిగతులను సమగ్రంగా సమీక్షిస్తే బాగుంటుంది.

• మురళి కర్ణం

## ఊరిబడిని బతికించండి

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. కనీసం ఐదు పక్కా తరగతి గదులు ఉండాలి కానీ ఒకటి, రెండు గదులు మాత్రమే ఉన్నాయి. వాటిలో కూడా కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. గత ప్రభుత్వం స్కావెంజర్లను తొలగించడంతో తరగతి గదులు దుమ్ముధూళితో నిండి ఉంటున్నాయి. కొత్త ప్రభుత్వమైనా ఈ ఇబ్బందులను తొలగించాలి. ప్రస్తుత ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఫ్రీగా ప్రతి ఇంటికీ కరెంటు ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమే. ఈ పథకాన్ని రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేస్తే ఇంకా బాగుంటుంది. అలాగే బడుల విద్యుత్ బకాయిల్ని కూడా రద్దుచేయాలి. గత ప్రభుత్వం 317 జీవో ద్వారా టీచర్లను ఆగమాగం చేసింది. పదేళ్లలో ఒకసారి మాత్రమే ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించింది. కొందరు ఎలాంటి ప్రమోషన్ లేకుండా రిటైరయ్యారు. జీవో 5 ద్వారా ఎన్నికల ముందు చేపట్టిన బదిలీలు, పదోన్నతులు వివాదాస్పదమయ్యాయి. ఒక జోన్‌లో ప్రమోషన్లు ఇచ్చి రెండో మల్టీజోన్‌లో ఇవ్వకపోవడం అన్యాయం. అలాగే గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టులు, ఎంఈవో పోస్టులతో పాటు ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలి. నూతన ప్రభుత్వమైనా టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టి విద్యావ్యవస్థను బాగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలి.

– శాగ శ్రీనివాస్
చిన్న పెండ్యాల, జనగామ జిల్లా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com







## సీఎంను కలిసిన మంత్రులు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మంత్రి సీతక్క కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటాన్ని బహుకరించారు. ఇక రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో సెల్ఫీ దిగారు.




# రాజకీయ కసరత్తు

### కొత్త ఏడాదిలో ప్రధాన పార్టీల ఎదుట కొత్త సవాళ్లు

- ముందున్న పార్లమెంట్, ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికలు
- కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం
- బీఆర్‌ఎస్, బీజేపీలకు సవాల్
- అసెంబ్లీ ఎన్నికలతో మారిన పార్టీ బలాబలాలు
- గెలుపు ఊపుమీదున్న కాంగ్రెస్
- వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న బీజేపీ
- పావులు కదుపుతున్న బీఆర్‌ఎస్

హనుమకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికలు సవాల్‌గా మారనున్నాయి. ఆ తర్వాత జరిగే పంచాయతీ ఎన్నికలను కూడా ఈ పార్టీలు ఎదుర్కొవాల్సి ఉంది. ఈ మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా రానున్నాయి. మొత్తానికి ఈ సంవత్సరం మొదటి అర్థభాగం అంతా ఎన్నికల సందడితోనే గడవనున్నది. 2023 సంవత్సరం బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చేదు అనుభవాన్ని మిగల్చగా కాంగ్రెస్‌కు తీపి జ్ఞాపకాన్ని మిగిల్చింది. ఆ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో 10ని గెలుచుకోగా, బీఆర్‌ఎస్ రెండింటితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

బీజేపీ గుడ్డిలో మెల్లల సీట్లు గెలుచుకోకపోయినా ఓట్లను 20 శాతం మేరకు పెంచుకోగలిగింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం కానుండగా, బీఆర్‌ఎస్, బీజేపీకి సవాల్‌గా నిలువనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలను గెలుచుకోవాలనే కృతనిశ్చయంతో ఈ మూడు పార్టీలు ఉన్నాయి.

**అసెంబ్లీ సెగ్మెంట్లు**

వరంగల్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలోనూ ఏడు ఉన్నాయి. వరంగల్ లోకసభ నియోజకవర్గం పరిధిలో స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి ఉన్నాయి. మహబూబాబాద్ లోకసభ స్థానం పరిధిలో డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం ఉన్నాయి. వరంగల్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉండగా మహబూబాబాద్ విషయంలో నాలుగు మాత్రమే ఉమ్మడి వరంగల్ పరిధిలోనివి. మిగతా మూడు ఇతర జిల్లాల్లోనివి.

**వ్యూహాలకు పదును**

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు తమ రాజకీయ వ్యూహాలకు అప్పుడే పదును పెట్టడం మొదలు పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆచితూచీ అడుగులు వేస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎన్నికల్లోనూ పైచేయి సాధించేందుకు ఇటీవల వరంగల్, మహబూబాబాద్ లోకసభ స్థానాలకు ఇంచార్జీలను నియమించింది. వరంగల్, మహబూబాబాద్‌లకు మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు అధిష్ఠానం గెలుపు బాధ్యతలను అప్పగించింది. అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ కూడా మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలకు ఇటీవల దిశానిర్దేశం చేసింది. బీజేపీ కేంద్ర మంత్రులను ఇంచార్జీలుగా నియమిస్తోంది.

**అభ్యర్థుల వేట..**

రెండు పార్లమెంట్ స్థానాల్లో వరంగల్ ఎస్సీకి, మహబూబాబాద్ ఎస్టీకి రిజర్వు అయింది తెలిసిందే. ప్రస్తుతం ఈ రెండు స్థానాలు బీఆర్‌ఎస్ చేతులోనే ఉన్నాయి. వరంగల్ ఎంపీగా పసునూరి దయాకర్, మహబూబాబాద్ ఎంపీగా మాలోతు కవిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రెండు లోకసభ స్థానాల్లో అభ్యర్థులుగా ఎవరిని నియమించాలనే విషయంలో ప్రధాన పార్టీలు పరిశీలనలు చేస్తున్నాయి. గెలిచే సత్తా కలిగిన అభ్యర్థుల కోసం వేట సాగిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీలకే తిరిగి టికెట్ ఇస్తుందా లేక కొత్తవారిని ఎంపిక చేస్తుందా అన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చి చేతులు కాల్చుకున్న బీఆర్‌ఎస్ ఈసారి ఆ పని చేయకపోవచ్చునని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రెండింటిలోనూ కొత్తవారికే టికెట్లు ఇచ్చే అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఇక కాంగ్రెస్ కూడా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేయనున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో అనసరించి వ్యూహాన్నే ఈ ఎన్నికల్లోనూ అనుసరించనున్నది. అన్ని వర్గాల ఓటర్లను ప్రభావితం చేయగల అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తోంది. ఇతర పార్టీల్లో గెలిచే సత్తా కలిగిన నేతలకు గాలం వేస్తున్నట్టు తెలుస్తోంది. బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. వరంగల్ లోకసభ స్థానానికి ఎంఆర్‌పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ పేరును పరిశీలిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. మరోవైపు మహబూబాబాద్ లోకసభ స్థానానికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన, టికెట్ ఇవ్వలేకపోయిన నాయకుల పేర్లను వడపోస్తున్నట్టు తెలుస్తోంది.

**బలాబలాలు**

వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఆరింటిలో కాంగ్రెస్ గెలిచింది. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో భద్రాచలం తప్ప అన్నిటినీ కాంగ్రెస్ హస్తగతం చేసుకున్నది. వరంగల్, మహబూబాబాద్ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో 12 చోట్ల కాంగ్రెస్, 2 చోట్ల బీఆర్‌ఎస్ గెలిచింది.

అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు 6,63,556 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 5,03,298 ఓట్లు, బీజేపీకి 1,56,638 ఓట్లు వచ్చాయి. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు 5,76,726, బీఆర్‌ఎస్‌కు 4,43,910 ఓట్లు, బీజేపీకి 34,476 ఓట్లు వచ్చాయి.

**త్వరలో నోటిఫికేషన్**

పార్లమెంట్ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్నది. దీంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల విషయంలోనూ ప్రధాన పార్టీలు అభ్యర్థుల పేర్లను అప్పుడే పరిశీలించడం మొదలు పెట్టాయి. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి జనగామ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల నుంచి అసెంబ్లీకి ఎన్నిక కావడంతో ఏర్పడిన ఈ రెండు ఖాళీల భర్తీ త్వరలో జరుగనున్నది. అధికార కాంగ్రెస్ ఈ రెండు స్థానాలను కైవశం చేసుకునే దిశగా దృష్టి సారించింది. అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి ప్రస్తుత గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ఈనెలాఖరుతో ముగియనున్నది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే జనవరి చివరి వారంలోగానీ, ఫిబ్రవరి మొదటివారంలో గానీ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.


వేయిస్తంభాల గుడిలో దర్శనానికి బారులుదీరిన భక్తులు

# నయా సాల్.. నయా జోష్..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హనుమకొండ కల్చరల్, జనవరి 1 : నూతన ఆంగ్ల సంవత్సరం తొలి రోజు సోమవారం ప్రజలంతా నూతన ఉత్సాహంతో ఇష్టదైవాలను కొలుస్తూ ఆలయాలకు వెళ్లారు. ఉదయం నుంచే నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, భద్రకాళి ఆలయంతోపాటు ఇతర అన్ని ఆలయాలకు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ధనుర్మాస పర్వంలో సోమవారం ప్రత్యేకమైన రోజు కావడంతో వైష్ణవ ఆలయాలకు కూడా తెల్లవారుజాము నుంచే ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది.


ఎస్పీ దంపతులకు శేషవస్త్రాలు బహుకరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

రుద్రేశ్వరాలయంలో శివప్రీతికరమైన సోమవారం కూడా కలిసి రావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. క్యూలైన్‌లో భక్తులు బారులుదీరి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజే సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు అంచనా. ఉత్తిష్ట గణపతికి అభిషేకం, రుద్రేశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను ఆలయ అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 221 మంది దంపతులచే సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సతీసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయన రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక అభిషేకం నిర్వహింపజేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ కమిషనర్ దంపతులకు స్వామివారి శేషవస్త్రాలను బహుకరించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిల కుటుంబ సభ్యులు, పలువురు జిల్లా న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రేమ్‌కుమార్, రజిత, రామకృష్ణ, రుద్రేశ్వర సేవాసమితికి చెందిన గరిక అశోక్, భరత్‌కుమార్, నాగరాజు తదితరులు భక్తులకు సేవలందించారు.

భద్రకాళి ఆలయం కూడా భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషుభారతి పర్యవేక్షించారు. అదే విధంగా నగరంలోని ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరాలయం, అదాలత్ సమీపంలోని వేంకటేశ్వర ఆలయం, బ్రాహ్మణవాడలోని పెద్ద కోవెల, ఏకశిలా పార్కు సమీపంలోని రామాలయం, రెవెన్యూ రామాలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

## ఆధార్ అప్‌డేషన్‌కు పరుగులు

- పడిగాపులు కాస్తున్న ప్రజలు

వివరాలు : 7లో..



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- హైదరాబాద్ పటాన్‌చెరువు సమీపంలో ఘటన
- ఇద్దరూ జనగామ జిల్లా వాసులే


పాకాల నితిన్ (ఫైల్)


రాగం భరత్ చందర్ (ఫైల్)

బచ్చన్నపేట/పాలకుర్తి, జనవరి 1: హైదరాబాద్ పటాన్‌చెరువు నోవాపాన్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామానికి చెందిన పాకాల నితిన్ (18), పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన రాగం భరత్‌చందర్ (19) సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వంశీ అనే మరో విద్యార్థితో కలిసి వీరు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ తెచ్చేందుకు స్కూటీపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో భరత్‌చందర్‌తో పాటు నితిన్ అక్కడికక్కడే మృతి చెందగా వంశీ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిలో నితిన్ తండ్రి ఏడాది క్రితం మృతి చెందగా, తల్లి సంతోష కూలి పనులు చేస్తూ నితిన్‌ను చదివిస్తోంది. ఇక భరత్‌చందర్ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఇద్దరు అక్కలు ఉన్నారు. తల్లిదండ్రులు రాగం రాజన్నరజిత దంపతులది వ్యవసాయ కుటుంబం. రెక్కల కష్టాన్ని నమ్ముకొని కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా నిలుస్తాడనుకున్న కుమారుడు అకాల మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోస్టుమార్టం అనంతరం వీరి మృతదేహాలు సోమవారం సాయంత్రం స్వగ్రామాలకు చేరుకునే అవకాశం ఉంది.

# ఏటూరునాగారంలో ఉద్రిక్తత

- బైరి నరేష్‌ను అడ్డుకున్న అయ్యప్ప మాలధారులు
- నాస్తికవాదాన్ని ప్రోత్సహించొద్దని ఆగ్రహం
- తీవ్ర వాగ్వాదం.. స్వల్ప తోపులాట..
- నరేష్ కారు ముందుకు వెళ్లే క్రమంలో భక్తుడికి గాయాలు
- జీడివాగు వద్ద చెట్టుకు ఢీ.. నరేష్ సహా అనుచరుల పరార్


బైరి నరేష్‌తో వాగ్వాదం చేస్తున్న అయ్యప్ప భక్తులు


గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఏటూరునాగారం రూరల్/ఏటూరునాగారం, జనవరి 1 : నాస్తికవాదంపై అయ్యప్ప భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేవుళ్లపై అనుచితంగా వ్యాఖ్యలు చేస్తే సహించబోమని నిరసనకు దిగారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో సోమవారం జరిగిన ఓ సమావేశానికి హాజరైన నాస్తికవాది బైరి నరేష్‌ను అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది.

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భారతీయ నాస్తిక సంఘం ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ స్ఫూర్తి దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బైరి నరేష్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న అయ్యప్ప భక్తులు అక్కడికి చేరుకున్నారు. నాస్తిక వాదాన్ని ప్రోత్సహించే ఇలాంటి సమావేశాలు నిర్వహించొద్దని అడ్డుకున్నారు. గతంలో మీరు అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతినేలా నరేష్ మాట్లాడారని, మళ్లీ అలాంటి చర్యలకు పాల్పడేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నారని విమర్శించారు.

దీనిపై నరేష్ మాట్లాడుతూ ఈ సమావేశంలో అలాంటి వ్యాఖ్యలేవీ ఉండబోవని స్పష్టం చేశారు. అయినా అయ్యప్ప భక్తులు శాంతించలేదు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నరేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో గొడవలు సృష్టించేందుకే ఇక్కడకు వచ్చావని కోపోద్రిక్తులయ్యారు. దీంతో సమావేశాన్ని నిర్వహించి తీరుతామని నరేష్ తేల్చి చెప్పడంతో వాగ్వాదం మరింత తీవ్ర రూపం దాల్చింది. సమాచారం అందుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు సమావేశాన్ని రద్దు చేసుకోవాలని నరేష్‌కు సూచించారు. దీంతో ఆయన అయిష్టంగానే కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

**అయ్యప్ప భక్తుడికి గాయాలు**

సమావేశాన్ని రద్దు చేసుకొని బయటకు వచ్చిన నరేష్ కారు ఎక్కి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అయినా అయ్యప్ప భక్తులు కారుకు అడ్డంగా వచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కారును డ్రైవర్ ముందుకు కదలించగా పోగు నరసింహారావు అనే భక్తుడి కాలికి గాయమైంది. అయినా నరేష్ ఆగకుండా అక్కడి నుంచి మంగపేట వైపు వెళ్లిపోయారు.

**ప్రమాదానికి గురైన కారు**

ఏటూరునాగారం నుంచి తన అనుచరులతో బయల్దేరిన బైరి నరేష్ కారు జీడీవాగు సమీపంలోని కొమురంభీంనగర్ వద్ద చెట్టును ఢీకొని ప్రమాదానికి గురైంది. వాహనంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో పెను ముప్పు తప్పింది. బైరి నరేష్‌తోపాటు డ్రైవరు, మరో ఇద్దరు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. కారు ప్రమాదానికి గురైనట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏటూరునాగారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని నరేష్‌తో పాటు ఆయన అనుచరులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. గాయపడిన నరసింహారావును ఆస్పత్రికి తరలించారు.

**కేసు నమోదు చేసిన పోలీసులు**

అయ్యప్ప భక్తుల ఫిర్యాదు మేరకు బైరి నరేష్ మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగపేట వైపు అతడు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైందని, ఇది జరిగిన వెంటనే నరేష్‌తో పాటు వాహనంలో ఉన్న మరో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారని చెప్పారు. కారును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు.



## ప్రాణం తీసిన అనుమానం

- కాబోయే భర్త తీరుతో యువతి మనస్తాపం
- ఉరి వేసుకొని ఆత్మహత్య
- నిశ్చితార్థం జరిగిన పది రోజులకే ఘటన
- జనగామ జిల్లా ఇప్పగూడెంలో విషాదం


వసంత (ఫైల్)

వారికి నిశ్చితార్థమై పది రోజులవుతోంది. కానీ అతడు ఆమెను అనుమానించాడు. ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోందని, పెళ్లికి ఒప్పుకోనని తెగేసి చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. - స్టేషన్ ఘన్‌పూర్

8

## మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కేసుల నమోదు

దామెర, జనవరి 1: దామెర మండల పరిధిలో డిసెంబరు 31న అర్ధరాత్రి వరకూ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై దామెర పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి వరకూ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 22మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దామెర పోలీస్ స్టేషన్ ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారని ఎస్సై తెలిపారు.





ధర్మసాగర్ ఎస్సీకాలనీ పల్లెబండ వద్ద నిల్వచేసి తరలిస్తున్న మట్టి

# అక్రమంగా మట్టి దందా

- ప్రభుత్వ భూములే లక్ష్యంగా కొనసాగిస్తున్న వ్యాపారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు

ధర్మసాగర్, జనవరి 1 : పచ్చని పంటలు పండే భూముల్లో నుంచి అక్రమంగా మట్టిని తరలించడంతో వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతున్నాయి. ధర్మసాగర్ మండలం ముప్పారం, నర్సింగరావుపల్లి, నారాయణగిరి, ఎలుకుర్తి గ్రామాలలోని ప్రభుత్వ భూముల్లో నుంచి వ్యాపారులు రాత్రి పది గంటల నుంచి తెల్లవారి ఐదు గంటల వరకు మట్టిని నిరంతరం తరలిస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు, తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ధర్మసాగర్ పెట్రోల్ బంక్ వద్ద నిత్యం ఎక్స్‌వేటర్స్, టిప్పర్లు ప్రతీ రోజు నిలిపి వేస్తూ రాత్రి వేళలో మట్టి రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల ఉపాధి కోసం పంపిణీ చేసిన భూముల్లో పది నుంచి పదిహేను ఫీట్ల లోతు వరకు మట్టిని తీసి తరలించడంతో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. ఇటీవల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారి దందా మాత్రం నిలిపి వేసిన నాథుడే లేడు. ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, ముప్పారం, నారాయణగిరి, రాపాకపల్లి, ధర్మసాగర్, దేవునూర్, శాయిపేట్, మల్లక్‌పల్లి తదితర గ్రామాలలో మట్టి వ్యాపారం చేసే వ్యాపారులు పోలీసులను, రెవెన్యూ అధికారులను, మైనింగ్, విజిలెన్స్ అధికారులను ప్రతి నెల వ్యాపారులు ప్రసన్నం చేసుకోవడం వల్లనే ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రవాణాను నిలిపి వేయాలని పలుమార్లు అయా గ్రామాల ప్రజలు పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించినా చర్యలు తీసుకున్న వారే లేరని పలువురు వాపోతున్నారు. రాత్రి వేళలో ధర్మసాగర్ పీఎస్‌కు అతి సమీపాన బ్రిక్స్ తయారీ కేంద్రం, ఎస్సీ కాలనీ పల్లెబండ, ఎలుకుర్తికి వెళ్లే దారి వద్ద, ఎలుకుర్తి కోళ్లఫామ్‌ల వద్ద మూడు చోట్ల, కరుణాపురం రింగ్ రోడ్డు బ్రిడ్జి ఎడమ వైపు రెండు చోట్ల రాత్రి వేళల్లో మట్టిని నంబర్లు లేని టిప్పర్ల సాయంతో తరలించి నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నగరానికి, వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ధర్మసాగర్ మండలంలో మట్టి రవాణాను నిలిపి వేసి వ్యవసాయ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వం పంపిణీ చేసిన ఎలుకుర్తి భూముల్లో నుంచి మట్టి తీసిన దృశ్యం

## సైనికులు చట్టసభల్లో ఉండొద్దా?

- పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ హైకమాండ్లకు రిటైర్డ్ కల్నల్ లేఖ



రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి

జనగామ టౌన్, జనవరి 1: 'దేశ రక్షణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తున్న సైనికులు రాజకీయాలకు పనికిరారా..? విపత్కర పరిస్థితుల్లోనూ నిబ్బరం కోల్పోకుండా దేశ రక్షణకు పనిచేసే సైనికులకు చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరు.. పదవీ విరమణ పొందిన సైనికుల జ్ఞానం, అనుభవం ఇప్పుడున్న రాజకీయాలకు ఎంతో అవసరం.. వారికి చట్టసభల్లో ప్రాధాన్యం ఇచ్చే విషయంలో అన్ని పార్టీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి..' అంటూ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి భావోద్వేగ లేఖ రాశారు. పదవీ విరమణ పొందిన సైనికుల తరుపున సోమవారం ఆయన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానాలకు ఓ లేఖ రాశారు. పొరుగు దేశాల నుంచి ఎలాంటి ముప్పు లేకుండా సైనికులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశ రక్షణ కోసం సియాచిన్, ద్రాస్, కార్గిల్ వంటి యుద్ధాల్లో పోరాడిన సైనికులు కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారికి చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అవినీతి రహిత పాలన అందిస్తారని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుల సమాఖ్య తరపున విజ్ఞప్తి చేస్తే ఎవరూ పట్టించుకోలేదని, త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా జవాన్లకు పోటీ చేసే అవకాశాలను పార్టీ అధిష్ఠానాలు కల్పించాలని భిక్షపతి కోరారు.

# ఆధార్ అప్‌డేషన్‌కు పరుగులు

● ఆరు గ్యారంటీలకు ఆధార్‌కార్డు తప్పనిసరి ● పడిగాపులు కాస్తున్న ప్రజలు ● కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

హనుమకొండ రూరల్, జనవరి 1 : కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్ సెంటర్ల వైపు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కార్డులో వయస్సు, చిరునామా తదితర మార్పులు చేయించుకుంటున్నారు. అయితే ఆధార్ తీసుకొని పది సంవత్సరాలు పూర్తయిన వారు తప్పనిసరిగా అప్‌డేషన్ చేసుకోవాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. అందుకు గడువు కూడా రెండుసార్లు పొడిగించింది. అయినా చాలా మంది అప్‌డేట్ చేయించుకోలేదు. ఆధార్ కార్డుపై ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి ఉన్నా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా ప్రజలు అప్‌డేషన్ కోసం ఆధార్‌సెంటర్లకు వెళుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేయాలంటే ఆధార్ అవసరం కావడంతో మీ సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్ల వైపు జనం పరుగులు పెడుతున్నారు.

### సంక్షేమ పథకాలకు తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలు పొందాలంటే సంబంధిత లబ్ధిదారుల ఆధార్ నెంబరు అనుసంధానం తప్పనిసరి. ఈ క్రమంలో సంబంధిత ఆధార్‌కార్డుల్లో వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. పది సంవత్సరాల క్రితం జారి చేసిన ఆధార్‌కార్డుల్లో సరైన వివరాలు లేకపోవడం, ఫొటో, మొబైల్ నెంబరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదు కాకపోవడంతో ఇతరత్రా కారణాలతో కార్డులు రిజెక్టు అవుతున్నాయి. దీంతో పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు, బ్యాంకు ఖాతాలు, కల్యాణలక్ష్మీ, రైతుబంధు, రైతుబీమా లాంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హులైన వారు వాటికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆధార్‌కార్డును సరిచేసుకునేందుకు ప్రజలు ఆధార్ కేంద్రాల చుట్టు తిరుగుతున్నారు.

### ప్రతీ పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలి

2016 సంవత్సరానికంటే ముందు ఆధార్‌కార్డు పొందిన ప్రతీ ఒక్కరూ తగిన గుర్తింపు పత్రాలతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. నెలల వయసు చిన్నారుల నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారుల వరకు విధిగా ఆధార్ నమోదు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అన్ని రకాల సరుకులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2010 నుంచి 2018 సంవత్సరాల మధ్య జారి అయిన ఆధార్‌కార్డు నమోదుదారులతోపాటు తండ్రి, భర్త విషయాలే ముద్రితమయ్యాయి. 2018 తర్వాత వాటి స్థానంలో చిరునామా మాత్రమే పేర్కొంటూ కార్డులను జారీ చేశారు. ఆధార్‌కార్డుల జారీ ప్రారంభంలో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. ఎలాంటి వివరాలు ఆధార్‌లో లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించిన ధృవీకరణపత్రాలు పొందుపరుస్తూ పూర్తి వివరాలతో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

### కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాపాలన గ్రామ, వార్డు సభలకు తరలి వస్తున్నారు. దరఖాస్తు ఫారాల కొనుగోలు, వాటికి జత చేయాల్సిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతోపాటు ఇతర ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలతో జిరాక్స్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.




కేయూ జంక్షన్‌లోని ఆధార్ కేంద్రంలో బారులుదీరిన ప్రజలు, హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ప్రజలు

### అన్నిటికి ఆధార్‌కార్డే ఆధారం

ప్రభుత్వ, ప్రయివేట్ శాఖల్లో ఏ చిన్న పని జరగాలన్నా ఆధార్‌కార్డును ప్రమాణికంగా తీసుకోవడంతో ఆధార్ కీలకంగా మారింది. ఆధార్ కార్డుల జారిని కేంద్ర ప్రభుత్వం 2010 సంవత్సరంలో తీసుకురాగా, ఆధార్‌కార్డుల అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ సేవలు వినియోగించుకోవడానికి మారుమూల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికి తోడు నూతనంగా ఆధార్ తీసుకునేందుకు ప్రజలు నానా ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. మండలానికో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రాల్లో మీ సేవా కేంద్రాలు, బ్యాంకులలో ఆధార్ సేవలు ఉన్నప్పటికీ వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ఆధార్ సేవలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నూతనంగా ఆధార్‌కార్డులు పొందడం, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వ్యయప్రయాసలకోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినా ఆధార్ కేంద్రాల్లో జనం ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వెనుదిరగాల్సి వస్తోంది.

## సంస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్రం : సీపీఐ



కంఠాయపాలెం గ్రామంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

తొర్రూరు రూరల్, జనవరి 1 : రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. తొర్రూరు మండలం కంఠాయపాలెంలో గ్రామ శాఖ కార్యదర్శి మార్క సాంబయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటమే తమ ధ్యేయమని అన్నారు. కేంద్రంలో బీజేపీ మతం ప్రాతిపదికన దేశాన్ని పాలించాలని చూస్తుందని, లౌకిక ప్రజాస్వామ్యం నాటకమని తెలిపారు. దేశంలో ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాముడి జపం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరు మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, మండల కార్యదర్శి యాకూబ్, సోమిరెడ్డి, దర్గయ్య, సాయిమల్లు, ఉపసర్పంచ్ రాంమూర్తి, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్యాట్మింటన్ పోటీలకు కేయూ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 1 : కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి వీటీ యూనివర్సిటీలో జనవరి 2 నుంచి 5 వరకు నిర్వహించనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఉమెన్స్ బ్యాట్మింటన్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. 2023-24 సంవత్సరానికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో ఎస్.వర్షిత, వి.తనూశ్రీ, పి.లక్ష్మి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి, వరంగల్) జి.కీర్తన, ఎం.పూజరాగప్రియ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. జట్టుకు కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

# ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వర్ధన్నపేట, జనవరి 1: ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని రెండవ వార్డు పరిధిలో ఉన్న రాజస్థాన్ వీధిలో ఎలాంటి రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ అధికారులు తమకేమి పట్టనట్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు ట్రాన్స్ ఫార్మర్ పిచ్చిమొక్కలు ఏపుగాపెరిగి ప్రమాదరంగా మారాయి. గతంలో ఇదే కాలనీకి చెందిన ఓ బాలుడు ట్రాన్స్‌ఫార్మార్ షాక్‌కు గురై గాయాల పాలు అయ్యాడు. ప్రాణాపాయం తప్పినప్పటికీ నివాస ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాడు చేయడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

# మళ్లీ యువత ఓటరు నమోదు ప్రారంభం

▸▸ మార్పులు, చేర్పులకు అవకాశం
▸▸ ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 1: యువత 18 సంవత్సరాలు నిండి జనవరి 1 నుంచి ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం యువత ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. జనవరి 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా, బూత్ లేవల్ స్థాయి అధికారుల వద్ద నమోదు చేసుకోవచ్చు. నూతన ఓటరు నమోదు కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను ఈనెల 6న ప్రకటించనుంది. ఓటర్లు తమ ఓటరు ఐడీ కార్డుల్లో మార్పులు, చేర్పులు తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ఫాం-6, ఫాం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకున్న వాటిని బూత్ లెవల్ స్థాయి అధికారులు పరిశీలించి అధికారులకు అందజేస్తారు. జనవరి 6న ముసాయిదాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తారు.



### ఫిబ్రవరి 8న తుది జాబితా..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన యువతకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. అలాగే ఓటరు ఐడీ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించింది. తప్పులు ముద్రణ జరిగినచో సరిచేసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించి జనవరి 22 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

### ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి..

నగరంతో పాటు జిల్లాలోని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఒక ప్రత్యేక కార్యాచరణగా రూపొందించాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరుగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించి 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడానికి ఇంటింటా సర్వే ద్వారా కళాశాలల్లో వివరాలను సేకరించి ఓటరు నమోదు అవకాశం చేపట్టాలి. గతంలో ఓటరుగా ఉన్న చాలా మందికి ఓటరు ఐడీ కార్డులు పోస్టు ద్వారా పంపినట్లు అధికారులు తెలిపినా చాలా మందికి పోస్టల్ ద్వారా రాలేదు. చాలా సంవత్సరాల క్రితం నుంచి ఓటరు ఐడీ కార్డు ఉన్నవారికి కూడా ప్రస్తుతం ఉన్న ఫొటోతో ఐడీ కార్డు జారీ చేసేలా మీ సేవ కార్యాలయాల్లో అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.



### ఓటరు నమోదు కోసం ఇంటింటికి..

జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు నూతనంగా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఓటు హక్కు కోసం యువత దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సంఘం యువతకు ఓటు హక్కు కల్పించడానికి డిసెంబరు 20 నుంచే జిల్లాలోని గ్రామాల్లో, నగరంలోని డివిజన్లలో బూత్ లెవల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగా యువత ఓటు హక్కు కోసం ఫాం -6 ద్వారా నమోదు చేసుకోవాలి.



మల్లన్న ఆలయ గంగిరేగుచెట్టు ఆవరణలో భక్తజనసందోహం

## కొమురవెల్లి మల్లన్న మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

చేర్యాల, జనవరి 1 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి ఆలయంలో మల్లన్న కల్యాణం సందర్భంగా మూలవిరాట్టు దర్శనాన్ని సోమవారం సాయంత్రం నిలిపివేశారు. మూలవిరాట్టును సుందరీకరించనున్నందున గర్భాలయ ప్రవేశం, దర్శనాన్ని ఆపేశారు. భక్తుల కోసం ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. ఈనెల 7న తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించిన అనంతరం మూలవిరాట్టు దర్శనం ప్రారంభించనున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పొరుగు ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయశాల వద్ద మహిళలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పురుషులు, స్త్రీలకు ప్ర త్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేయకపోవడంతో ఒకే క్యూలైన్‌లో నిలబడి తోపులాటతో తంటాలుపడ్డారు.

## మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించిన 'కడియం'



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు

ఐనవోలు, డిసెంబరు 1: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు ఐనవోలు మల్లికార్జునస్వామిని సోమవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో పాటు పట్టువస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, స్థానిక సర్పంచ్ జన్ను కుమారస్వామి, జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ కరుణాకర్ రావు, గర్మిళ్లపల్లి సర్పంచ్ గండి మల్లికాంబరమేష్, ఎంపీటీసీ కడూదురి రాజు, సొసైటీ వైస్ ఛైర్మన్ చందర్‌రావు, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు మునిగాల సంపత్‌కుమార్, వడిచర్ల శ్రీనివాస్, బుర్ర రాజశేఖర్, ఆడేపు దయాకర్, పెండ్లి తిరుపతి, పల్లకొండ సురేష్, తండ వెంకన్న, విజయబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం గిరిజనేతరుల రిలే దీక్ష



బయ్యారంలో రిలే దీక్ష చేస్తున్న గిరిజనేతరులు

బయ్యారం, జనవరి 1: షెడ్యూల్డ్ ఏరియాలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనేతరులు హక్కుల కోసం బయ్యారంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఎస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీ కులాలకు చెందిన వారు పలు రకాల ఇబ్బందులకు గురవుతూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాతముత్తాతల నాటి నుంచి ఈ ప్రాంతంలో నివసిస్తూ ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికి సాగు భూములపై హక్కులు లేకపోవడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇకనైన ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరుల ఇబ్బందులు తొలిగిపోవాలంటే రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజా, కుల సంఘాల నేతలు, యువత మద్దతు తెలపాలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జనసభ జిల్లా నాయకుడు చల్లా గోవర్ధన్, బీసీ జిల్లా నాయకులు చీరాల జలేందర్, మందాటి శ్రీనివాస్, నూనె యాకయ్య, నూనె బసవయ్య వెంకటమల్లు, సుధాకర్, లక్ష్మయ్య, బుచ్చయ్య, అఖిల్, మురళి, సంతోష్, లింగయ్య నరేష్ పాల్గొన్నారు.

## లౌకికవాద రాజ్య స్థాపనకై పోరాడుదాం

▸▸ ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 1: దేశంలో కులం, మత రహిత, తాడిత, పీడిత ప్రజా సమస్యలపై పోరాడి సాధించడమే అమరులకు మనమిచ్చే నిజమైన నివాళులని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో సోమవారం ఎన్డీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సంద వెంకన్న సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో కులం, మతం పేరుతో పాలకులు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో విప్లవ శక్తులు ఏకమై కులమత రహిత తాడిత, పీడిత ప్రజల సమస్యలపై పోరాడి హక్కులను సాధించి పెట్టడమే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళులన్నారు. వెంకన్న సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, గుజ్జు దేవేందర్, మైస శ్రీనివాస్, ఎన్డీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, జడ సీతారామయ్య శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, బాబన్న, తాజ్‌పాషా, బట్టు చైతన్య, బోనగిరి మధు, పద్మ, సోమిరెడ్డి పాల్గొన్నారు.

# వావ్.. కొబ్బరిపువ్వు



పోషకాలమెండుతో పెరిగిన అమ్మకాలు

▸▸ నగరంలో ప్రధాన కూడళ్లలో విక్రయాలు
▸▸ కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి

కరీమాబాద్, జనవరి 1: ప్రకృతి అందించే ఫలాలు మానవాళికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఒక్కో పండు ఒక్కో ప్రత్యేకతను చాటుతూ ఆరోగ్యదాయనిగా పేరుపొందాయి. అలాంటిదే కొబ్బరిపువ్వు. కొబ్బరికాయలో లోపల తెల్లని ముద్దగా ఉండేదే ఈ కొబ్బరిపువ్వు. కొబ్బరి పువ్వు దర్శనమిస్తే మంచి జరుగుతుందని ఎంతో మంది నమ్ముతారు. కాని ఇప్పుడు అదే కొబ్బరిపువ్వును తింటే ఆరోగ్యానికి మహాభాగ్యం అంటున్నారు. వాస్తవానికి కొబ్బరికాయలో నీరు ఇంకిపోయి కొబ్బరి ముదిరినప్పుడు పువ్వు ఏర్పడుతుంది. కొబ్బరినీళ్ల, కొబ్బరిలో లభించే పోషకాల కంటే ఈ పువ్వులోనే అధిక పోషకాలు లభిస్తాయని నిపుణులు అంటున్నారు.

### నగరంలో అమ్మకాలు జోరు..

కొబ్బరి పువ్వు విక్రయాలు నగరంలో జోరందుకుంది. ప్రధాన కూడళ్లలో కొబ్బరిపువ్వు కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుండడంతో నగరవాసులు వాటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. భద్రకాళి దేవాలయ కమాన్, కేఎంసీ ముందు, ములుగురోడ్, ఓ సిటీ, ఖమ్మం రోడ్, లేబర్‌కాలనీ, కాశిబుగ్గ జంక్షన్, పలుప్రాంతాల్లో ఈ కొబ్బరి పువ్వు అమ్మకాలు సాగుతున్నాయి. వీటి ధర ఒక్కో కొబ్బరిపువ్వు సైజును బట్టి రూ. 60 నుంచి రూ.80 వరకు లభిస్తున్నాయి.



కేసీఎం సమీపంలో కొబ్బరిపువ్వు కొనుగోలు చేస్తున్న యువకులు

### కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి...

నగరంలో లభిస్తున్న ఈ కొబ్బరిపువ్వు కేరళ రాష్ట్రంలోని మున్నార్, అలిప్పి, కొట్టాయం, తిరువనంతపురం, తమిళనాడులోని కోయంబత్తూర్, ధర్మపురి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

### ప్రయోజనాలు ఇలా..

- రక్తంలో చెక్కర స్థాయిలను అదుపుచేయడంలో ఇన్సూలెన్ స్రావాన్ని ప్రేరేపించడంలో సహాయపడుతుంది.
- క్యాలరీలు తక్కువగా ఫైబర్ పీచు పదార్థాలు అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు సహకరిస్తుంది.
- శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- అలసట, నీరసం వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.
- కిడ్నీ ఇన్‌ఫెక్షన్స్, కిడ్నీ డ్యామేజ్ వంటి జబ్బులను నివారిస్తుంది.
- అంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో క్యాన్సర్ కారకాలను దరిచేరనీయదు.
- శరీరంలో హార్మోన్‌లెవల్స్‌ని సరిస్థాయిలో ఉంచుతుంది
- చెడు కొవ్వును తగ్గిస్తుంది.
- బీపీ, షుగర్, థైరాయిడ్, వ్యాధులను క్రమబద్ధీకరిస్తుంది
- జుట్టుకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది.
- విటమిన్ ఈ, సీ పుష్కలంగా లభ్యం అవుతాయి
- గుండెపోటును నివారిస్తుంది.

### టేస్ట్ చేద్దామని కొనుగోలు చేశాం

- ఇటుకాల సాంబయ్య, వరంగల్



నగరంలో చాలా చోట్ల ఈ కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నారు. ఒకసారి టేస్ట్ చేద్దామని కొనుగోలు చేసి తిన్నాం. చాలా రుచిగా ఉంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచదని తెలిసింది. పిల్లలు కూడా ఇష్టంగా తింటున్నారు.

### అమ్మకాలు పెరిగాయి....

వెల్ది లావణ్య సతీష్, కొబ్బరిపువ్వు విక్రయదారు



రెండు నెలలుగా కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నాం. ఇప్పుడు ప్రజలు ఈ కొబ్బరిపువ్వు కొనుగోలుకు ఆసక్తి కనబస్తున్నారు. అమ్మకాలు జోరందుకున్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వ్యాపారం బాగుంది.

## కోలాజనార్ధన్ పటేల్ సేవలు మరువలేనివి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

కాజీపేట, జనవరి 1: దివంగత బీజేపీ సీనియర్ నేత కోలా జనార్ధన్ పటేల్ బీజేపీకి చేసిన సేవలు మరువలేనివని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం అన్నారు.

రామలింగం సోమవారం హనుమకొండలోని కోలాజనార్ధన్ పటేల్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోపు చెర్ల కిషన్ రావు, ప్రభావతి, జింకల లక్ష్మణ్ రావు, కోల రాజేందర్, కోల సురేందర్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన వినయ్ భాస్కర్



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జనవరి 1 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరా బాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసి కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపాలని కేటీఆర్ సూచించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్ బి.రంజిత్‌రావు ఉన్నారు.

## సరిగమ పార్కును కాపాడండి

### పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి నల్లెల రాజయ్య

సుబేదారి, జనవరి 1 : హనుమకొండ పద్మాక్షి టెంపుల్ సమీపంలో ఉన్న సరిగమ పార్కు ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారిందని, వారి బారి నుంచి పార్కును కాపాడాలని వరంగల్ పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి నల్లెల రాజయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రాజయ్య పౌర స్పందన వేదిక అధ్యక్షుడు కరేటి శంకర్‌రావుతో కలిసి పార్కును పరిశీలించి మాట్లాడారు. హనుమకొండ చౌరస్తాకు అరకిలోమీటరు దూరంలో గత ప్రభుత్వ హయాంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సుమారుగా రూ.కోటి నిధులతో అట్టహాసంగా ఏర్పాటు చేసిన కుడా సరిగమ పార్కు నిర్వహణ లోపించి రాత్రివేళల్లో మందుబాబుల అడ్డాగా మారడం విచారకరమన్నారు. ఆకతాయిలు క్రికెట్ ఆడుతూ, తాగుబోతులు పార్కులోని రాతి స్థంబాలను కూల్చివేస్తున్నారన్నారు. పార్కు ఆవరణలో నాలుగు వైపులా సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పని చేయడం లేదని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా కెమెరాలను రిపేర్ చేయించి పార్కును కాపాడాలని రాజయ్య కోరారు.

## కాంగ్రెస్‌తోనే నిరుపేదల సంక్షేమం

హనుమకొండ సిటీ, జనవరి 1 : కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మాజీ కార్పొరేటర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాను గంటి శేఖర్ పేర్కొన్నారు. సోమ వారం హనుమకొండ 7వ డివిజన్ ఇందిరమ్మ విగ్రహం వద్ద శేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పేదలకు వ స్త్రాలు, ఆర్థిక సహకారాన్ని ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చిందనే సంతోషం ప్రజల్లో ప్రస్ఫుటంగా కనిపి స్తుందన్నారు. ప్రజలకు సేవ చేయడం వ్యక్తిగ తంగా తనకు ఎంతో సంతోషాన్ని కలు గు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ నసీంజహాన్, కాం గ్రెస్ నాయకులు లక్ష్మణ్, దినేశ్, క్రాంతి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు బెడ్‌షీట్ల పంపిణీ



బెడ్‌షీట్‌లు పంపిణీ చేస్తున్న రైల్వే అధికారులు

కాజీపేట, జనవరి 1: కాజీపేట రైల్వే కాలనీలో సోమవారం రైల్వే కాంట్రాక్టర్ పోలాస సురేశ్ బాబు ఆధ్వర్యంలో పేదలకు, రైల్వే దినసరి కూలీలకు దుస్తులు, బెడ్‌షీట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రైల్వే ఏడీఈఎన్‌ఎం, కృష్ణంరాజు, ఐవోడబ్ల్యూ విజయ్ కుమార్‌లు హాజరై 70 మంది పేదలకు దుస్తులు, బెడ్‌షీట్‌లు, బ్రెడ్‌ప్యాకెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే కాంట్రాక్టర్ సురేష్ గత 17 సంవత్సరాలుగా ఇలాంటి సమాజహిత కార్యక్రమాలు చేపడుతున్నారని యువత ఇలాంటి కార్యక్రమాలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నారక్లగిరి రమేశ్, దానం, అఫ్జల్, ఇమ్మడి రవి, క్రిస్టఫర్, దిలీప్, బ్రహ్మం, ప్రవీణ్, రాజేశ్, సాయిప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంబురం

### ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు
### కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిన అధికారులు



కమిషనరేట్ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా



నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేసిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



కేక్ కట్ చేస్తున్న సుజనహిత చిట్‌ఫండ్ చైర్మన్ బండారి శేఖర్‌గౌడ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 1 : హనుమకొండ బాలసముద్రంలోని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన ఈ వేడుకల్లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కేక్ కట్ చేశారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు కమిషనర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఆర్‌డీవో రమేశ్, బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వో రమేశ్, డీఆర్ఆర్‌వో అయూబ్ అలీ, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, కుడా కార్యదర్శి మురళీధర్‌రావు, బల్దియా వెటర్నరీ డాక్టర్ గోపాలరావు, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, పర్యవేక్షకులు ఆనంద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ రూరల్ : హనుమకొండలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) భవన్‌లో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. టీజీవో ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎ.జగన్‌మోహన్‌రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ వారికి అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం సీపీ అంబర్ కిశోర్ ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ఫణి కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, కిరణ్ కుమార్‌గౌడ్, రాజేష్ కుమార్‌గౌడ్, నాగనారాయణ, సురేశ్ కుమార్, రాజేష్ కుమార్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకున్నారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, కత్తి రమేశ్, రాముసాయక్, లక్ష్మీప్రసాద్, సలీం, సురేశ్, శ్రీనివాస్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

#### కమిషనరేట్ కార్యాలయంలో...

హనుమకొండ క్రైం : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని వరంగల్ పోలీసు కమిషనరేట్ క్యాంపు కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా కేక్ కట్ చేశారు. ఆదివారం రాత్రి సీపీతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు కుటుంబాలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీపీ అంబర్ కిశోర్ ఝా పాల్గొని సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి షేక్ హ్యాండ్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఇంకా కొత్త ఉత్సాహంతో పని చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. అంతేకాకుండా సోమవారం సీపీని కలిసేందుకు కమిషనరేట్ కార్యాలయానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సీపీ చేతుల మీదుగా పోలీసు కుటుంబాల పిల్లలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అబ్దుల్ బారీ, రవీందర్, సీతారాం, అదనపు డీసీపీలు రాగ్యానాయక్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

#### సుజనహిత చిట్‌ఫండ్‌లో ...

వడ్డేపల్లి : హనుమకొండలోని సుజనహిత చిట్‌ఫండ్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిట్‌ఫండ్ చైర్మన్ బండారు శేఖర్‌గౌడ్ కేక్ కట్ చేసి మాట్లాడారు. ఖాతాదారులకు, ప్రమోటర్ మిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఐదు సంవత్సరాల నుంచి తమ ఖాతాదారులకు సకాలంలో చిట్ అమౌంట్స్ అందిస్తూ వారి విశ్వాసాన్ని చూరగొంటున్నామని చెప్పారు. ఈ వేడుకలలో సంస్థ ఎండీ జి. జనార్ధన్, సీఈవో ఎన్. రాంచందర్, డైరెక్టర్ సరితతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

#### గోపాల్‌పూర్‌లో ...

గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్ క్యాంప్ ఆఫీసులో, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత కొంక హరిబాబు తన కార్యాలయంలో, కాంగ్రెస్ యూత్ నేత దూలం క్రాంతి కుమార్ గౌడ్ యూత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేసి సంబరాలను నిర్వహించుకున్నారు.

#### అల్ఫా ఓ మెగా చర్చీలో

కాజీపేట : కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవులకు అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కాజీపేట బాపూజీనగర్ అల్ఫా ఓ మెగా చర్చీలో సోమవారం నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పరంగా క్రైస్తవులకు రావాల్సిన రాయితీలను ఇప్పించడానికి కృషిచేస్తానన్నారు. అనంతరం చర్చీ వ్యవస్థాపకుడు బిషప్ జాన్ మార్కండేయ ఎమ్మెల్యే నాయినిని ఘనంగా సన్మానించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ నిఖిల్ జాన్, స్థానిక కార్పొరేటర్‌లు విజయ శ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు ఎమ్డీ అంకూస్, ఎంవీ సమతా రాజు, అనిల్, నాగరాజు, పోతుల సాంబయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీవో నేతలు

#### ప్రెస్‌క్లబ్‌లో...

వడ్డేపల్లి : హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ ఆవరణలో కేక్ కట్ చేసి జర్నలిస్టులకు, కమిటీ బాధ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం సభ్యులకు స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్-1 43) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్, సీనియర్ జర్నలిస్టులు పీవీ మధన్‌మోహన్, పీవీ కొండల్‌రావు, గడ్డం కేశవమూర్తి, మెండు రవీందర్, గాడిపెల్లి మధు, కక్కెర్ల అనిల్‌కుమార్, కంకణాల సంతోష్, ప్రెస్‌క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను, దుర్గాప్రసాద్, అల్లం రాజేష్‌వర్మ, యాంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్, అంజి, దిలీప్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.




ప్రెస్ క్లబ్‌లో కేక్ కట్ చేస్తున్న అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య తదితరులు

# ప్రాణం తీసిన అనుమానం

### కాబోయే భర్త తీరుతో యువతి మనస్తాపం
### ఉరి వేసుకొని ఆత్మహత్య



వసంత మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 1: నిశ్చితార్థం జరిగిన పదిరోజులకే ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. యువకుడి వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన లింగనబోయిన సోమయ్యసుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె అయిన లింగనబోయిన వసంత (19) ఘన్‌పూర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమెకు గత నెలలో రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన నర్సింగుల హరీష్ అనే యువకుడితో వివాహం నిశ్చయించారు. డిసెంబరు 22వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో నిశ్చితార్థం చేశారు. కట్నం కింద రూ.20వేలు అందించారు. ఈ క్రమంలో డిసెంబరు 31న అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో హరీష్ తన స్నేహితుడితో కలిసి వసంత ఇంటికి వచ్చాడు. వసంత తండ్రిని నిద్రలేపి మీ కూతురును పిలువమని చెప్పడంతో వసంత లేచి బయటకు వచ్చింది. ఆమెతో కొంత సమయం మాట్లాడిన హరీష్ 'మీ కూతురు రోజూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది, నేను ఆమెను వివాహం చేసుకోను, మీరు కట్నం కింద ఇచ్చిన రూ.20వేలకు అదనంగా మరో రూ.20వేలు కలిపి ఇస్తాను' అని తండ్రి సోమయ్యకు చెప్పాడు. దీంతో ఆయన 'రాత్రి వేళ ఇంటికి వచ్చి ఇలా మాట్లాడితే ఎలా.. రేపు ఉదయం పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందాం' అని సర్ది చెప్పినప్పటికీ వినకుండా వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన వసంత సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన చెల్లెలు కావ్య ఫ్యాన్‌కు వేలాడుతున్న అక్కను చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తండ్రి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

సుబేదారి, జనవరి 1 : నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని న్యూశాయంపేటలోని దోనగుట్టపై వెలిసిన వేద్రాద్రి సంతోష లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని కనక మహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో శ్రీదేవి భూదేవి సహిత నరసింహస్వామి మాస కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు క్రిష్ణప్రసాద్, శశాంక్‌ల ఆధ్వర్యంలో ముందుగా సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయ ధర్మకర్తలు గ్రంథి సూర్యనారాయణ సత్యవతి, వేల్పుల మోహన్‌రావు అనసూర్య, కమిటీ మెంబర్లు బొల్లెన యాదగిరి, వెంకన్నలు ఈ కళ్యాణం, సుదర్శన హోమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

### వాట్సాప్ స్టేటస్ పెట్టి బలవన్మరణం



నరేష్(ఫైల్)

కాటారం, జనవరి 1: ఓ యువకుడు ఉరి వేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకోబోతున్నానని వాట్సాప్ స్టేటస్ పెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అందరూ నూతన సంవత్సర వేడుకల్లో మునిగి ఉండగాభూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం... కాటారం మండలం రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధి దేవరాంపల్లికి చెందిన కుసుమ నరేష్(28) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఏదో పని ఉందని ఆదివారం బయటకు వెళ్లిన నరేష్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఏదో ఫోన్ రావడంతో మాట్లాడుకుంటూ మళ్లీ బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో స్నేహితులతో ఉన్నాడేమోనని కుటుంబసభ్యులు భావించారు. ఇంతలో నరేష్ సెల్‌ఫోన్‌లో తాను చనిపోతున్నట్లు వీడియోస్టేటస్ పెట్టాడని కొందరు గ్రామ స్థులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పలువురు యువకులు నరేష్ కోసం గ్రామం చుట్టుపక్కల వెతికారు. రెండు గంటల అనంతరం అర్ధరాత్రి ధన్వాడ ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని ఉన్నట్టు గుర్తించారు. నరేష్ ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. నరేష్ అవివాహితుడు. అతడికి తల్లితోపాటు అన్న ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు.

## పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

వాజేడు, జనవరి 1: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. పేరూరు ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తొర్రెం సరోజిని, సత్యం దంపతులకు రెండో సంతానం ప్రశాంత్(28). ఇతడికి వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ఏడాది కాలంగా సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారు. తనకు పెళ్లి కాదేమోనని మనస్తాపంతో ప్రశాంత్ ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ప్రార్థనల నిమిత్తం చర్చి వద్దకు వెళ్లి తిరిగి వచ్చే సరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పేరూరు ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు సన్మానం

సుబేదారి, జనవరి 1: వాకర్స్ ఇంటర్నేషనల్ 303 డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా పచ్చిమట్ల ఎల్లగౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఏకశిలాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్లగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్లు జంగా గోపాల్ రెడ్డి, తడక కుమారస్వామి, ఎలెక్ట్ గవర్నర్ కూరాకుల భారతి, ఏకశిలాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చాడా దశరథరామిరెడ్డి, సీనియర్ సిటీజన్ సంఘం అధ్యక్షులు కుందారపు యాదగిరి, వాకర్స్ అసోసియేషన్ సలహాదారులు పడాల సోమయ్య, వంగా రాజిరెడ్డి పాల్గొన్నారు.

## పరకాలను జిల్లాగా ఏర్పాటు చేయాలి

పరకాల, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలు పరకాల మండల, పట్టణ కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పం పిణీ చేశారు. మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన రంగవళ్ళులు వేసి నూతన సంవత్సరానికి ఆహ్వా నం పలికారు. మరికొంత మంది మహిళలు తమ ఇళ్ల ముందు పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ముగ్గుల రూపంలో తమ ఆకాంక్షను తెలియజేశారు. అమరవీరుల త్యాగాలను గుర్తించి ప్రత్యేకంగా పరకాల జిల్లాను ప్రకటించాలనే డిమాండ్‌తోనే ఇలాంటి ముగ్గులు వేసినట్లు తెలిపారు.

## అయోధ్య అక్షింతల శోభాయాత్ర



హనుమాన్ నగర్‌లో అక్షింతల శోభా యాత్రను నిర్వహిస్తున్న దృశ్యం

వడ్డేపల్లి, జనవరి 1: రామజన్మభూమి తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో జై హనుమాన్ పరపతి సంఘం సభ్యులు అయోధ్య అక్షింతలు హనుమాన్ నగర్ కాలనీలో ప్రతీ ఇంటికి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ.. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు అయోధ్యలో శ్రీరామమందిరాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 22న చేపట్టనున్నారన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ హిందూ ధర్మరక్షణ కోసం పాటుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఓదెల సూర్యనారాయణ, కోటగోజుల రాజేశ్వర్‌రావు, చిదురాల మల్లారెడ్డి, ఉప్పుల రాజు, సముద్రాల రాజేష్, వరప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

#### 31వ డివిజన్ న్యూశాయంపేటలో

సుబేదారి :శ్రీరామ జన్మభూమి తీర్థ క్షత్రి ట్రస్ట్ అయోధ్య రాముల వారి పవిత్ర పూజిత అక్షింతలు సోమవారం 31వ డివిజన్ న్యూశాయంపేటలోని బొడ్రాయి వాడలో బీజేపీ నాయకులు రామిండ్ల బాబు రావు ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబు రావు మాట్లాడుతూ పవిత్రమైన రాములవారి అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యూశాయంపేట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శౌర్య దివాస్

వడ్డెపల్లి, జనవరి 1: హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం, మాల పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శౌర్య దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విఎద్దెపాక ఎల్లయ్య, బీఎస్పీ రాష్ట్ర నేత బొల్లంపల్లి సారయ్య మాట్లాడుతూ 1818లో 25 వేల మంది పీష్వా బ్రాహ్మణులతో 500 మహార్‌లు యుద్ధం చేసి కొంత మంది అమరులై మిగతా వారు విజయం పొందారని అన్నారు. ఈ సందర్భంగా విజయ సూచికంగా శౌర్య దివాస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎడ్ల అర్జున్, రవీందర్, బంగారు బాబు, విశ్వేశ్వర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, మేడిపల్లి రాణి, శంకర్‌రాణి పాల్గొన్నారు.


## 'గతి తప్పిన రుతువు' నవలను ఆవిష్కరించిన గవర్నర్



నవలను ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

హనుమకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మామిడాల శైలజ రాసిన గతి తప్పిన రుతువు నవలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అమ్మాయిల అరుదైన టర్నర్ సిండ్రోమ్ ఇతి వృత్తంగా శైలజ ఈ పుస్తకాన్ని రాశారు. ఈ సమస్య ఉన్న అమ్మాయిలు అందరిలాగా మాతృత్వాన్ని ఆస్వాదించలేరు. సమాజం వారిని దూరంగా పెట్టి అవమానాలకు గురి చేస్తుంది. టర్నర్ సిండ్రోమ్ సమస్యతో బాధపడే అమ్మాయిలు సమాజం నుంచి కుటుంబం నుంచి ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటారో ఈ నవలలో శైలజ విపులంగా వివరించారు. గతి తప్పిన రుతువు నవల ప్రతిలిపి యాప్‌లో నగదు బహుమతిని అందుకున్నది. సమాజం మహిళలను చూసే దృక్పథంలో మార్పు తీసుకువచ్చే విధంగా ఈ నవలను రచించినందుకు గవర్నర్ రచయిత్రిని అభినందించారు.

#### చావైనా రేవైనా వీధినాటిక పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సుబేదారి, జనవరి 1 : కవి నల్లెల రాజయ్య రచించిన చావైనా రేవైనా(సింగరేణి ఓపెన్ కాస్ట్ విధ్వంసాలపై) వీధినాటక పుస్తకాన్ని సీనియర్ కవి కాసర్ల రంగారావు ఆవిష్కరించారు. బాలసముద్రంలోని ఏకశిలాపార్కులో సోమవారం తెలంగాణ రచయితల వేదిక హనుమకొండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో రంగారావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు సాదు మహేందర్, కవులు నల్లెల రాజయ్య, పిట్ట సాంబయ్య, పాల కుమారస్వామి, అనిల్, గుడికందుల ప్రకాశ్, నక్క కుమారస్వామి, ప్రసూన, నందిని పాల్గొన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్

కొత్త ఆశలతో, ఆశయాలతో న్యూ ఇయర్‌లోకి అడుగుపెట్టేశాం! వాటిని అందుకోవాలంటే, అందుకు అడ్డొచ్చే ఆరోగ్య అవరోధాలను కొన్ని కిటుకులతో అధిగమించాలి.

# కొత్తగా కొత్త సంవత్సరంలోకి...

**గుండెల్నిండా ఊపిరి పీల్చండి:** ఒత్తిడిని పటాపంచలు చేసే శక్తి మన మనసు, ఊపిరితిత్తుల్లో స్వతసిద్ధంగానే ఉంది. కాబట్టి ఒత్తిడి నిండుకున్నప్పుడు ఊపిరితో దాన్ని బయటికి తోసేసే ప్రయత్నం చేయండి. శ్వాస మీద మనసు లగ్నం చేసి ఒత్తిడిని పారదోలే పనిలో పంచేంద్రియాలను భాగస్వాములను చేయండి.

**వారానికోసారి వ్యాహ్యాళి:** నడక మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. అది వ్యాయామంలో భాగంగా ఉంటే సరిపోదు. వారానికోసారి పచ్చని ప్రకృతి మధ్య సేదతీర్చే నడకగా కూడా మారాలి. ఈ నడక వల్ల మనసుకు ఉపశమనం దొరుకుతుంది.

**కొత్త అనుభవం:** వస్తువుల మీద



కాకుండా అనుభవాల మీద పెట్టే వ్యయం ద్వారా అంతులేని ఆనందం పొందవచ్చు. కాబట్టి కొత్త సంవత్సరంలో మనసుకునచ్చే పని, అభిరుచి, అనుభవాలకు సమయాన్ని కేటాయించండి.

**జోర్నల్ అవసరం:** మనసులోని భావాలకు అక్షరరూపం ఇవ్వటం ఎంతో అవసరం. నెగిటివ్, పాజిటివ్... ఆలోచనలు ఎలాంటివైనా వాటిని రాసుకోవటం వల్ల మనల్ని మనం తెలుసుకోగలుగుతాం. మెచ్చుకోళ్లు ఆత్మ విశ్వాసాన్ని, మానసిక బలాన్ని పెంచుతాయి.

**పాటలు వినాలి:** నచ్చిన పాట వింటే మనసు తేలికవుతుంది. గుండె కొట్టుకునే తీరు, మెదడు యాక్టివిటీలనుబట్టి కొన్ని ట్యూన్స్ ఆందోళనను 65% తగ్గించ గలుగుతాయని పరిశోధనల్లో రుజువైంది. కాబట్టి సంగీతాస్వాదన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

**విషాన్ని వెదజల్లే వాళ్లకు దూరంగా:** ఒత్తిడి, సంతోషం...ఇవి రెండూ అంటువ్యాధుల్లాంటివి. కాబట్టి చుట్టూ చేర్చుకునే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. ఎప్పుడూ ఆందోళనతో సతమతమయ్యే స్నేహితుడి సాంగత్యంతో ఆందోళనపడటం మీ స్వభావంగా మారే ప్రమాదం ఉంది.

**మద్యం వద్దు:** అరుదుగా కాకుండా ప్రతి వారాంతం మద్యానికి కేటాయించి హ్యాంగోవర్‌తో బాధపడటం అలవాటు చేసుకుంటే మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. మద్యం వల్ల యాంగ్జయిటీ కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. కాబట్టి ఒత్తిడిని ఇతర ప్రత్యామ్నాయాలతో వదిలించాలి.

**వెకేషన్‌కి వెళ్లాలి:** ఉద్యోగమైనా, వ్యాపారమైనా మొనాటనీ ఆనందాన్నివ్వదు. కాబట్టి మార్పు కోసం దూర ప్రాంతాలకు వెకేషన్ ప్లాన్ చేయండి. వీకెండ్ అడ్వంచర్ అయినాసరే, వారంపాటు సాగే సుదూర ప్రయాణమైనాసరే! వెకేషన్ కోసం ప్రణాళికలు వేస్తూ ఉండాలి.

**నిద్రకు మరో గంట:** కంటినిండా నిద్ర మరుసటి రోజుకి కావాల్సిన ఓపిక, ఉత్సాహాలను సమకూరుస్తుంది. నిద్ర తగ్గితే ఆ ప్రభావం మానసిక, శారీరక ఆరోగ్యాలను దెబ్బతీస్తుంది. చిరాకు, విసుగు, ఒళ్లునొప్పులు, నిరాసక్తి, నీరసం...ఇలా చెప్పుకుంటూపోతే నిద్రలేమి తెచ్చిపెట్టే సమస్యలకు అంతే ఉండదు. కాబట్టి వీటికి గుడ్‌బై చెప్పాలంటే నిద్ర సమయం మరో గంటకు పెంచాలి.

ఫిట్‌నెస్



## సైకిల్ తొక్కేయ్! హెల్త్ పట్టేయ్!

ఫిట్‌నెస్‌కి దగ్గరి దారి సైక్లింగ్. బరువును తగ్గించటంతోపాటు డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళనలను కూడా సైక్లింగ్ అదుపులో ఉంచుతుంది. సైక్లింగ్ గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలున్నాయి. అవేంటంటే...

- కీళ్ల నొప్పులున్నవాళ్లు 'స్టాటిక్ సైక్లింగ్' చేయాలి. అంటే... జిమ్‌లో ఉండే సైకిల్ తొక్కాలి.
- మధుమేహులు సైక్లింగ్ తొక్కాలనుకుంటే మామూలుకంటే రెండింతలు నీళ్లు తాగాలి.
- పరిగెత్తటం వల్ల కీళ్ల మీద పడే ఒత్తిడి కంటే సైక్లింగ్ వల్ల పడే ఒత్తిడి తక్కువ.
- సైక్లింగ్ వల్ల కాలి పిక్కలు, తొడలు, పిరుదులు చక్కటి ఆకృతిని సంతరించుకుంటాయి.
- చలి కాలంలో పట్టేసే కండరాలు, కీళ్లు వదులవ్వాలంటే సైక్లింగ్ చేయాలి.
- రోజుకి కనీసం 30 నిమిషాల సైక్లింగ్ శరీరానికంతటికీ సరిపడా వ్యాయామాన్ని అందిస్తుంది.

హెల్త్ వెల్త్



## ముఖం లావైందా?

కొంతమందికి ముఖం లావుగా మారుతూ ఉంటుంది. దాంతో వయసు పైబడిన వాళ్లలా కనిపిస్తున్నామని బాధపడుతూ ఉంటారు. అయితే ఇందుకు మూల కారణాన్ని కనిపెట్టి వాటిని సరిదిద్దుకోవాలి.

శరీరంలో ఏదో ఒక అవయవం లావును సహజసిద్ధంగా తగ్గించుకోవడమనేది అసాధ్యం. అయితే కొందరిలో ముఖం లావుగా మారిపోతూ ఉంటుంది. ఇందుకు కొన్ని ప్రత్యేకమైన కారణాలున్నాయి. అవేంటంటే...

- **మందులు:** కార్టికోస్టిరాయిడ్లు, ఎసిఇ ఇన్హిబిటర్లు, అధిక రక్తపోటుకు వాడే కొన్ని మందులు ముఖాన్ని లావెక్కేలా చేస్తాయి. ఈ విషయాన్ని గ్రహించినప్పుడు వెంటనే విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.
- **ఫైబర్:** కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి వాటిని వదిలించడం కోసం పీచు ఎక్కువగా ఉండే, ఓట్లు, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఈ పదార్థాల్లోని న్యూట్రియంట్లు పొట్టను నింపేసి, ఆకలిని తగ్గిస్తాయి. దాంతో అనవసరపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా ఉంటాయి.
- **క్యాలరీలు:** చేస్తున్న వ్యాయామం కంటే తీసుకుంటున్న క్యాలరీలు ఎక్కువగా ఉంటే లావవ్వడం ఖాయం. కాబట్టి వారానికి 150 నిమిషాల మోడరేట్, ఇంటెన్స్ వర్కవుట్స్ చేస్తూ ఉండాలి. తీసుకునే క్యాలరీలు తగ్గించాలి.
- **ఉప్పు:** శరీరంలో ఉప్పు పరిమాణం పెరిగితే నీరు నిల్వ ఉండిపోతుంది. కాబట్టి ఉప్పు వాడకం తగ్గించాలి.
- **ఆల్కహాల్:** మద్యం తాగిన మరుసటి రోజు ముఖం లావెక్కుతుంటే, ఆ అలవాటు మానుకోవాలి.
- **నీళ్లు:** డీహైడ్రేషన్ వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండిపోతుంది. కాబట్టి రోజుకు 10 గ్లాసులకు తగ్గకుండా నీళ్లు తాగాలి. సరిపడా నీళ్లు తాగుతున్నారో లేదో ఎవరికి వారు తెలుసుకోవడం కోసం, మూత్రాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి. మూత్రం లేత రంగులో ఉంటే సరిపడా నీళ్లు తాగుతున్నారని అర్థం.




చలి కాలంలో తుమ్ములు, జలుబులు, దగ్గులు మామూలే అని సర్దుకుపోకూడదు. అలర్జీ తత్వం ఉన్నవాళ్లు ఇలా సర్దుకుపోతే మరిన్ని ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్టే! చలికాలం అలర్జీ ఇక్కట్లకు గురికాకుండా ఉండాలంటే కాస్త ముందుచూపు, మరికాస్త అప్రమత్తతతో వ్యవహరించి చల్లర్జీకి చెక్ పెట్టాలి!

# చల్లర్జీకి చెక్..!

చలికాలం సమస్యలను అర్థం చేసుకోవాలంటే వాటికి కారణాల గురించి కూడా కొంత అవగాహన పెంచుకోవాలి. ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉండే ముక్కు, గొంతు, చెవులు చలికాలం సమస్యలకు మూలాలవుతూ ఉంటాయి. ముక్కు, గొంతుల్లో 'మ్యూకస్ మెంబ్రేన్' అనే సున్నితమైన పొరలు చల్లని వాతావరణానికి ప్రేరేపితమై జలుబు, దగ్గు, సైనస్, అడినాయిడ్స్, టాన్సిల్స్ మొదలైన ఇబ్బందులను తెచ్చి పెడుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా అలర్జీ తత్వం ఉన్నవాళ్లకు ఈ లక్షణాలు ఇంకా త్వరగా మొదలవుతాయి. వాతావరణంలో చిన్నపాటి హెచ్చుతగ్గులకే సమస్యలు మొదలవుతాయి. వీళ్లలో హైపర్ రియాక్టివ్ మార్పులు కనిపిస్తాయి. వాతావరణంలోని చల్లదనానికి గురవగానే, చర్మం అడుగున ఉండే సన్నని నరాల చివర్లు కొన్ని రసాయనాలను విడుదల చేయటం మొదలుపెడతాయి. ఇవి ముక్కు, గొంతుల్లో ఉండే మ్యూకస్ మెంబ్రేన్స్ లైనింగ్‌ను ప్రభావితం చేయడంతో జలుబు, దగ్గు, ముక్కు నుంచి నీరు కారటం, ఆయాసం మొదలైన ఇబ్బందులు రోజుల తరబడి వేధిస్తాయి.

### అలర్జీ సమస్యలు ఇవే!

అలర్జీ తత్వం ఉన్న వాళ్లలో చల్లని వాతావరణానికి వారి వారి శరీర తత్వాన్నిబట్టి రకరకాల సమస్యలు తలెత్తటం సహజం. అవేంటంటే...

- **హైపర్ రియాక్టివ్ బ్రాంకైటిస్:** వీళ్లకి ఆస్తమా ఎటాక్ వస్తుంది. ఊపిరి అందకపోవటం, ఆయాసంతోపాటు పిల్లికూతల లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఉదయం, రాత్రి వేళల్లో ఎక్కువై, నిద్ర కూడా కరవవుతుంది. విపరీతమైన దగ్గు ఉంటుంది.
- **హైపర్ రియాక్టివ్ లారింగైటిస్:** వీళ్లకి రాత్రి వేళ దగ్గు ఎక్కువవుతుంది. పొడి దగ్గు, లేదంటే కొద్దిగా కఫంతో కూడిన దగ్గు ఉంటుంది. గొంతు బొంగురు పోతుంది.
- **హైపర్ రియాక్టివ్ రైనైటిస్:** ముక్కు దిబ్బడ, ఆగకుండా తుమ్ములు, ముక్కు నుంచి నీరు కారటం ఈ సమస్య లక్షణాలు.

### జీవనశైలి మారాలి!

అలర్జీ తత్వం ఉన్నవాళ్లు ఇతరుల కంటే అప్రమత్తంగా ఉండాలి. అలర్జీ బారినపడి అవస్థలు పడే కంటే ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తే ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. ఇందుకోసం...

- **వాతావరణానికి తగిన దుస్తులు:** చల్లగాలి ఒంటికి తగకుండా మందపాటి దుస్తులు వేసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, గొంతులోకి చల్లని గాలి చొరబడనివ్వకుండా చూసుకోవాలి. స్కార్ఫ్‌లు, మఫ్లర్లు, గ్లౌజులు వాడాలి. స్లీవ్‌లెస్, షార్ట్స్, టీ షర్ట్‌లు, స్కర్ట్‌లు వేసుకోవటం మానేయాలి.
- **వెచ్చ వెచ్చగా:** ఇల్లు వెచ్చగా ఉంచుకోవటం కోసం రూమ్ హీటర్లు వాడాలి. వేడి నీళ్ల స్నానం చేయాలి. సాధ్యమైనంత వరకూ చల్లని నీటికి దూరంగా ఉండాలి. పొడిగా ఉండే దుస్తులే ధరించాలి.
- **తేమ సమంగా!:** చలికాలం గాలిలో తేమ తగ్గుతుంది. దీని వల్ల కూడా అలర్జీ ఉన్న వ్యక్తుల్లో ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి తేమను సమంగా ఉంచుకోవటం కోసం పడగ్గదిలో చిన్న స్టవ్ మీద నీళ్లు ఉంచి మరిగించాలి. చిన్న మంట మీద ఉంచితే నీళ్లు మరుగుతూ ఆవిరి గాల్లో కలిసి గదంతా తేమ విస్తరిస్తుంది.
- **ఆహార నియమాలు:** చలికాలంలో ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్ లాంటి చల్లని పదార్థాలు తీసుకోకూడదు. కొందరికి కొన్ని రకాల ఆహార పదార్థాలు తినటం వల్ల అలర్జీ లక్షణాలు మొదలవుతాయి. అవేంటో...ఎవరంతట వాళ్లే గుర్తించి వాటికి దూరంగా ఉండాలి. కొందరికి గుడ్లు, మరికొందరికి తీపి పదార్థాలు పడకపోవచ్చు.
- **పులుపు, కారం, తీపి:** రుచుల్లో విపరీతమైన తత్వం... అంటే, అతి పుల్లని, అతి తీపి, అతి కారం...ఇలాంటి పదార్థాలు అలర్జీ తత్వం ఉన్న వాళ్లు తినకపోవటమే మంచిది. వీటికి బదులుగా మధ్యస్థంగా ఉండే తేలికపాటి ఆహారం తీసుకోవాలి.

ఎలర్జీ ఉన్న వాళ్లకు మందుల కంటే ముఖ్యంగా వ్యక్తిగత జాగ్రత్తలే కీలకం. కాబట్టి ఎలర్జీకి గురై జలుబు, దగ్గుతో వైద్యుల దగ్గరికి వెళ్లేబదులు, ఈ ముందు జాగ్రత్తలు పాటిస్తే ఎలర్జీ లక్షణాలు దరి చేరకుండా ఉంటాయి.

- **వీలైనంత త్వరగా మందులు:** అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే యాంటీ హిస్టమైన్ మందులు వాడితే అలర్జీ తగ్గిపోతుంది. అలాకాకుండా 'తగ్గుతుందిలే!' అనే ఉద్దేశంతో రోజుల తరబడి నిర్లక్ష్యం చేస్తే లక్షణాల ఉధృతి పెరిగి దైనందిన జీవితం ఇబ్బందికరంగా మారుతుంది. ఎలర్జీ ఉన్నవాళ్లు వైద్యులు సూచించిన యాంటీ హిస్టమైన్ మందులను ఎప్పుడూ దగ్గరుంచుకోవాలి. చలి కాలం మొత్తం వైద్యులు సూచించిన మోతాదు మేరకు ప్రతిరోజూ వాడాల్సిన అవసరం కూడా ఉండొచ్చు.

### తీపికి విరుగుడు కారం!

తీపితో అలర్జీ వేధించే శరీర తత్వం ఉన్న వాళ్లు ఎప్పటికీ స్వీట్లకు దూరంగా ఉండాలన్నా కష్టమే! మరీ ముఖ్యంగా వేడుకలు, పెళ్లిళ్ల సమయంలో స్వీట్లను తప్పించుకోలేం! ఇలాంటప్పుడు తీపితో ముడిపడి ఉండే అలర్జీకి గురికాకుండా ఉండాలంటే తీపి తిన్న వెంటనే, కారంగా ఉండే స్నాక్స్ తినాలి. ఇలా చేస్తే తీపి వల్ల శరీరంలో మ్యూకస్ మెంబ్రేన్‌లో కలిగే మార్పులు కారంతో సర్దుకుంటాయి. ఒకవేళ కారంగా ఉండే పదార్థాలు అందుబాటులో లేకపోతే మధ్యస్థంగా ఉండే సూప్‌లు తాగాలి లేదా రోటీ తినాలి.

### అలర్జీ చికిత్స సులువే!

- **నాసల్ స్ప్రే:** అలర్జీ రకాన్ని బట్టి చికిత్స ఉంటుంది. ఎలర్జిక్ రైనైటిస్ ఉన్నవాళ్లకు 'నాసల్ స్ప్రే'తో ఉపశమనం ఉంటుంది. స్టిరాయిడ్ ఉండే ఈ నేసల్ స్ప్రేలు సురక్షితం. వీటిని ముక్కులో స్ప్రే చేసుకుంటే ముక్కు దిబ్బడ వదిలి, ముక్కు నుంచి నీరు కారటం కూడా తగ్గుతుంది. అలర్జీ ఎక్కువ ఉన్నవాళ్లు చలికాలం మొత్తం ఈ స్ప్రే వాడాల్సి ఉంటుంది.
- **ఇన్‌హేలర్స్:** అలర్జిక్ బ్రాంకైటిస్ ఉన్నవాళ్లకు ఇన్‌హేలర్స్ సమర్థంగా పని చేస్తాయి. వీళ్లు కూడా ఇన్‌హేలర్స్‌ను సీజన్ మొత్తం తీసుకోవాలి.
- **యాంటీ హిస్టమైన్లు:** లారింగ్జయిటిస్ ఉన్నవాళ్లకు యాంటీ హిస్టమైన్ టాబ్లెట్లు ఉపశమనాన్ని అందిస్తాయి. అలర్జీ వచ్చిన తర్వాత కాకుండా ముందే వీటిని వాడటం మొదలుపెడితే మంచిది.


ఒకవేళ అలర్జీ వచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే మందులు వాడటం మొదలుపెట్టినా లక్షణాలు తగ్గుముఖం పడతాయి.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

- చలికాలంలో ఉదయం వేళ కాకుండా పొగమంచు వీడి, ఎండ వచ్చిన తర్వాతే వాకింగ్‌కు వెళ్లాలి. లేదా సాయంత్రాలు వాకింగ్ చేయొచ్చు.
- ఇంట్లో ఉన్నా పాదాలకు చెప్పులు లేకుండా నడవకూడదు.
- గోరువెచ్చని నీళ్లు తాగటం అలవాటు చేసుకోవాలి.
- స్నానం చేస్తే అలర్జీ ఎక్కువవుతుంటే ఒంటిని సబ్బు నీళ్లలో ముంచిన స్పాంజితో తుడుచుకుని శుభ్రం చేసుకోవాలి.
- సూప్‌లు, జావ, టీ తాగితే ఉపశమనంగా ఉంటుంది.
- ధూమపానం మానేయాలి.
- అలర్జీ వస్తుందని అనిపించగానే వచ్చేదాకా ఆగకుండా మందులు మొదలుపెట్టాలి.
- ముక్కు, నోరు, చెవుల్లోకి చల్లని గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



మొలల సమస్య సర్వసాధారణమైపోయింది. అయితే ఈ సమస్యకు నూతన చికిత్సలు అందుబాటులో కొచ్చాయి. కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా సమస్యను సరిదిద్దుకోవాలి.




# మొలలకు సమర్థ వైద్యం

అస్తవ్యస్థ ఆహార, జీవనశైలుల ఫలితంగా వయసుతో సంబంధం లేకుండా మొలల సమస్య ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. కొందరికి ఈ సమస్య వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. హెమరాయిడ్స్ అనే ఈ పైల్స్ కొందరిలో బయటకు కనిపిస్తూ ఉంటే, మరి కొందర్లో లోపలే ఉండిపోతాయి. మలద్వారం దగ్గర ఉండే ఆనల్ కుషన్స్‌నే పైల్స్ అంటారు. వీటి వల్ల మలద్వారానికి రక్షణ దక్కడంతో పాటు, లీకేజీ కాకుండా, మోషన్ పడిపోకుండా ఆనల్ కుషన్స్ పటుత్వాన్నిస్తాయి. వీటి మీద బలమైన ఒత్తిడి పడినప్పుడు, రక్తనాళం చిట్టి రక్తస్రావం జరగడం, నొప్పి లాంటి బాధలు మొదలవుతాయి. ఇలాంటప్పుడు పైల్స్ బయటకు రావచ్చు లేదంటే సాగిపోయి లోపలే ఉండిపోవచ్చు. మలద్వారం నుంచిం రక్తస్రావం జరగడం ఒక్కటే మొలలకు సంకేతం కాదు. ఫిషర్, పేగు కేన్సర్‌లో కూడా ఇవే లక్షణాలు ఉంటాయి.

### మొలల లక్షణాలు

- మలవిసర్జన సమయంలో నొప్పి, రక్తస్రావం
- మలద్వారం దగ్గర దురద
- ఆసన ప్రదేశంలో నొప్పి, అసౌకర్యం
- మలద్వారం దగ్గర పుండ్లు తలెత్తడం
- ఆసన వాపు

### పైల్స్‌తో తలెత్తే సమస్యలు

- **రక్తస్రావం:** మలవిసర్జన సమయంలో లేదా తర్వాత కనిపిస్తుంది
- **రక్తహీనత:** రక్తస్రావంతో రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉంటుంది
- **ప్రొలాప్స్:** కొన్ని సందర్భాల్లో మొలలు పెద్దవిగా మారి మలద్వారం నుంచి బయటకు వచ్చేస్తాయి. ఈ ప్రొలాప్స్ విపరీతమైన నొప్పిని కలుగజేస్తాయి. రక్తస్రావం కూడా జరుగుతుంది.
- **ఇన్‌ఫెక్షన్:** పైల్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు, నొప్పి, వాపు ఉంటుంది. ఇలాంటి పైల్స్‌ను థ్రాంబోస్‌డ్ పైల్స్ అంటారు. ఈ సమస్యకు తక్షణ చికిత్స అవసరం.

**పైల్స్ సమస్యను లేజర్ సర్జరీలతో పరిష్కరించుకోవచ్చు. అయితే ఈ సర్జరీతో ఆశించినంత ఫలితం దక్కాలంటే లేజర్ సర్జరీతో పాటు హైబ్రిడ్ పద్ధతులైన డాప్లర్ గైడెడ్ హెమరోహైడల్ ఆర్టరీ లిగేషన్, స్టాప్లర్, స్క్లీరోథెరపీ, స్క్లిరోసెంట్ ఇంజెక్షన్ లాంటివి కూడా అవసరం.**

### నిర్ధారణ ఇలా...

బాహ్య పైల్స్‌ను భౌతికంగా పరీక్షించి నిర్ధారించవచ్చు. అంతర్గత పైల్స్‌ను వేళ్లతో పరీక్షించి నిర్ధారించవలసి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మలద్వారంలోకి అనోస్కోప్/ప్రోక్టోస్కోప్/సిగ్మాయిడోస్కోప్ పరీక్షలు అవసరమవుతాయి.

### తక్కువ నొప్పితో...

ఆనల్ కుషన్స్ మలద్వార పటుత్వానికి అత్యవసరం. కాబట్టి పూర్వంలా వాటిని తొలగించకుండా, పైల్స్‌కు సర్జరీ చేసే విధానాన్ని నేడు అందుబాటులోకొచ్చింది. దారాలు, నాటు వైద్యాలతో ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం ఎక్కువ. కాబట్టి వాటికి బదులుగా ఆధునిక చికిత్సలను ఆశ్రయించడమే ఉత్తమం. ప్రస్తుతం పైల్స్ సమస్యను లేజర్ సర్జరీలతో పరిష్కరించుకోవచ్చు. అయితే ఈ సర్జరీతో ఆశించినంత ఫలితం దక్కాలంటే లేజర్ సర్జరీతో పాటు హైబ్రిడ్ పద్ధతులైన డాప్లర్ గైడెడ్ హెమరోహైడల్ ఆర్టరీ లిగేషన్, స్టాప్లర్, స్క్లీరోథెరపీ, స్క్లిరోసెంట్ ఇంజెక్షన్ లాంటివి కూడా అవసరం. వీటితో మంచి ఫలితాలను సాధించవచ్చు. ఈ చికిత్సలతో నొప్పి, ఆస్పత్రిలో గడిపే సమయం తక్కువ. సర్జరీ అయిన ఒక్కరోజులోనే డిశ్చార్జ్ అయిపోవచ్చు. 3 నుంచి 4 రోజుల్లో అన్ని పనులూ చేసుకోవచ్చు. మలవిసర్జన సమయంలో నొప్పి, రక్తస్రావం సమస్యలు ఉన్నవాళ్లు వెంటనే జనరల్ సర్జన్ లేదా ప్రొక్టాలజిస్ట్‌లను కలవాలి. మరీ ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన వాళ్లు ఈ సమస్య కనిపించినప్పుడు కొలనోస్కోపీ చేయించుకోవడం తప్పనిసరి.

డాక్టర్ శాంతి వర్ధని
సీనియర్ జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్,యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



వింటర్ బ్లూస్

## బరువు పెంచే కాలం

చలికాలం అందరం ఎంతోకొంత బరువు పెరుగుతాం. అందుకు వేర్వేరు కారణాలున్నాయి. అవేంటో తెలుసుకుని వాటికి చెక్ చెబుదాం!

చలికాలంలో ఎంతోమంది సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (ఎస్‌ఎడి)కి గురవుతూ ఉంటారు. ఇదొకరకమైన డిప్రెషన్ లాంటిది. ఈ సమస్య తలెత్తకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటంటే...

- **ఇన్‌సోమ్నియా:** మిగతా కాలాల్లో వేధించే నిద్రలేమి సమస్య చలికాలంలో తగ్గుముఖం పడుతుంది. దాంతో అవసరానికి మించి నిద్రపోతాం. ఉదయాన్నే లేవడానికి బద్ధకిస్తూ ఉంటాం. ఫలితంగా చురుకుదనం తగ్గుతుంది. దాంతో శరీరం బరువు పెరుగుతుంది.
- **కంఫర్ట్ ఫుడ్:** వెచ్చదనం కోసం మందపాటి దుస్తులు వేసుకున్నట్టే, జిహ్వాచాపల్యాన్ని తీర్చుకోవడం కోసం ఈ కాలంలో రకరకాల పదార్థాల మీదకు మనసు మళ్లుతూ ఉంటుంది. తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది కాబట్టి ఈ కాలంలో తినాలనే కోరిక పెరుగుతూ ఉంటుంది. కాబట్టి చలికాలం ఈ కోరికను అదుపు చేసుకోవాలి.
- **చక్కెర తంటా:** దీపావళి, క్రిస్మస్ లాంటి పండుగలతో తీపి పదార్థాలను ఎక్కువగా తినేస్తాం. కాబట్టి చలికాలంలో బరువు పెరిగే సమస్య ఎక్కువే! ఈ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.
- **మెటబాలిజం:** మెటబాలిజం పెరిగితే సన్నబడాలి. కానీ ఈ కాలంలో ఒంటిని వెచ్చగా ఉంచడం కోసం మెటబాలిజం పెరుగుతుంది. అదే సమయంలో ఆకలి కూడా పెరుగుతుంది. కాబట్టి తినాలనే కోరికను అదుపులో ఉంచుకోవాలి.
- **అలవాట్లు:** క్రమం తప్పకుండా చేసే వ్యాయామాల్లో కోత పడడం, ఎక్కువ సమయాల పాటు ఇంటికే పరిమితమైపోవడం ఈ కాలంలో సహజం. కానీ బద్ధకాన్ని వదిలేసి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి. శరీరాన్ని వీలైనంత చురుగ్గా ఉంచగలిగితే చలికాలం బరువు పెరిగే సమస్య దరి చేరకుండా ఉంటుంది.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 2 జనవరి 2024
cinema@andhrajyothy.com

# మా జోలికొస్తే మాకడ్డువస్తే మామూలుగా ఉండదు..



క్లాస్ కేరక్టర్ చేసినా మాస్ కేరక్టర్ చేసినా ఒదిగిపోయి నటించడం నాగార్జున ప్రత్యేకత. రానున్న సంక్రాంతికి 'నా సామిరంగ' అంటూ బాక్సాఫీస్‌పై యుద్ధానికి సిద్ధమయ్యారు నాగ్. విజయ్ బిన్ని దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ సాంగ్, లిరికల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. 'మాజోలికొస్తే.. మాకడ్డువస్తే.. మామూలుగా వుండదు.. నా సామిరంగ.. ఈ గీత తొక్కితే.. మా సేత సిక్కితే.. మామూలుగా ఉండదు.. నా సావిరంగ అంటూ హీరో పాత్ర లక్షణాలను తెలియజేస్తూ చంద్రబోస్ రాసిన ఈ పాటను మాస్ మెచ్చేలా ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారని, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ హై ఎనర్జీతో ఈ పాటను ఆలపించారని, నాగార్జున, అల్లరి నరేశ్, రాజ్ తరుణ్‌లతోపాటు మూడు వందలమంది డాన్సర్స్ పాల్గొనగా దినేశ్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. స్నేహం, భావోద్వేగాల మేళవింపుగా రూపొందిన 'నా సావిరంగ సంక్రాంతికి పర్‌ఫెక్ట్ మూవీ అని వారు అన్నారు. ఆశికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్న ఈ హైబడ్జెట్ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ.

# న్యూ ఇయర్... న్యూ లుక్స్














కొత్త సంవత్సరం కొత్త లుక్స్‌తో సినీ ప్రపంచానికి నూతన శోభను తెచ్చే పనిలోవున్నారు మన స్టార్స్. రేపు సంక్రాంతికి వెంకటేశ్ 'సైంధవ్', నాగార్జున 'నా సామిరంగ, మహేశ్ 'గుంటూరుకారం', రవితేజ 'ఈగల్, తేజా సజ్జా 'హను-మాన్' సినిమాలు సందడి చేయనున్నాయి. సంక్రాంతి అంటే సినిమాల పండగ. పండుగ సినిమాలు కాబట్టి ప్రమోషన్ల హడావిడి కామన్. అయితే.. వచ్చే నెలలో విడుదలయ్యే సినిమాలు కూడా ఈ సంక్రాంతి సీజన్‌ని వదలట్లేదు. పనిలోపనిగా ఆ సినిమాల న్యూ లుక్కుల్ని కూడా విడుదల చేసేస్తూ హంగామాను రెట్టింపు చేస్తున్నారు నిర్మాతలు. పండగ సినిమాలైన వెంకటేశ్ 'సైంధవ్', రవితేజ 'ఈగల్' న్యూలుక్కుల్ని సదరు నిర్మాతలు కొత్త ఏడాది తొలిరోజున విడుదల చేశారు. వెంకటేశ్ సినిమా అంటే భావోద్వేగాల సమ్మిళితంగా ఉంటుంది. అందుకు తగ్గట్టే ఈ న్యూలుక్ ఉంది. కూతురుతో ఆడుకుంటున్న తండ్రిలా వెంకటేశ్ ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. శైలేష్ కొలను ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక సోమవారం విడుదలైన మరో పండగ సినిమా న్యూలుక్ రవితేజ 'ఈగల్'ది. ఈ లుక్‌లో స్టైలిష్‌గా అండర్‌వరల్డ్ డాన్‌ని తలపిస్తున్నారు రవితేజ. ఏదేమైనా ఈ న్యూలుక్స్ సినిమాలపై అంచనాలు పెంచేలా ఉన్నాయని చెప్పక తప్పదు. ఇక సోమవారం విడుదలైన మరో న్యూలుక్ ఎన్టీయార్ 'దేవర'ది. ఇది పండుగ సినిమా కాదు. ఏప్రిల్ 5న విడుదల కానుంది. అయితే.. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ని ఈ నెల 8న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారక్ న్యూలుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. అలలతో ఎగసిపడే సముద్రంలో బోట్‌పైన ఠీవీగా నిలబడ్డ తారక్‌ని ఈ లుక్‌లో చూడొచ్చు. మాస్‌ని మెప్పించేలా ఈ లుక్ ఉందని చెప్పొచ్చు. కొరటాల శివ దర్శకత్వంలో రెండు భాగాలుగా తెరకెక్కనున్న ఈ సినిమాలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. వీటితోపాటు గోపీచంద్ 'భీమా', గల్లా అశోక్ హీరోగా నటిస్తున్న రెండో సినిమా, అంజలి ప్రధానపాత్రలో రూపొందుతోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రాల పోస్టర్లను కూడా సదరు చిత్రాల నిర్మాతలు విడుదల చేశారు. మొత్తానికి పండక్కి విడుదలయ్యే సినిమాలతోపాటు, నిర్మాణంలో ఉన్న సినిమాల న్యూలుక్కులు కూడా తోడవ్వడంతో అటు మీడియా, ఇటు సోషల్‌మీడియాలు కళకళలాడిపోతున్నాయి.

# అప్పుడు మున్నాభాయ్ తప్పక వస్తాడు



రాజ్‌కుమార్ హిరాణీ దేశం గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరు. వందశాతం సక్సెస్‌రేట్ ఉన్న అతికొద్ది మంది దర్శకుల్లో ఆయన కూడా ఒకరని నిస్సంకోచంగా చెప్పొచ్చు. ఆయన తీసిన సినిమాలన్నీ అద్భుతాలే. రీసెంట్‌గా వచ్చిన 'డంకీ' సైతం మూడొందలకోట్ల పైచిలుకు వసూళ్లను రాబట్టడమేకాక, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. 'డంకీ' వసూళ్ల గురించి ఇటీవల ఆయన మాట్లాడుతూ ' ఈసినిమా వసూళ్లను భారీ స్థాయిలో మేం ఆశించలేదు. కారణం ఇది కమర్షియల్ మాస్ సినిమా కాదు. ఇదొక వినోదంతో కూడిన సందేశాత్మక చిత్రం. షారుక్ కూడా ఈ సినిమా విషయంలో క్లారిటీగా ఉన్నాడు. అనుకున్నట్టే స్లోగా పికప్ అవుతోంది. ప్రస్తుతమైతే కలెక్షన్లు నిలకడగా ఉన్నాయి' అని చెప్పారు హిరాణీ.. 'మున్నాభాయ్' ఫ్రాంచైజీ గురించి మాట్లాడుతూ 'రెండు భాగాలూ నాకు మంచి పేరు తెచ్చాయి. వసూళ్ల పరంగా కూడా రికార్డులు సృష్టించాయి. మూడో భాగం చేయాలని ఉంది. సగం స్క్రిప్ట్ కూడా రెడీగా ఉంది. అయితే.. తొలి రెండు భాగాల స్థాయిలో కథ రాకపోతే మాత్రం చేయను. సంతృప్తికరంగా వస్తే తప్పకుండా 'మున్నాభాయ్' మరోసారి మిమ్మల్ని పలకరిస్తాడు' అంటూ చెప్పుకొచ్చారు రాజ్‌కుమార్ హిరాణీ.

# వచ్చే నెల్లో రకుల్ పెళ్లి





పంజాబీ భామ రకుల్ ప్రీత్‌సింగ్, ఆమె బాయ్‌ఫ్రెండ్, నిర్మాత జాకీ భగ్నానీ పెళ్లి తేదీ ఫిక్స్ అయింది. మూడేళ్ల నుంచి ప్రేమలో ఉన్న ఈ జంట ఫిబ్రవరి 22న జరిగే వివాహంతో ఒకటి కానుంది. . 'రకుల్, జాకీల పెళ్లి వచ్చే నెల 22న గోవాలో జరుగుతుంది. ఆర్భాటాలు ఏమీ లేకుండా అతి కొద్దిమంది కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య పెళ్లి చేసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం జాకీ బ్యాంకాక్‌లో స్నేహితులతో బ్యాచ్‌లర్ పార్టీతో బిజీగా ఉన్నారు. రకుల్ కూడా థాయ్‌లాండ్‌లోనే ఉంది' అని ఆంగ్ల వెబ్ సైట్లు వెల్లడించాయి. నూతన సంవత్సరం తొలి రోజున వచ్చిన ఈ తీపి కబురుతో రకుల్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2021 అక్టోబర్‌లో తన పుట్టిన రోజున జాకీతో తను ప్రేమలో ఉన్న విషయాన్ని రకుల్ బయట పెట్టింది. అతనే తన ప్రపంచం అని కూడా పేర్కొంది. ఇక అప్పటినుంచి ఏ పార్టీకి వెళ్లినా ఇద్దరూ కలసే వెళుతున్నారు. వీరిద్దరి పెళ్లి త్వరలో జరుగుతుందనే వార్తలు కొంతకాలంగా వినబడుతున్నాయి కానీ ఇద్దరూ ఆ విషయం గురించి ఎక్కడా స్పందించలేదు. పెళ్లి గురించి తొందరపడడం లేదని రకుల్ ఇటీవలే చెప్పారు. ఇది జరిగిన నెల రోజులకే ఈ పెళ్లి వార్త బయటకు వచ్చింది. రకుల్ ప్రస్తుతం తెలుగులో ఏ సినిమాలు చేయడం లేదు కానీ కమల్‌హాసన్ నటిస్తున్న 'ఇండియన్ 2'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే జాకీ నిర్మించిన 'బడే మియా ఛోటే మియా' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.



# నేను దేవతను కాను

ఏ ఉద్వేగాన్నీ దాచుకోలేని మనస్తత్వం సమంతది. బాధైనా, సంతోషమైనా వ్యక్తపరచకుండా ఉండలేదు తను. రీసెంట్ న్యూ ఇయర్ సెలబ్రేషన్నే తీసుకోండి. విదేశాల్లో విహరిస్తూ.. తన ఆనందాన్ని ఓ ఇమేజ్ ద్వారా వ్యక్తం చేస్తూ.. తన ఇన్‌స్టాలో షేర్ చేసింది సమంత. ఆ స్టిల్ చూసిన వారంతా 'దేవత' అంటూ సమంతను కొనియాడుతున్నారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. 'నేను దేవతను కాను. ఉద్వేగాలతో అనునిత్యం సహవాసం చేసే మనిషిని. ఓర్పులో భూమికి సమానమైన స్త్రీని' అంటూ ఓ మంచి పోస్ట్‌ని జత చేసింది. ఈ పోస్ట్‌పై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం సినిమాలకు కామా పెట్టి విహారయాత్రల్లో బిజీగా ఉన్నారు సమంత. త్వరలోనే పూర్తి ఆరోగ్యంగా కెమెరా ముందుకు వస్తారని ఆమె అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ కమల్‌హాసన్ కుటుంబం ఆదివారం రాత్రి సందడి చేసింది. చెన్నైలోని కమల్ ఇంట్లో జరిగిన ఈ వేడుకలకు సుహాసిని, ఆమె భర్త మణిరత్నం, శ్రుతీ హాసన్, ఆమె బాయ్ ఫ్రెండ్ శంతను హజారికా తదితరులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో కమల్, శ్రుతి పాత తమిళ పాటలు పాడి సందడి చేశారు.

# సుందరం మాస్టారి కథ



హర్ష చెముడు, దివ్య శ్రీపాద ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'సుందరం మాస్టారు'. కల్యాణ్ సంతోష్ దర్శకత్వంలో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఇంతవరకూ కమెడియన్‌గా మెప్పించిన హర్ష ఈ సినిమాలో తొలిసారిగా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా సుందరం మాస్టారు అటెండెన్స్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమా ఎంత వినోదభరితంగా ఉంటుందనేది ఈ ప్రోమో చూస్తే అర్థమవుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సుందరం అనే ప్రభుత్వ టీచర్ చుట్టూ తిరిగే కథ ఇది. మిర్యాల మెట్ట అనే మారుమూల పల్లెలో ఇంగ్లీషు టీచర్‌గా వెళ్లిన సుందరం దగ్గరకి ఎటువంటి విద్యార్థులు వస్తారు, వారికి అతను ఇంగ్లీషు ఎలా నేర్పించాడు అనే అంశాలను వినోదభరితంగా చెప్పాం.' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: దీపక్ ఎరెగడ.


# ఈ రికార్డుని బ్రేక్ చేసేదెవరో?



గత ఏడాదిలో అనూహ్య విజయాలను అందుకొని అరుదైన రికార్డులను సృష్టించిన హీరో షారుక్ ఖాన్. భారతీయ చలనచిత్ర చరిత్రలో ఏహీరోకీ లేని రికార్డు 2023లో షారుక్ వశమైంది. అమితాబ్ తర్వాత బాలీవుడ్‌లో లాంగ్విటీ ఉన్న సూపర్‌స్టార్‌గా అవతరించారు షారుఖ్. బాలీవుడ్ సూపర్‌స్టార్‌గా, బాక్సాఫీస్ బాద్‌షాగా అభిమానులచే కితాబులందుకున్నారు. అయితే.. అంతటి సూపర్‌స్టార్‌కి కూడా బ్యాడ్ పిరియడ్ తప్పలేదు. దాదాపు నాలుగేళ్లు విజయం షారుక్‌పై సీతకన్నేసింది. చేసిన ప్రతి సినిమా ఫ్లాప్. షారుఖ్ పని అయిపోయిందని, ఇక రిటైర్ అవ్వడం బెటరంటూ వ్యంగ్యభాషణలు కూడా వినిపించాయి. అయితే సింహం రెండడుగులు వెనక్కు వేసేది వందడుగులు దూకడానికే అన్న చందాన 'పఠాన్'గా బాక్సాఫీస్‌పై విరుచుకుపడ్డారు షారుఖ్. 2023 జనవరి 25న విడుదలైన 'పఠాన్' బాలీవుడ్ రికార్డులను తిరిగి రాసింది. వెయ్యికోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టి బాద్‌షా క్రేజ్ ఇసుమంత కూడా తగ్గలేదని నిరూపించింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దీపిక పదుకొణే, జాన్ అబ్రహం, డింపుల్‌కపాడియా కీలక పాత్రలు పోషించగా, సల్మాన్‌ఖాన్ ప్రత్యేక పాత్ర పోషించడం విశేషం.


హీరోలకు ఏడాదికి ఒక హిట్ రావడమే గగనమైన నేటి రోజుల్లో అదే ఏడాది సెప్టెంబర్ 7న 'జవాన్'గా మరోసారి బాక్సాఫీస్‌పై దాడి చేశాడు కింగ్‌ఖాన్. తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మూడొందలకోట్ల భారీ బడ్జెట్‌తో రూపొంది దాదాపు 1200కోట్ల రూపాయాల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ఇందులో షారుక్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయగా, తండ్రి సరసన దీపిక పదుకొణే, కొడుకు సరసన నయనతార కథానాయికలుగా నటించారు. విజయ్‌సేతుపతి ప్రతినాయక పాత్ర పోషించిన ఈ చిత్రంలో ప్రియమణి కూడా కీలకపాత్ర పోషించారు. అనిరుధ్ సంగీతం సమకూర్చారు. దక్షిణభారతానికి చెందిన సినీకళాకారులు ఎక్కువమంది పనిచేసిన ఈ సినిమా షారుక్ కెరీర్‌లోనే వసూళ్ల పరంగా నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది.

2023 డిసెంబర్ 21న 'డంకీ'తో మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చారు షారుక్‌ఖాన్. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డీసెంట్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం ఇప్పటివరకూ అందిన సమాచారం మేరకు మూడొందలకోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లను రాబట్టిందని తెలిసింది. తాప్సీ పన్ను, బొమ్మన్ ఇరానీ, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం వినోదభరితంగానే గాక సందేశాత్మక చిత్రంగా విమర్శకుల ప్రశంసలందుకుంటోంది.



ఈ ఏడాది మొత్తంగా చూస్తే తన మూడు సినిమాలతో 2500కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి భారతీయ చలనచిత్ర చరిత్రలో రికార్డ్ సృష్టించారు షారుక్‌ఖాన్. ఇది ఏ హీరోకీ లేని రికార్డు. ఒకే ఏడాది మూడు సినిమాలు విడుదల అవ్వడం.. మూడూ విజయాలు సాధించడం.. వేలకోట్ల వసూళ్లను రాబట్టడం ఇది కనీవినీ ఎరుగని చరిత్ర.

ఈ విషయంపై ట్రేడ్ అనలిస్ట్ రమేశ్ బాలా తన బ్లాగ్‌లో 'ఒక కేలండర్ సంవత్సరంలో తన సినిమాల ద్వారా 2500కోట్ల రూపాయల స్థూల ఆదాయాన్ని బాక్సాఫీస్‌కి అందించిన తొలి భారతీయ నటుడు షారుక్‌ఖాన్' అంటూ అభివర్ణించారు. ఇది భారతీయ చలనచిత్ర చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన విషయం. నిజానికి రికార్డులు అనేవి తయారయ్యేది బ్రేక్ అవ్వడానికే. ఈ రికార్డు కూడా తప్పక బ్రేక్ అయి తీరుతుంది. ఎవరి చేతిలో అనేది కాలం చేతిలో ఉంది.





# ప్యాకేజ్డ్ వస్తువులపై తయారీ తేదీ ముద్రణ తప్పనిసరి

» యూనిట్ అమ్మకం ధర కూడా..

న్యూఢిల్లీ: ప్యాక్ చేసిన ఆహారోత్పత్తులపై 2024 జనవరి 1 నుంచి వస్తువు తయారీ తేదీతో పాటు యూనిట్ ధర ముద్రించడం తప్పనిసరి అని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. తద్వారా వినియోగదారులకు తాము కొనుగోలు చేయబోయే వస్తువు తయారైన తేదీ, యూనిట్ (గ్రాము లేదా కేజీ) ఖరీదుపై స్పష్టత లభిస్తుందన్నా రు. ఉదాహరణకు, 2.5 కేజీల పిండి ప్యాకెట్‌పై గరిష్ఠ చిల్లర ధరతోపాటు కేజీ ఖరీదును కూడా ముద్రించాల్సి ఉంటుంది. కేజీలోపు ప్యాకెట్‌పై ఒక్కో గ్రాము ఖరీదును ముద్రించాల్సి ఉంటుంది.

### యూపీఐ సేవల్లో పలు మార్పులు

ఈ జనవరి 1 నుంచి యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవల్లో ఆర్‌బీఐ పలు మార్పులు తీసుకొచ్చింది. ఆ వివరాలు..

1 యూపీఐ ద్వారా రోజువారీ గరిష్ఠ చెల్లింపుల పరిమితి రూ.లక్షకు పెంపు. ఆసుపత్రులు లేదా విద్యా సంస్థలకు చెల్లించే పరిమితిని మాత్రం ఆర్‌బీఐ రూ.5 లక్షలకు పెంచింది.

1 ఇకపై యూపీఐ యాప్‌ల ద్వారా ఎవరికైనా చెల్లింపులు జరిపేటప్పుడు, ఆ వ్యక్తి బ్యాంక్ అకౌంట్ పేరు కూడా మీ స్ర్కీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. చెల్లింపుల్లో పొరపాట్లను నివారించేందుకు ఈ సౌకర్యం దోహదపడుతుంది.

1 జపాన్ కంపెనీ హిటాచీ భాగస్వామ్యంలో ఆర్‌బీఐ దేశవ్యాప్తంగా యూపీఐ ఏటీఎంలను ఏర్పాటు చేయనుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఈ ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది.

1 గడిచిన ఏడాది కాలంగా వినియోగించని యూపీఐ ఐడీలను 2023 డిసెంబరు 31 న డీయాక్టివేట్ చేయాలని పేమెంట్ యాప్స్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది.

1 యూపీఐ వాలెట్స్ లేదా ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) ద్వారా రూ.2,000కు పైగా చెల్లింపులపై 1.1 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

# ఎగుమతులపై మిధానీ దృష్టి

» జీఈ ఏరోస్పేస్ వంటి కంపెనీలతో చర్చలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మిశ్రధాతు నిగమ్ (మిధానీ) ఎగుమతులపై దృష్టి కేంద్రీకరించాలని భావిస్తోంది. మిధానీ మెటీరియల్స్ కోసం అంతర్జాతీయ ఏరోస్పేస్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని కంపెనీ వెల్లడించింది. 2023 అక్టోబరు ఒకటి నాటికి కంపెనీ చేతిలో మొత్తం రూ.1,501 కోట్ల విలువైన ఆర్డర్లున్నాయి. ఇవి పూర్తి చేయడానికి ఏడాదిన్నర వరకూ పడుతుందని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు రూ.100 కోట్లకు చేరగలవని కంపెనీ ఆశావహంగా ఉంది. రోల్స్ రాయిస్, జీఈ ఏరోస్పేస్ నుంచి ఆర్డర్లు లభించాయని కంపెనీ వెల్లడించింది. దేశంలో టైటానియం అల్లాయిస్‌ను తయారు చేస్తున్న ఒకే ఒక కంపెనీ మిధానీ. ఏడాదికి 500 టన్నుల టైటానియం అల్లాయిస్‌ను ఉత్పత్తి చేసే టైటానియం యూనిట్ వచ్చే రెండేళ్లలో అందుబాటులోకి రానుందని మిధానీ పేర్కొంది. దీంతోపాటు వైడ్ ప్లేట్ మిల్స్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోనుంది.

# జీఎస్టీ వసూళ్లు రూ.1.64 లక్షల కోట్లు

**గతనెలలో 10% వృద్ధి నమోదు**
**ఏపీ వసూళ్లు రూ.3,545 కోట్లు..**
**తెలంగాణలో రూ.4,753 కోట్లు**




న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరులో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్థూల వసూళ్లు రూ.1.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022 డిసెంబరులో గడించిన రూ.1.49 లక్షల కోట్ల స్థూల ఆదాయంతో పోలిస్తే 10 శాతం వృద్ధి నమోదైంది. కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గతనెలకు జీఎస్టీ వసూళ్లు రూ.1,64,882 కోట్లుగా ఉన్నాయి. అందులో సెంట్రల్ జీఎస్టీ రూ.30,443 కోట్లు, స్టేట్ జీఎస్టీ రూ.37,935 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.84,225 కోట్లుగా ఉంది. సెస్సు రూపంలో మరో రూ.12,249 కోట్లు వసూలయ్యాయి. రెగ్యులర్ సెటిల్‌మెంట్‌లో భాగంగా ఐజీఎస్టీ ఆదాయంలో రూ.40,057 కోట్లను సీజీఎస్టీలో, రూ.33,652 కోట్లు ఎస్‌జీఎస్టీలో జమచేసింది. అనంతరం సీజీఎస్టీ రూ.70,501 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.71,587 కోట్లకు చేరుకున్నాయి. కాగా, గతనెల ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధి చెంది రూ.3,545 కోట్లకు చేరుకోగా.. తెలంగాణలో ఆదాయం 14 శాతం వృద్ధితో రూ.4,753 కోట్లకు పెరిగాయి.

### 9 నెలల ఆదాయం రూ.14.97 లక్షల కోట్లు

2023-24 ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 నెలల కాలానికి జీఎస్టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.14.97 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వసూళ్లు రూ.13.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంతేకాదు, గడిచిన 9 నెలలకు సరాసరి నెలవారీ ఆదాయం రూ.1.66 లక్షల కోట్లకు పెరిగింది. అంతక్రితం ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన నెలవారీ సగటు రూ.1.49 లక్షల కోట్లతో పోలిస్తే 12 శాతం అధికమిది. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరంలో మే, ఆగస్టు మినహా మిగతా ఏడు నెలల్లో జీఎస్టీ ఆదాయం రూ.1.60 లక్షల కోట్లను మించి నమోదుకావడం గమనార్హం.

### ఎల్ఐసీకి రూ.806 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు

మహారాష్ట్ర పరోక్ష పన్నుల విభాగం తమ కంపెనీకి రూ.806.3 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు జారీ చేసిందని ఎల్ఐసీ సోమవారం వెల్లడించింది. అందులో రూ.365.02 కోట్ల జీఎస్టీ, రూ.404.7 కోట్ల పెనాల్టీతో పాటు రూ.36.5 కోట్ల వడ్డీ కలిపి చెల్లించాలని ఆదేశించినట్లు కంపెనీ పేర్కొంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మిస్‌మ్యాచ్‌కు సంబంధించిన ఈ నోటీసును ట్రిబ్యునల్‌లో సవాలు చేయనున్నట్లు తెలిపింది. ఈ ఆదేశాలతో కంపెనీ కార్యకలాపాలు లేదా ఆర్థిక పరమైన ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.

### ఏషియన్ పెయింట్స్‌కు రూ.13.83 కోట్ల నోటీసు

చెన్నైకి చెందిన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ తమ కంపెనీకి రూ.13.83 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసుతో పాటు రూ.1.38 కోట్ల పెనాల్టీ నోటీసు జారీ చేసిందని ఏషియన్ పెయింట్స్ సోమవారం వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం రిటర్నుల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మిస్‌మ్యాచ్‌కు సంబంధించి ఈ నోటీసులు జారీ అయినట్లు కంపెనీ స్పష్టం చేసింది. అయితే, ఈ ఉత్తర్వులను ట్రిబ్యునల్‌లో సవాలు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది.

# పీఎస్‌పీసీఎల్ చేతికి జీవీకే పవర్ ప్లాంట్

» అతి తక్కువ ధరకు సొంతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన 540 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్, గోయింద్వాల్ సాహెబ్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎస్‌పీసీఎల్) సొంతం చేసుకుంది. రూ.1,080 కోట్లకు ప్లాంట్‌ను కొనుగోలు చేసింది. దీని ప్రకారం ఒక్కో మెగా వాట్‌ను రూ.2 కోట్లకు సొంతం చేసుకున్నట్లవుతుంది. ఇంతవరకూ ఇంత తక్కువ ధరకు ఒక మెగావాట్ సామర్థ్యాన్ని ఏ కంపెనీ, ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. గతంలో కొన్ని కంపెనీలు మెగావాట్‌కు రూ.3 కోట్లు చెల్లించాయి. ఒక రాష్ట్ర పవర్ కార్పొరేషన్ ఈ విధంగా అప్పుల్లో కూరుకుపోయిన ఒక పవర్ ప్లాంట్‌ను కొనుగోలు చేయడం కూడా ఇదే ప్రథమం. ఈ ప్లాంట్‌లో 270 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లున్నాయి. కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ ప్రక్రియలో భాగంగా ఈ ప్లాంట్‌ను విక్రయించడానికి ఎన్‌సీఎల్‌టీ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ బిడ్లను ఆహ్వానించగా 2023 జులైలో పీఎస్‌పీసీఎల్ ఏకైక బిడ్డర్‌గా ఎంపిక అయింది.

### టై, హైదరాబాద్ ప్రెసిడెంట్‌గా శ్రీని చందుపట్ల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై), హైదరాబాద్ చాప్టర్ కొత్త ప్రెసిడెంట్‌గా శ్రీని చందుపట్ల ఎంపికయ్యారు. ఇప్పటి వరకూ ప్రెసిడెంట్‌గా ఉన్న రషీదా అదేన్‌వాలా నుంచి సోమవారం శ్రీని బాధ్యతలు తీసుకున్నారు. 2024 ఏడాదికి వైస్ ప్రెసిడెంట్‌గా రాజేశ్ పడగాల వ్యవహరిస్తారు.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 63,870 ▼ | 58,550 ▼ | 80,000 ▲ |
| ముంబై | 63,350 ▲ | 58,030 ▲ | 73,705 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 1వ తేదీ | | విజయవాడ | 585 |
| హైదరాబాద్ | 579 | విశాఖపట్నం | 625 |
| 2 జనవరి | | వరంగల్ | 581 |
| చిత్తూరు | 608 | దజను గుడ్లు రూ.72 | |
| గోదావరి | 585 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 112 | గోదావరి | 114 |
| వరంగల్ | 112 | విజయవాడ | 114 |
| కరీంనగర్ | 112 | గుంటూరు | 110 |
| మహబూబ్‌నగర్ | 112 | ఒంగోలు | 110 |
| కర్నూలు | 112 | చిత్తూరు | 115 |
| విశాఖపట్నం | 109 | | |

# మార్కెట్‌లో జర జాగ్రత్త

» కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ర్యాలీపై హెచ్చరికలు వినిపిస్తున్నాయి. నిఫ్టీ 20 శాతం అధిక విలువతో ట్రేడవుతున్నందున జాగ్రత్తగా ఉండాలని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ త్రైమాసిక నివేదికలో హెచ్చరించింది. వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో ఎప్పుడైనా మార్కెట్‌లో దిద్దుబాటు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఈ సంవత్సరం స్టాక్‌మార్కెట్‌లో పెద్దగా లాభాలు వచ్చే అవకాశం కూడా కనిపించడంలేదంది. ఒకవేళ కొన్ని షేర్లలో కొద్దిపాటి లాభాలున్నా, ఎక్కువ కంపెనీల షేర్లలో మాత్రం నష్టాలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది మార్కెట్ లాభాలు ఫండమెంటల్స్, సెంటిమెంట్ మధ్య జరిగే పోరాటంపై ఆధారపడి ఉంటాయని తెలిపింది.

### ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ బుకింగ్ అమ్మకాలతో సోమవారం ఫ్లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 31.68 పాయిం ట్ల లాభంతో 72,271.94 వద్ద, నిఫ్టీ 10.5 పాయింట్ల లాభంతో 21,741.90 వద్ద ముగిశాయి. మార్కెట్ ఫ్లాట్‌గా ముగిసినా, ఇంట్రా డేలో సెన్సెక్స్ 72,561.91 పాయింట్లు, నిఫ్టీ 21,834.35 పాయింట్లను తాకి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలను నమోదు చేశాయి. ఎనర్జీ, సర్వీసెస్, టెలికం షేర్లు సోమవారం చురుగ్గా ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఎలాంటి సంకేతాలు లేకపోవడం సోమవారం దేశీయ మార్కెట్లను నిరాశపరిచింది. ఈ వారం వెలువడే అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వు మినిట్స్ కోసం మార్కెట్ ఆతృతతో ఎదురు చూస్తోంది.

# వాహన విక్రయాల్లో రికార్డు

**2023లో 41.08 లక్షల యూనిట్ల సేల్స్.. సగం వాటా ఎస్‌యూవీలదే**

న్యూఢిల్లీ: ప్రయాణికుల వాహనాల (పీవీ) టోకు విక్రయాలు 2023లో 8.3 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు స్థాయి 41.08 లక్షలకు చేరుకున్నాయి. అందులో దాదాపు సగం వాటా ఎస్‌యూవీలదే. 2022లో రూ.10.58 లక్షలుగా ఉన్న వాహన సగటు ధర గత సంవత్సరంలో రూ.11.5 లక్షలకు పెరిగినప్పటికీ, రికార్డు స్థాయిలో అమ్మకాలు జరగడం మరో విశేషం. మార్కెట్ అగ్రగామి మారుతి సుజుకీతో పాటు హ్యుండయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్ 2023లో తమ అత్యుత్తమ వార్షిక విక్రయాలను నమోదు చేసుకున్నాయి. దేశంలోపీవీ వార్షిక విక్రయాలు 40 లక్షల యూనిట్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి అని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ అన్నారు. 2022లో పీవీ టోకు అమ్మకాలు 37.92 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. కాగా, 2022కి గాను మొత్తం పీవీ సేల్స్‌లో 42 శాతంగా నమోదైన ఎస్‌యూవీల వాటా 2023లో 48.7 శాతానికి పెరిగిందని శ్రీవాస్తవ తెలిపారు. ముమ్ముందు ఎస్‌యూవీల వాటా 50-55 శాతానికి పెరగవచ్చన్నారు.

**ఆటో పీఎల్ఐ పొడిగింపు**

ఆటోమొబైల్, ఆటో విడిభాగాల పరిశ్రమకు అందిస్తున్న ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) గడువు "పాక్షిక సవరణ"లతో మరో ఏడాది పొడిగిస్తున్నట్లు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

### మారుతిదే సగం వాటా..

గత సంవత్సరంలో మారుతి సుజుకీ విక్రయాలు 20 లక్షల యూనిట్ల మైలురాయిని దాటాయి. అంటే పరిశ్రమ మొత్తం విక్రయాల్లో సగం మారుతివే. అంతేకాదు, గత ఏడాది కంపెనీ ఆల్‌టైం రికార్డు స్థాయిలో 2,69,046 యూనిట్ల కార్లను ఎగుమతి చేసింది. గ్రామీణ మార్కెట్లలో 7.76 లక్షల యూనిట్ల విక్రయాలు, ప్రీ-ఓన్డ్ కార్ల సేల్స్ 4.6 లక్షల యూనిట్లు కూడా కంపెనీ చరిత్రలోనే అత్యధికమని శ్రీవాస్తవ వెల్లడించారు. ఇతర కంపెనీల విక్రయాలిలా ఉన్నాయి.

1 హ్యుండయ్ మోటార్ ఇండియా గత ఏడాది 9 శాతం వృద్ధితో 7,65,786 వాహనాలను విక్రయించింది. అంతేకాదు, కంపెనీ దేశీయ విక్రయాలు కూడా తొలిసారిగా 6 లక్షల యూనిట్ల మార్క్‌ను దాటాయి.

1 టాటా మోటార్స్ కూడా ఆల్‌టైం రికార్డు స్థాయిలో 5.53 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది. 2022తో పోలిస్తే 2023లో టయోటా కార్ల అమ్మకాలు ఏకంగా 46 శాతం వృద్ధితో 2,33,346 యూనిట్లకు చేరుకున్నాయి.





# ఓదార్పు విజయం దక్కేనా?

● భారత్-ఆసీస్ మూడో వన్డే నేడు
● హర్మన్‌పైనే అందరి దృష్టి

మ. 1.30 నుంచి జియో సినిమా, టీవీ18లో..



ఆసీస్ సారథి హీలీ

ముంబై: రెండు వరుస పరాజయాలతో వన్డే సిరీస్‌ను చేజార్చుకొన్న భారత మహిళల జట్టు.. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకొంటోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-2తో వెనుకంజలో ఉన్న టీమిండియా.. మంగళవారం జరిగే మూడో, ఆఖరి వన్డేలో ఆస్ట్రేలియాను ఓడించి పరువు కాపాడుకోవాలనుకొంటోంది. అయితే, మన బ్యాటింగ్‌కు వెన్నెముక అయిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేలవ ఫామ్ జట్టు విజయాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ క్రమంలో స్వదేశంలో ఆసీస్ చేతిలో ఎదురైన తొమ్మిది వరుస ఓటములకు బ్రేక్ వేయాలంటే కౌర్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాల్సిన అవసరం ఎంతో ఉంది. తొలి వన్డేలో భారీ స్కోరు చేసినా.. ప్రత్యర్థిని టీమిండియా బౌలర్లు సమర్థంగా అడ్డుకోలేకపోయారు. రెండో వన్డేలో రిచా ఘోష్ (96) పోరాటంతో విజయం ముంగిట నిలిచినా.. అమన్‌జోత్, దీప్తి శర్మ మ్యాచ్‌ను ముగించలేకపోయారు. ఈ మ్యాచ్‌లో హర్మన్ సేన ఏకంగా ఏడు క్యాచ్‌లు చేజార్చడం భారత ఫీల్డింగ్ ఎంత నాసిరకంగా ఉందో చెప్పకనే చెబుతోంది. అయితే, కంకషన్‌కు గురైన స్పిన్నర్ స్నేహ్ రాణా ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటుందని టీమిండియా కోచ్ అమోల్ మజుందార్ చెప్పాడు. మరోవైపు ఏకైక టెస్టులో ఓడినా.. వన్డే సిరీస్‌ను ఈపాటికే దక్కించుకొన్న ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. కెప్టెన్ అలిస్సా హీలీ విఫలమవుతున్నా.. లిచ్‌ఫీల్డ్, పెర్రీ, మెక్‌గ్రాత్ అండతో మెరుగైన స్కోర్లు చేస్తోంది. బౌలింగ్‌లో వేర్హమ్, కిమ్ గార్త్, సదర్లాండ్ రాణిస్తున్నారు.

**జట్లు (అంచనా)**

**భారత్:** యాస్తిక భాటియా, స్మృతీ మంధాన, రిచా, జెమీమా, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), దీప్తి, అమన్‌జోత్, పూజా వస్త్రాకర్, రాణా, శ్రేయాంక, రేణుక.

**ఆస్ట్రేలియా:** లిచ్‌ఫీల్డ్, హీలీ (కెప్టెన్), పెర్రీ, బెత్ మూనీ, తహిల, గార్డ్‌నర్, సదర్లాండ్, వేర్హమ్, అలన్ కింగ్, గార్త్, బ్రౌన్.

### సౌతాఫ్రికా నిర్ణయం టెస్ట్‌లకు మరణ శాసనం



సిడ్నీ: టెస్ట్ క్రికెట్‌ను చిన్నచూపు చూస్తున్న క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ)పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా విరుచుకుపడ్డాడు. ఈ నెల 10 నుంచి జరుగనున్న సౌతాఫ్రికా టీ20 లీగ్‌కు ప్రాధాన్యమిస్తూ..న్యూజిలాండ్‌తో జరిగే రెండు టెస్ట్‌లకు ద్వితీయ శ్రేణి జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అరంగేట్రం కూడా చేయని నీల్ బ్రాండ్‌ను కెప్టెన్‌గా నియమించడంతో పాటు మొత్తం ఏడుగురు కొత్త ఆటగాళ్లను జట్టులో చేర్చారు. సీఎస్ఏ నిర్ణయం..టెస్ట్ క్రికెట్‌కు మరణ శాసనం లిఖించేలా కనిపిస్తోందన్నాడు. గౌరవం ఇవ్వనపుడు ఆ జట్టుతో ఎందుకు ఆడాలని న్యూజిలాండ్‌ను ప్రశ్నించాడు.

# వన్డేలకూ వీడ్కోలు

**టీ20లకే పరిమితం**



డేవిడ్ వార్నర్

సిడ్నీ: ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ నూతన సంవత్సరం తొలి రోజున మరో సంచలన నిర్ణయం ప్రకటించాడు. టెస్టుల మాదిరే ఇక వన్డే ఫార్మాట్‌కు కూడా వీడ్కోలు చెబుతున్నట్టు 37 ఏళ్ల ఈ స్టార్ బ్యాటర్ సోమవారం వెల్లడించాడు. అయితే అంతర్జాతీయ టీ20ల్లో మాత్రం కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది వన్డే వరల్డ్‌కప్‌లో అద్భుతంగా రాణించిన వార్నర్.. జట్టును చాంపియన్‌గా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో రెండు శతకాలు, రెండు హాఫ్ సెంచరీలతో 528 పరుగులు సాధించాడు. కొత్తవారికి అవకాశమిచ్చేలా ఈ ఫార్మాట్‌కు ముగింపు పలికేందుకు ఇదే సరైన సమయమని తెలిపాడు. అలాగే ఈ రిటైర్మెంట్‌తో ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో పాల్గొనేందుకు తగిన సమయం కూడా లభిస్తుందని భావిస్తున్నాడు. పాక్‌తో బుధవారం నుంచి జరిగే మూడో టెస్టు అనంతరం వార్నర్ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్న విషయం తెలిసిందే. 2009లో వన్డేల్లో అరంగేట్రం చేసిన డేవిడ్ 161 మ్యాచ్‌ల్లో 45.30 సగటుతో 6,932 రన్స్ సాధించగా, ఇందులో 22 శతకాలున్నాయి. వన్డేల్లో అత్యధిక శతకాలు చేసిన పాంటింగ్ (29) తర్వాత వార్నర్ రెండో స్థానంలో ఉన్నాడు. ఒకవేళ 2025లో జరిగే వన్డే చాంపియన్స్ ట్రోఫీలో జట్టుకు అవసరమైతే రీఎంట్రీ ఇస్తానని వార్నర్ చెప్పడం గమనార్హం. కానీ ఇందుకు ఫిట్‌నెస్ కూడా సహకరించాల్సి ఉంటుందని తేల్చాడు.

# సంజయ్ సింగ్ ధిక్కార స్వరం

» అడ్‌హాక్ ప్యానెల్‌ను గుర్తించం
» జాతీయ పోటీలను నిర్వహిస్తాం



న్యూఢిల్లీ : బ్రిజ్‌భూషణ్ సింగ్ స్థానంలో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా ఎన్నికైన అతడి అనుచరుడు సంజయ్ సింగ్ ధిక్కార స్వరం వినిపించాడు. తమ కార్యవర్గం సస్పెన్షన్‌పై కోర్టుకు వెళతామని ఇప్పటికే బెదిరించిన సంజయ్ సింగ్ ఇప్పుడు క్రీడా శాఖపై ఎదురు దాడికి దిగాడు. జాతీయ పోటీలు నిర్వహించాలన్న అడ్‌హాక్ ప్యానెల్ నిర్ణయంపై స్పందిస్తూ..ఆ ప్యానెల్‌ను తాము గుర్తించడం లేదన్నాడు. తాము ప్రకటించిన మేరకే జాతీయ పోటీలు నిర్వహిస్తామన్నాడు. 'సస్పెన్షన్‌ను మేం గుర్తించడంలేదు. మా విధుల్లో మేం ఉన్నాం' అని సంజయ్ చెప్పాడు. త్వరలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నాం. ఈమేరకు ఒకటి రెండు రోజుల్లో రాష్ట్ర సంఘాలకు నోటీసు పంపుతాం. అడ్‌హాక్ ప్యానెల్ కంటే ముందే మేం జాతీయ పోటీలు నిర్వహిస్తాం' అని సంజయ్ సింగ్ తెలిపాడు.

మరోవైపు వచ్చేనెల రెండు నుంచి ఐదు వరకు జైపూర్‌లో జాతీయ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్టు అడ్‌హాక్ ప్యానెల్ వెల్లడించింది. అలాగే పురుషులు, మహిళల జాతీయ రెజ్లింగ్ శిబిరాల తేదీలను అడ్‌హాక్ ప్యానెల్ ప్రకటించింది. ఫిబ్రవరి తొమ్మిది నుంచి పురుషులకు సోనెపట్‌లో, మహిళలకు పటియాలలో ఈ శిబిరాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

### ఒక్కదుర్దినం.. ఎంతో బాధాకరం!

**మాజీ క్రికెటర్ గవాస్కర్**

న్యూఢిల్లీ: గడచిన ఏడాది భారత క్రికెట్ జట్లు అద్భుత ఆటతీరు కనబరచాయని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ విశ్లేషించాడు. 2023ను పురుషులు, మహిళల జట్లు ఓటములతో ముగించినా.. మొత్తంమీద చిరస్మరణీయ విజయాలనే నమోదు చేశాయి. 'వరల్డ్‌కప్‌లో రోహిత్ సేన వరుసగా 10 మ్యాచ్‌లు నెగ్గినా.. ఒక దుర్దినం అదీ ఫైనల్ రోజు కావడం బాధాకరమ'ని సన్నీ అన్నాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాపై మహిళల జట్టు సాధించిన చారిత్రక టెస్టు విజయాలను కొనియాడాడు.

# విరాట్ ప్రాక్టీస్.. ప్రాక్టీస్



కోచ్ ద్రవిడ్‌తో కోహ్లీ

కేప్‌టౌన్: రెండో టెస్టు కోసం స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ముమ్మర ప్రాక్టీస్ కొనసాగిస్తున్నాడు. న్యూ ఇయర్ రోజునూ వదలకుండా నెట్స్‌లో గంటపాటు చెమటోడ్చాడు. ఆరంభంలో సెంట్రల్ నెట్స్‌లో బౌలర్లను ఎదుర్కోగా, తర్వాత అవుట్ సైడ్ నెట్స్‌లో అర్ధగంట పాటు వేగంగా వచ్చే త్రోడౌన్స్‌ను ఆడాడు. ముఖ్యంగా లెఫ్టామ్ పేసర్ బౌలింగ్‌లో ఎక్కువ సేపు బ్యాటింగ్ సాధన చేశాడు. భారత జట్టులో ఇలాంటి బౌలర్ లేకపోవడంతో స్థానిక బౌలర్ చేత బంతులను వేయించుకున్నాడు. దక్షిణాఫ్రికా ఎడమచేతి పేసర్ బర్గర్‌ను దృష్టిలో ఉంచుకునే తను ఈ ప్రాక్టీస్ సాగించాడు. ఇక శ్రేయాస్ షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే బలహీనత తొలి టెస్టులోనూ కనిపించింది. అలాగే నెట్స్‌లో త్రోడౌన్ స్పెషలిస్ట్ నువాన్ సెనెవిరత్నె వేసిన బంతులను కూడా సరిగా ఆడలేకపోయాడు. ఇందులో ఓ బంతిని పుల్ షాట్ ఆడేందుకు చూడగా, అది పొట్టను తాకడంతో కాసేపు ప్రాక్టీస్ కూడా ఆపాల్సి వచ్చింది.

**మరో బౌన్సీ ట్రాక్ ఖాయమేనా?:** తొలి టెస్టులో చిత్తుగా ఓడిన టీమిండియా ఇప్పుడు రెండో టెస్టులో విజయం కోసం చూస్తోంది. కానీ పచ్చికతో కళకళలాడుతున్న ఇక్కడి పిచ్ కూడా పేసర్లకు అనుకూలించేలా ఉంది. దీంతో స్వింగ్, బౌన్స్‌తో బెంబేలెత్తించేందుకు ఆతిథ్య బౌలర్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అదే జరిగితే సెంచూరియన్ తరహాలోనే భారత బ్యాటర్లకు కష్టాలు ఎదురైనట్టే. అయితే చివరి రెండు రోజులు వికెట్ స్పిన్నర్లకు మద్దతుగా నిలిచే అవకాశముంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంటే మేలని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ స్టేడియంలో భారత్ ఆరు టెస్టులాడినా ఒక్కటీ గెలవలేదు. ఇందులో రెండు డ్రాగా ముగిశాయి.

**షారుక్‌ను దాటేసిన కోహ్లీ**

న్యూఢిల్లీ: ఆసియాలోనే అత్యధిక పాపులారిటీ కలిగిన వ్యక్తిగా టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. ప్రముఖ వెబ్‌సైట్ వికీపీడియా ప్రకారం.. గడిచిన ఏడాది (2023) ఆసియాలో అత్యధిక మంది విరాట్ గురించిన సమాచారం తెలుసుకోవడానికి తమ వెబ్‌సైట్‌ను సందర్శించినట్టు పేర్కొంది. కోహ్లీ పేజీని కోటీ 7 లక్షలమంది వీక్షించగా.. బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ గురించి 77 లక్షల మంది, నటి ప్రియాంక చోప్రా కోసం 65 లక్షల మంది వెతికినట్టు తెలిపింది.

### డైపర్లు మార్చడంకన్నా టెన్నిస్ ఆడడం ఈజీ!



బ్రిస్బేన్ : బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీతో టెన్నిస్ పునరాగమనం చేసిన మాజీ నెంబర్ వన్ **నవోమి ఒసాక** (జపాన్) శుభారంభం అందుకుంది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో 6-3, 7-6 (9)తో తమార కోర్పాష్‌పై ఆమె సునాయాసంగా గెలుపొందింది. నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ అయిన 26 ఏళ్ల ఒసాక..బిడ్డకు జన్మనివ్వడం కోసం 16 మాసాలు టెన్నిస్‌కు దూరంగా ఉంది. నిరుడు జూలైలో ఆమెకు కూతురు జన్మించింది. సుదీర్ఘ విరామం తర్వాత ఆడిన మొదటి మ్యాచ్ ఆసాంతం ఎంతో ఒత్తిడికి లోనైనట్టు ఒసాక చెప్పింది. టెన్నిస్ ఆడడం లేదా కూతుర్ని నిద్రపుచ్చడంలో ఏది సులువు అన్న ప్రశ్నకు 'షాయ్ (కూతురు)ని నిద్రపుచ్చాలంటే తల ప్రాణం తోకకు వస్తోంది. ఆమెకు తరచూ డైపర్లు మారుస్తూ ఉండాలి. అందువల్ల డైపర్లు మార్చడం కన్నా టెన్నిస్ మ్యాచ్ ఆడడమే ఈజీ' అని ఒసాక నవ్వుతూ బదులిచ్చింది.

### తెలుగు టైటాన్స్ చెత్తాట

నోయిడా: వరుస పరాజయాల నుంచి పాఠాలు నేర్వని తెలుగు టైటాన్స్ ఆట రానురానూ మరింత చెత్తగా మారుతోంది. ప్రొ కబడ్డీ సీజన్-10లో 2023లో ఆడిన ఆఖరి మ్యాచ్‌ను ఓటమితో ముగించిన టైటాన్స్ కొత్త ఏడాదిని కూడా పరాజయంతోనే ప్రారంభించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 54-18తో తెలుగు టైటాన్స్‌ను చిత్తుగా ఓడించింది. ఈ సీజన్‌లో టైటాన్స్ ఎనిమిది మ్యాచ్‌లాడగా ఇది ఏడో ఓటమి. ఆట ప్రారంభం నుంచే టైటాన్స్‌పై పుణె స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ వచ్చింది. ఏ దశలోనూ టైటాన్స్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. టైటాన్స్ స్టార్ రైడర్లు పవన్, నితిన్ పన్వర్ ఘోరంగా విఫలమయ్యారు. ప్రత్యర్థి జట్టులో మోహిత్ 13 పాయింట్లతో సత్తాచాటగా, అతడికి అస్లమ్ (8) సహకారమందించాడు. ఈ గెలుపుతో పుణె పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. మరోమ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-41తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది.

### రాజస్థాన్‌పై యోధాస్ గెలుపు



తెలుగు యోధాస్-రాజస్థాన్ మ్యాచ్ దృశ్యం

కటక్: అల్టిమేట్ ఖో-ఖో లీగ్ సీజన్-2లో తెలుగు యోధాస్ తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 34-27తో రాజస్థాన్ వారియర్స్‌పై నెగ్గి, కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించింది. ఆట ప్రథమార్ధంలో ఇరు జట్లు సమవుజ్జీలుగా నిలవగా, ద్వితీయార్ధంలో యోధాస్ పుంజుకోవడంతో రాజస్థాన్‌కు కష్టాలు మొదలయ్యాయి. అటాకర్ ప్రతీక్ (8 పాయింట్లు) తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ, కీలక సమయాల్లో పాయింట్లు సాధించడం యోధాస్‌కు లాభించింది. ఆట చివర్లో డిఫెండర్ ఆదిత్య 2 నిమిషాల 48 సెకన్ల పాటు ప్రత్యర్థులకు చిక్కకుండా యోధాస్‌ను విజయతీరాలకు చేర్చాడు. మరో మ్యాచ్‌లో చెన్నై క్విక్ గన్స్ 35-29తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.



# పారిశుద్ధ్య కార్మికులతో భోజనం చేసిన కేటీఆర్

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం తొలిరోజున మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు.. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భోజనం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పారిశుద్ధ్య కార్మికులతో కేటీఆర్ సమావేశమయ్యారు. వారితో మాట్లాడిన అనంతరం కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడంతో పాటు వారితో కేటీఆర్ సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ఖమ్మంలో కాంగ్రెస్ గెలుపులో టీడీపీ పోరాటం మరువలేనిది

- బీఆర్ఎస్ ఓటమికి ఆ క్యాడర్ నిబద్ధతతో పనిచేసింది
- టీడీపీ కార్యకర్తలు ఎప్పటికీ నా తమ్ముళ్లే: తుమ్మల



ఖమ్మం టీడీపీ ఆఫీసులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తుమ్మల

ఖమ్మం, జనవరి 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ విజయంలో టీడీపీ కార్యకర్తలు, నాయకుల పోరాటం మరువలేనిదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు టీడీపీ క్యాడర్ ఎంతో నిబద్ధత, పట్టుదలతో పనిచేసిందని కొనియాడారు. కొత్త సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో సోమవారం ఆయన ఖమ్మంలో టీడీపీ జిల్లా కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన ఆయన.. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే స్ఫూర్తినిచ్చాయని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. టీడీపీ కార్యకర్తలు ఎప్పుడూ తనకు తమ్ముళ్లేనని, ప్రజాసమస్యల పరిష్కారంలో వారి సహకారం కూడా తీసుకుంటామని చెప్పారు.

# రేపు టీపీసీసీ విస్తృత సమావేశం

- లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతే ప్రధాన అజెండా

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతే ప్రధాన అజెండాగా బుధవారం టీపీసీసీ విస్తృత సమావేశం జరగనుంది. గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, టీపీసీసీ కార్యవర్గం, డీసీసీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల చైర్మన్లు తదితరులు పాల్గొననున్నారు. మార్చిలోనే లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల అమలును వేగవంతం చేసే అంశంపై కార్యవర్గం, డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేయనున్నారు. అభ్యర్థుల ఎంపిక నియమావళికి సంబంధించి కొంత మేరకు కసరత్తు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో కొంత స్పష్టత ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న పలు మండల కమిటీల నియామకంపైనా చర్చించే అవకాశం ఉందని తెలిసింది. ఈ సమావేశం గతనెలలోనే జరగాల్సి ఉండగా ఇన్‌చార్జి కార్యదర్శుల మార్పు, ఇతర కారణాలతో జనవరికి వాయిదా పడింది. కొత్త ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ నియామకం తర్వాత జరుగుతున్న తొలి సమావేశం ఇదే. కాగా, దీపాదాస్ మున్షీ మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు.

# బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై ఖలిస్థాన్ గురి

- ఆర్థికంగా ధ్వంసం చేయాలని ఉగ్రవాది పన్నూన్ కుట్ర

న్యూఢిల్లీ: ఖలిస్థాన్ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూన్ తన విధ్వంసకర చర్యల్లో భాగంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)పై దృష్టి పెట్టాడు. 1993 మార్చి 12న బీఎస్ఈపై ఉగ్రవాదులు బాంబులతో దాడి చేసిన సంఘటనకు 31 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ సంస్థపై గురిపెట్టినట్టు నిఘా వర్గాలు తెలిపాయి. 2023 మార్చి 12 నుంచే దానిపై దృష్టి పెట్టి, ఆర్థిక విధ్వంసం సృష్టించాలని పథకం రూపొందించాడు. మార్చి 12లోగానే అమెరికా కంపెనీల షేర్లను కొనుగోలు చేయాలని, భారత్ కంపెనీలవి వదిలించుకోవాలంటూ కొందరికి సూచనలు ఇచ్చినట్టు తెలిసింది. ఖలిస్థాన్‌పై నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణ విఫలం కావడంతో దేశ ఆర్థిక రంగాన్ని నాశనం చేయడంపై వ్యూహాలు పన్నుతున్నాడు. ప్రధాని మోదీ శనివారం అయోధ్యలో నిర్వహించిన రోడ్‌షోను అడ్డుకోవాలని ముస్లింలను రెచ్చగొట్టడంతో పాటు, లక్ష డాలర్లు బహుమతిగా ఇస్తానని కూడా ప్రకటించాడని నిఘా వర్గాలు తెలిపాయి.

# మహిళను గర్భవతిని చేస్తే రూ.13లక్షలు!

- ప్రయత్నాల్లో విఫలమైనా కన్సోలేషన్ కింద 5లక్షలు
- రూ.799 రిజిస్ట్రేషన్.. డిపాజిట్ 20వేల దాకా వసూలు
- యువకులకు బిహార్‌లో ఓ ముఠా టోపీ

పట్నా, జనవరి 1: మహిళలను గర్భవతిని చేసే పురుషులకు రూ.13 లక్షల చొప్పున ఇస్తాం! ఆసక్తి ఉన్న పురుషులు రూ.799తో రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు.. ఒకవేళ మీ ప్రయత్నంలో విఫలమై, మహిళ గర్భం దాల్చకపోయినా కన్సోలేషన్ కింద రూ.5లక్షలు ఇస్తాం! బిహార్‌లోని ఓ ముఠా ప్రకటన ఇది. ఇందుకోసం వారు 'ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్ సర్వీసు' పేరుతో వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో ఓ రాకెట్‌ను నడుపుతూ యువకుల నుంచి వేలల్లో డబ్బు గుంజుతున్నారు. రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించిన పురుషులకు మహిళల ఫొటోలను చూపెట్టి నచ్చిన మహిళను ఎంపిక చేసుకోవాలని చెబుతారు. ఆ తర్వాత.. మీరు ఎంచుకున్న మహిళ అత్యంత ఆకర్షణీయంగా ఉందని చెబుతూ యువకుల నుంచి డిపాజిట్ రూపంలో గరిష్ఠంగా రూ.20వేల దాకా వసూలు చేస్తారు. అయితే ఈ 'ప్రక్రియ' మహిళల ఫొటోలు చూపించే వరకే పరిమితం అని, ఆ తర్వాత ఏమీ ఉండదు అని తెలుసుకునే సరికే యువకుల జేబుకు చిల్లు పడుతుంది. గర్భం దాల్చలేకపోయినా రూ.5లక్షలు ఇస్తామని ముఠా సభ్యులు మభ్యపెట్టడంతో 'ఎంకుకున్న మహిళ' కోసం రూ.20వేలు పెద్ద మొత్తమేమీ కాదనే భావనతో ఎంతో మంది యువకులు ముఠా సభ్యులు చెప్పిన ఖాతాలకు డిపాజిట్ చేశారు! ఈ ముఠా సభ్యులను బిహార్‌లోని నావ్దాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరువుపోతుందనే భయంతో ఎంతో మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

# బిహార్ సీఎం నితీశ్ ఆస్తుల విలువ 1.64 కోట్లు

- మంత్రి తేజ్ ప్రతాప్ ఆస్తులు రూ.3.58 కోట్లు

పట్నా, జనవరి 1: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన ఆస్తుల విలువ మొత్తం రూ.1.64 కోట్లుగా ప్రకటించారు. ప్రతి ఏడాది చివరి రోజున కేబినెట్ మంత్రులంతా తమ ఆస్తుల వివరాలను వెల్లడించడాన్ని నితీశ్ కుమార్ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో తన వద్ద రూ.22,552 నగదు, బ్యాంకులో రూ.49,202 డిపాజిట్లు ఉన్నాయని, రూ.11.32 లక్షల విలువైన కారు ఉందని సీఎం నితీశ్ ఆదివారం వెల్లడించారు. న్యూఢిల్లీలోని ద్వారకలో ఓ అపార్ట్‌మెంట్ ఉందని దాని విలువ రూ.1.48 కోట్లని నితీశ్ తెలిపారు. రాష్ట్ర మంత్రి తేజ్ ప్రతాప్ తన ఆస్తులను రూ.3.58 కోట్లుగా ప్రకటించారు.

# నర్సింగ్ కాలేజీలు మరో 64!

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా పరిధిలోని కొండాపూర్, వనస్థలిపురం, చేవేళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, పరిగి, హైదరాబాద్ పరిధిలోని గోల్కొండ, మలక్‌పేట, నాంపల్లి, డబీర్‌పుర ఏరియా ఆస్పత్రుల్లో నర్సింగ్ కాలేజీలు వచ్చే అవకాశాలున్నాయి. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో.. బాదేపల్లి, దేవరకద్ర, అలంపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, మక్తల్, ఉమ్మడి మెదక్ జిల్లాలోని నర్సాపూర్, సంగారెడ్డి, జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, గజ్వేల్, దుబ్బాక, నిజామాబాద్‌లోని బోధన్, ఆర్మూర్, దర్పల్లి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూరు, బోథ్, భైంసా, బెల్లంపల్లి, చెన్నూరు, కాగజ్‌నగర్, కరీంనగర్‌లో హుజూరాబాద్, కోరుట్ల, ధర్మపురి, మంథని, పెద్దపల్లి, వేములవాడ, హుస్నాబాద్, వరంగల్‌లో వర్ధన్నపేట, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, ఖమ్మం జిల్లాల్లోని సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం, భద్రాచలం, అశ్వారావుపేట, మణుగూరు, ఇల్లందు, నల్లగొండలో.. మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్, హుజూర్‌నగర్, కోదాడ, తుంగుతుర్తి, చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రుల్లో నర్సింగ్ కాలేజీలు రానున్నాయి.

## నర్సింగ్ విద్యకు డిమాండ్

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 22 నర్సింగ్ కళాశాలున్నాయి. వాటిలో 1,460 బీఎస్సీ నర్సింగ్ సీట్లున్నాయి. ప్రైవేటులో 78 వరకు కాలేజీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ప్రైవేటు కాలేజీల్లో కలిపి మొత్తం 3,150 సీట్లున్నాయి. దాదాపుగా ప్రతీ ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఒక నర్సింగ్ కాలేజీ కొనసాగుతోంది. మన దగ్గర నర్సుల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా కొవిడ్ మహమ్మారి తర్వాత నర్సులకు డిమాండ్ మరింతగా పెరిగింది. నర్సింగ్ విద్యను పూర్తిచేసిన వారిలో.. 30% మంది వృత్తికి దూరంగా ఉంటున్నారు. మార్చి నెలలో చాలా మంది స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు పదవీ విరమణ చేయనున్నారు. అప్పటికి డిమాండ్ మరింతగా పెరుగుతందని వైద్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి ఏటా వందల మంది విద్యార్థులు నర్సింగ్ పట్టాను అందుకుంటున్నా.. విదేశాల్లో పెద్ద జీతాలుండడంతో ఇక్కడ పనిచేయడానికి ఇష్టపడడం లేదు. సర్కారీ కొలువులను వదులుకుని మరీ.. విదేశాలకు వెళ్తుండడం గమనార్హం.! ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్-2012 ప్రకారం ప్రతీ వంద పడకలకు 45 మంది నర్సులు ఉండాలి. ప్రభుత్వాస్పత్రుల్లో మాత్రం 50శాతానికి పైగా నర్సుల కొరత నెలకొంది. ఇప్పుడు సర్కారు ప్రతీ వంద పడకల ఆస్పత్రులకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. నాలుగేళ్లలో నాణ్యమైన వైద్య సేవలు అందించేలా నర్సుల పోస్టులు భర్తీ అవుతాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# అదనంగా అప్పివ్వండి

(మొదటిపేజీ తరువాయి)



మరో రూ.13 వేల కోట్ల మేర అప్పు పుట్టేలా సహకరించాలని కేంద్రాన్ని కోరుతోంది. ఇటీవల ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదనపు అప్పు విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లను విడుదల చేయాలని, అదనపు అప్పు తీసుకోవడానికి అనుమతించాలని కోరారు. అయితే.. కేంద్ర ప్రభుత్వం ఈ అప్పుపై ఎలా స్పందిస్తున్నది వేచి చూడాలి.

## మూడు నెలలు ముందుగానే ఖాళీ

2023-24 ఆర్థిక సంవత్సరానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో రూ.40,615 కోట్ల మేర అప్పు తీసుకుంటామని ప్రతిపాదించగా.. నవంబరు నాటికి రూ.38,151 కోట్లు, డిసెంబరులో మరో రూ.900 కోట్లు.... మొత్తం రూ.39,051 కోట్ల మేర అప్పును తీసేసుకున్నారు. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1000 కోట్లు వినహా అంచనా వేసిన మేర అప్పును తీసుకున్నట్లయింది. చివరి త్రైమాసికం(జనవరి, ఫిబ్రవరి, మార్చి) మిగిలి ఉండగానే.. మొత్తం అప్పును లాగేసినట్లయింది. దీంతో మిగతా మూడు నెలల కాలానికి నిధులు ఎక్కడి నుంచి తేవాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. వీటి కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. వంద రోజుల్లో ఈ స్కీములను అమలు చేస్తామని చెప్పినందున నిధుల కొరత తప్పడం లేదు. దాంతో చివరి త్రైమాసికం గడవడానికి అదనంగా రూ.13 వేల కోట్ల అప్పు ఇవ్వాలని కొత్త ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కోరింది. జనవరిలో రూ.4000 కోట్లు, ఫిబ్రవరిలో రూ.2000 కోట్లు, మార్చిలో రూ.6000 కోట్లు... ఇలా మొత్తం రూ.13 వేల కోట్ల అప్పు తీసుకుంటామని ప్రతిపాదించింది. ఇప్పటికే బడ్జెట్‌లో అంచనా వేసిన మేర అప్పును తీసుకున్నందున.. దీనిని అదనపు అప్పుగా తీసుకోవడానికి అనుమతించాలని కేంద్రాన్ని కోరుతోంది.

## మూసుకుపోయిన మార్గాలు

రాష్ట్ర ప్రభుత్వానికి ఇతరత్రా ఆదాయ మార్గాలు పెద్దగా కనిపించడం లేదు. కొత్తగా అధికారంలోకి రావడం, అప్పటికే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నదంతా ఊడ్చేయడంతో ఇప్పుడు సందిగ్ధత నెలకొంది. పన్నేతర రాబడుల కింద బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.22,808 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో ప్రధానంగా భూముల అమ్మకం ద్వారానే నిధులు సమకూరుతాయి. నవంబరు నాటికే పన్నేతర రాబడుల కింద రూ.19,524 కోట్ల నిధులను రాబట్టారు. అంటే... దాదాపు 85.60 శాతం నిధులను రాబట్టుకున్నారు. ఔటర్ రింగు రోడ్డు టోల్ కలెక్షన్ టెండర్ల ద్వారా మరో రూ.7,380 కోట్లను రాబట్టారు. ఇలా పన్నేతర ఆదాయం కింద దాదాపు రూ.26,804 కోట్లు వచ్చాయి. అంటే, బడ్జెట్లో పెట్టిన దానికన్నా దాదాపు ఆరువేల కోట్లు అదనంగా ఈ అమ్మకాలతో వచ్చాయి. అవన్నీ ఖర్చయ్యాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేంద్ర గ్రాంట్లు ఆశాజనకంగా కనిపించడం లేదు. ఏటా ఇవి ప్రతిపాదించిన మేర రావడం లేదు. ఈ సంవత్సరం గ్రాంట్ల కింద రూ.43,294 కోట్లను ప్రతిపాదించారు. కానీ... నవంబరు నాటికి కేవలం 10.99 శాతం అంటే... రూ.4,532 కోట్లు మాత్రమే వచ్చాయి. మిగతా నాలుగు నెలలను పరిగణనలోకి తీసుకున్నా... రాష్ట్రాన్ని ఆదుకునే స్థాయిలో ఉండకపోవచ్చు. కేంద్ర పన్నుల్లో వాటా నిధులను కూడా నిక్కచ్చిగా అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పద్దు కింద కేంద్రం నుంచి రూ.14,528కోట్లు వస్తాయని అంచనా వేయగా... నవంబరు నాటికి రూ.8,177 కోట్లు (56.29%) మాత్రమే వచ్చాయి. అప్పుల మార్గం పూర్తిగా మూసుకుపోయింది. ఇలా అన్ని రకాల ఆదాయ మార్గాలు మూసుకుపోయి, కేంద్రమే నిబంధనలు సడలించి ఆదుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

## గత రెండేళ్లలో ఇలా తోడేయలేదు

ఈ సారి బడ్జెట్‌లో అంచనా వేసిన మేర అప్పుల లక్ష్యం తొమ్మిది నెలలకే పూర్తి కావడంతో చివరి త్రైమాసికం పరిస్థితి ఆందోళనలో పడింది. నిజానికి ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్ వరకు ప్రభుత్వాలు అప్పులు తీసుకుంటూ ఉంటాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో కూడా చివరి క్వార్టర్ల వరకు అప్పులు తీసుకుంటూ వచ్చింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో చివరి మూడు నెలల క్వార్టర్‌లో జనవరిలో రూ.6,187 కోట్లు, ఫిబ్రవరిలో రూ.4000 కోట్లు, మార్చిలో రూ.2029 కోట్లు చొప్పున మొత్తం రూ.12,216 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్థిక సంవత్సరం చివర్లో ఖర్చులకు ఇబ్బంది పడకుండా ఉండటానికి ప్రభుత్వాలు తమ అప్పుల కోటాను జాగ్రత్తగా వాడుకుంటూ ఉంటాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని చివరి త్రైమాసికానికి సంబంధించి జనవరిలో రూ.4,500 కోట్లు, ఫిబ్రవరిలో రూ.3000 కోట్లు, మార్చిలో రూ.4,150 కోట్లు చొప్పున అప్పటి బీఆర్ఎస్ సర్కారు మొత్తం రూ.11,650 కోట్ల మేర అప్పు తీసుకుంది. ఎన్నికల సంవత్సరం మాత్రం ఈ జాగ్రత్తలేవీ పాటించలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరం విషయానికొచ్చేసరికి ఎనిమిది నెలల్లోనే తన కోటా అప్పులన్నీ లాగేసింది. చివరి త్రైమాసిక అప్పు తీసుకోవడానికి వీల్లేకుండా పోయింది. జనవరి, ఫిబ్రవరి, మార్చిలో అప్పు పుట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే అదనపు అప్పు ఇవ్వాలని రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. పన్నేతర రాబడుల మార్గం లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ కోటా అప్పులను బీఆర్ఎస్ ప్రభుత్వం 8 నెలల్లోనే వాడేయటం కేంద్ర గ్రాంట్లలో పెద్దగా ఆశ లేకపోవడం, కేంద్ర పన్నుల ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఉంటుందా? లేదా అన్న సందిగ్ధత వంటి పరిస్థితులన్నింటినీ ప్రధాని మోదీకి రేవంత్ వివరించారు. అదనపు అప్పు తీసుకుంటే తప్ప... ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. వచ్చే 3నెలల కోసం మరో 13వేల కోట్ల అదనపు అప్పు తీసకోవడానికి అనుమతించాలని కోరారు.

## పొరుగు రాష్ట్రాలదీ ఇదే డిమాండ్

అప్పు కోసం కష్టాలు ఒక్క తెలంగాణవే కాదు. ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో రూ.37 వేల కోట్ల అప్పు తీసుకోవడానికి అనుమతించాలంటూ తమిళనాడు ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఇప్పటికే ఆ రాష్ట్రం 76 వేల కోట్ల మేర అప్పు తీసుకుంది. 37వేల కోట్లు అదనంగా కోరుతుంది. కేరళ ప్రభుత్వం ఏకంగా అదనపు అప్పులకు అవకాశం ఇవ్వాలంటూ కోర్టునే ఆశ్రయించింది. తమ రాష్ట్రానికి అప్పులను తిరిగి చెల్లించే ఆర్థిక పరిపుష్టి ఉందని, అయినా... కేంద్ర ప్రభుత్వం అప్పులపై ఆంక్షలు విధిస్తోందని వాదిస్తోంది. అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యం ఉన్నప్పుడు ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించింది. ఇలా పొరుగు రాష్ట్రాలు కూడా అప్పుల కోసం పోరాటం చేస్తున్న నేపథ్యంలో తెలంగాణకు ఎంతోకొంత అదనపు అప్పు వస్తుందన్న భరోసా లభిస్తోంది. తమకూ అదనపు అప్పు కోసం అనుమతించాలని రాష్ట్రం డిమాండ్ చేస్తోంది.

# 636 మంది పోలీసులకు పతకాలు

- ఎస్పీఎఫ్ డీఐజీ మాధవరావుకు మహోన్నత సేవాపతకం
- గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఉపేందర్‌కు శౌర్యపతకం


హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాలతోపాటు.. స్పెషల్ పోలీసు బెటాలియన్లు, ఏఆర్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్), అగ్నిమాపక దళం, అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ విభాగాల్లో మొత్తం 636 మంది సిబ్బందిని పోలీసు పతకాలకు ఎంపిక చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఎస్పీఎఫ్ డీఐజీ ఆర్.మాధవరావు మహోన్నత సేవా పతకం, గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కె.ఉపేందర్ శౌర్యపతకానికి ఎంపికయ్యారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 89 మందికి ఉత్తమ సేవ, 42 మందికి కఠిన సేవ, 435 మందికి సేవాపతకాలు లభించాయి. 9 మందికి మహోన్నత సేవాపతకాలు లభించాయి. వారిలో.. పి.ప్రేమ్‌సింగ్(ఆదిలాబాద్ డీసీఆర్బీ హెడ్‌కానిస్టేబుల్), బి.ప్రభాకర్‌రెడ్డి(నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ ఎస్సై), మంద నవీన్(రాచకొండ ఎస్బీ ఎస్సై), వి.మనోహర్ రావు(ఉప్పల్ ట్రాఫిక్ ఎస్సై), ఎం.సుధాకర్ అలియాస్ నాగరాజు(హైదరాబాద్ సీసీఎస్ ఏఎస్సై), జి.మల్లేశం (సైబరాబాద్ సీటీసీ ఏఎస్సై), ఆర్.సుధాకర్ రాజు(మహబూబ్‌నగర్ ఏఆర్‌హెచ్‌సీ), మహ్మద్ అంజాద్ అలీ(కరీంనగర్ పీటీసీ ఎస్సై), పి.సత్యనారాయణ(టీఎస్ఎస్పీ 7వ బెటాలియన్ అదనపు కమాండెంట్) ఉన్నారు. ఏసీబీలో.. ఐదుగురికి ఉత్తమ సేవ, ముగ్గురికి సేవాపతకాలు లభించాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో.. ముగ్గురు ఉత్తమ సేవ, ఏడుగురు సేవాపతకాలకు ఎంపికయ్యారు.

## అగ్నిమాపక శాఖలో..

అగ్నిమాపక శాఖలో ఆరుగురు శౌర్యపతకాలకు ఎంపికయ్యారు. వీరిలో బి.సుధాకర్ రావు(డిప్యూటీ డైరెక్టర్), పి.రమేశ్(మహేశ్వరం స్టేషన్ ఫైర్ ఆఫీసర్), సి.నవీన్ కుమార్(జడ్చర్ల ఫైర్‌మన్), పి.నాగయ్య(అసెంబ్లీ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్), అసెంబ్లీ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్లు ఆర్.ఆదర్శ్, మహ్మద్ ఎయిజాజ్ శౌర్యపతకాలకు ఉన్నారు. ముగ్గురు ఉత్తమ సేవ, 13 మంది సేవాపతకాలకు ఎంపికయ్యారు. ఎస్పీఎఫ్‌లో నలుగురు ఉత్తమ సేవ, 15 మంది సేవాపతకాలు అందుకోనున్నారు.

# ఇద్దరు రైతు సోదరులు సంపాదించినారు ఆర్నెల్లలో రూ.60లక్షలు!

- కుటుంబాలతో ఏపీ వినుకొండ నుంచి జనగామకు వలస
- ఏడాదికి 65వేలు చెల్లించి ఓ రైతు వద్ద 8 ఎకరాలు కౌలుకు
- 4ఎకరాల్లో నారు.. 2 విడతల్లో 30లక్షల చొప్పున లాభం



విస్తారంగా పెరిగిన పొగాకు నారుమళ్లు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 1: పంటలు సాగుచేస్తే ఏమీ మిగలడం లేదు.. వచ్చిన దిగుబడి అంతా పెట్టుబడి కింద పెట్టిన ఎరువులు, కూలీలకే పోతోంది అని దిగులు పడుతున్నారా? దిగుబడులొచ్చే సమయంలో కోతులు, అడవి పందులు దాడిచేసి పంటలను ధ్వంసం చేస్తాయనే భయంతో పంటల సాగుకే ధైర్యం చేయడం లేదా? అయితే ఈ ఇద్దరు రైతు సోదరులను చూడండి.. నాలుగు ఎకరాల్లో పొగాకు నారుమళ్లు వేసి, ఆరంటే ఆరు నెలల్లో రూ.60లక్షలు సంపాదించారు. ఆ ఇద్దరు.. ఏపీ పల్నాడు జిల్లా వినుకొండ మండలం చెరువుకొమ్ములపాలెం గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, శివకోటిరెడ్డి సోదరులు. వీరికి భూమిలేదు. కౌలుకు కొంత భూమి తీసుకొని.. ఏదైనా పంట సాగుచేసి నాలుగు పైసలు సంపాదించాలనే తపనతో నిరుడు డిసెంబరులో కుటుంబాలతో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ గ్రామంలో దిగారు. అక్కడే ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అనువైన సాగు భూమి కోసం వెతికారు. గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఎనిమిదెకరాలను ఏడాదికి రూ.65వేలకు కౌలుకు తీసుకున్నారు. అయితే ఆ గ్రామంలో కోతుల బెడద మెండు. కోతులు ముట్టని పంట వేయాలని, పొగాకు నారుమళ్లు వేసి విక్రయిస్తే బాగుంటుందని నిర్ణయించారు. జూన్-జనవరి మధ్య పొగాకు సాగుకు అనువైన కాలం.

## పొద్దున్నుంచి సాయంత్రం దాకా పొలం వద్దే

కౌలుకు తీసుకున్న ఎనిమిదెకరాల్లో నాలుగెకరాల్లో మామిడి తోట ఉండగా మిగతా నాలుగెకరాల్లో పొగాకు నారు పోయాలని నిర్ణయించారు. గత జూన్‌లో మొదట దుక్కిదున్ని ఎక్కడా మట్టి పెళ్లలు లేకుండా చక్కగా చదును చేశారు. ట్రాక్టర్ సాయంతో నాలుగు అడుగుల వెడల్పు, 240 అడుగుల పొడవుతో బెడ్లను రూపొందించారు. ఆ బెడ్ల పైన చెత్తాచెదారం తొలగించి మట్టిని చదును చేసి చీడపీడల నివారణకు రసాయనాలు పిచికారీ చేశారు. ఒక ఎకరం విస్తీర్ణంలో సరాసరిగా 45 బెడ్‌లను ఏర్పాటు చేసి ఎకరాకు కిలో పొగాకు విత్తనాలు వేశారు. ఇలా మొత్తం నాలుగెకరాల్లో 180 బెడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి బెడ్‌కు మధ్య కాలువ రూపంలో గ్యాప్ ఉన్నా.. ఆ కాలువ ద్వారా నీరు ఇవ్వకుండా స్ప్రింకర్ల ద్వారా నీరివ్వాలని నిర్ణయించారు. బెడ్లపైనే ప్రత్యేకంగా స్ప్రింకర్లను ఏర్పాటు చేశారు. ఇందుకు ఎకరానికి రూ లక్ష చొప్పున ఖర్చు చేశారు. పొగాకు నారు పెంచడంపై అన్నదమ్ములు ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. ఎప్పటికప్పుడు చీడపీడలను గమనించడం.. సస్యరక్షణ చర్యలు తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం దాకా నారుమళ్ల వద్దే ఉన్నారు. నారుమళ్లకు నేరుగా ఎరువులు చల్లితే సమస్యలొస్తాయని స్ప్రింక్లర్ల ద్వారానే పిచికారీ చేశారు. తర్వాత నారుపై రసాయనాలు లేకుండా చేసేందుకు అదే స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పిచికారీ చేస్తారు. ఒకవేళ కరెంటు లేక నీటిని పిచికారీ చేయడం ఆలస్యమైతే మొక్కలు చనిపోతాయని, ముందు జాగ్రత్తగా నీటిగుంత తవ్వి.. సరిపడా నీటిని నిల్వ చేశారు.

## 60అడుగుల బిట్ ధర రూ.5వేలు..

240 అడుగుల పొడవున్న బెడ్‌ను అరవై అడుగుల చొప్పున నాలుగు బిట్లుగా విభజించారు. ఒక్కో బిట్ నారును రూ.5వేల చొప్పున విక్రయించారు. అంటే ఒక బెడ్‌కు రూ.20వేలొచ్చాయి. ఇలా ఎకరా విస్తీర్ణంలో ఉండే 45 బెడ్లకు రూ.9లక్షలొచ్చాయి. అంటే నాలుగెకరాలకు కలిపి రూ.36 లక్షల మేర వచ్చింది. పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ. లక్షన్నర చొప్పున రూ.6లక్షలు పోనూ రూ.30 లక్షల లాభం వచ్చింది. తర్వాత సెప్టెంబరు చివర్లో మళ్లీ నారుమళ్లు పోశారు. ప్రస్తుతం నారు పెరుగుతుండగానే రైతులు అడ్వాన్సులు చెల్లించి కొనుగోలు చేశారు. అంటే మరో రూ.30 లక్షల లాభంతో మొత్తంగా ఆరు నెలల్లో రూ.60లక్షలు ఆర్జించారన్నమాట! నారు విక్రయం పూర్తయ్యాక అదే స్థలంలో పొగాకుతోటను సాగు చేస్తామని ఆ రైతు సోదరులు చెప్పారు.

### కష్టాన్ని నమ్ముకొనే వచ్చాం



కష్టాన్ని నమ్ముకొని ఇక్కడికొచ్చాం. 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని రోజూ ఉదయం నుంచి సాయంత్రం దాకా భూమినే నమ్ముకొని పనిచేస్తున్నాం. తెగుళ్లు ఉంటే గుర్తించి వెంటనే పెస్టిసైడ్స్ పిచికారీ చేసి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రెండు పంటల పేరుమీద అన్ని ఖర్చులు పోను రూ.60లక్షల లాభం వచ్చింది.

- గోవిందరెడ్డి, ఆంధ్ర రైతు

### కోతుల బెడద ఉండదు



మిగితా పంటలకు కోతుల బెడద ఉండటంతో పంటలు సాగు చేసి తీవ్ర నష్టం జరుగుతుంది. అందుకే పొగాకు సాగు చేస్తున్నాం. పొగాకు వాసనకు కోతులు దగ్గరకు రావడం లేదు. అందుకనే పొగాకు సాగుపై దృష్టి పెట్టాను.

-బి.కుమార్, రైతు ఇప్పగూడెం

### నారు నాణ్యతగా ఉంది



నారు నాణ్యతగా ఉంది. మేము నారుపోస్తే సరిగ్గా పెరుగడం లేదు. అందుకనే వీరి దగ్గర కొనుగోలు చేస్తున్నాం. చీడపీడల బెడద, కోతుల బెడద పొగాకుకు లేదు. అందుకే దీన్ని సాగు చేస్తున్నాం.

- కాసాని శ్రీశైలం, రైతు, రాఘవపూర్



# వందేభారత్ హవా

- దక్షిణ మధ్య రైల్వే పరిధిలో దూసుకెళ్తున్న 4 రైళ్లు
- 100 శాతానికిపైగా ఆక్యుపెన్సీ
- ప్రయాణికుల నుంచి పెరుగుతున్న ఆదరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు జోరుమీదున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు స్టేషన్ల నుంచి నడుస్తున్న నాలుగు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అపూర్వమైన ఆదరణ లభిస్తోంది. ఈ రైళ్లు గత నెల (డిసెంబరు)లో 100శాతానికి మించి ఆక్యుపెన్సీతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. అనుకూలమైన, సురక్షితమైన ప్రయాణ సదుపాయాన్ని ఈ రైళ్లు కల్పిస్తున్నాయి. వీటిలో ఏసీ చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు ఉండటంతో ప్రయాణికులు ఆకర్షితులవుతున్నారు. మరోవైపు ఈ రైళ్లలో జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఆటోమెటిక్ స్లైడింగ్ డోర్లు, రిక్లైనింగ్ సీట్లు, కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలు, ఎల్ఈడీ లైటింగ్, ప్రతి సీటు కింద చార్జింగ్ పాయింట్లు వంటి అనేక ప్రపంచస్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో వీటిలో ప్రయాణానికి ప్యాసెంజర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ రైళ్ల విషయానికి వస్తే.. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గతేడాది జనవరిలో ప్రారంభమైంది. తొలిరోజు నుంచే 100శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీతో స్థిరంగా నడుస్తోంది. డిసెంబరులో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు వందేభారత్ ఆక్యుపెన్సీ 134శాతం ఉండగా, విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు ఆక్యుపెన్సీ 143శాతం ఉండడం విశేషం. ఇక గతేడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన సికింద్రాబాద్ నుంచి తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా తొలిరోజు నుంచి పూర్తి ఆక్యుపెన్సీతో స్థిరంగా దూసుకెళ్తోంది. ప్రయాణికుల నుంచి అనూహ్యమైన స్పందన రావడంతో ఈ రైలుకు మే నుంచి కోచ్‌లను 8 నుంచి 16కు పెంచారు. గత డిసెంబరులో సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఆక్యుపెన్సీ 114శాతం, తిరుపతి- సికింద్రాబాద్ వందేభారత్ ఆక్యుపెన్సీ 105శాతంగా ఉంది. కాగా గత సెప్టెంబరులో ప్రవేశపెట్టిన కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మంచి ఆదరణను సొంతం చేసుకుంటోంది. డిసెంబరులో ఈ రైలు ఆక్యుపెన్సీ 107శాతం ఉండగా, తిరుగు ప్రయాణంలోఆక్యుపెన్సీ 110 శాతంగా నమోదైంది. విజయవాడ నుంచి చెన్నై వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గతేడాది సెప్టెంబరులో ప్రారంభమైంది. ఈ రైలు ఆక్యుపెన్సీ 128శాతంగా నమోదు కాగా, తిరుగు ప్రయాణంలో చెన్నై నుంచి విజయవాడకు ఆక్యుపెన్సీ 119శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను తీర్చడమే ప్రధాన లక్ష్యమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. జోన్ పరిధిలోని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ పూర్తిస్థాయి ఆక్యుపెన్సీతో నడవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. స్వదేశీ సెమీ హైస్పీడ్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని ఆయన పేర్కొన్నారు.


గవర్నర్ దంపతులకు మొక్కను బహూకరిస్తున్న సీఎం రేవంత్, మంత్రి సీతక్క

# గవర్నర్‌ను కలసిన సీఎం, మంత్రులు

- తమిళిసైకి న్యూ ఇయర్ శుభాకాంక్షలు
- గవర్నర్‌తో కాసేపు సీఎం భేటీ.. చర్చలు!
- రేవంత్‌కు యాదాద్రి అర్చకుల ఆశీర్వచనం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పలువురు మంత్రులతో కలసి రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌కు మర్యాద పూర్వకంగా కలసి మాట్లాడారు. గవర్నర్‌ను కలసిన వారిలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఉన్నారు. ఈ సందర్భంగా గవర్నర్, సీఎం కొంత సమయం భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కూడా రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### గవర్నర్‌కు అయోధ్య రాముడి అక్షింతలు..

అయోధ్య రాములవారి అక్షింతలను శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు గవర్నర్ తమిళిసైకి అందజేశారు. సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించే జన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రారంభించారు. ప్రపంచంలోని ప్రతీ హిందువుకు రాములవారి అక్షింతలు అందజేసి మందిర దర్శనానికి ఆహ్వానం పలుకుతున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. అందులో భాగంగా తొలిరోజు గవర్నర్ తమిళిసైకి సంప్రదాయబద్ధంగా బొట్టుపెట్టి అంక్షింతలు, కుంకుమ, పసుపు, గాజులు అందజేసి ఆహ్వానం అందజేశారు. రాముల వారి దర్శనానికి తప్పకుండా వస్తానని గవర్నర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, వీహెచ్‌పీ బాధ్యులు సురేందర్‌రెడ్డి, బాలస్వామి, పండరీనాథ్, జగదీశ్వర్, రాంసింగ్, సునీత రామ్మోహన్‌రెడ్డి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని సీఎంకు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతరులు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం నివాసం వద్ద విధుల్లో ఉండే సిబ్బంది ఆయనను కలసి శుభాకాంక్షలు చెప్పారు. సచివాలయంలో సీఎం రేవంత్‌ను యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక బృందం ఆశీర్వచనాలు అందించారు.

### సీఎంకు పలువురి శుభాకాంక్షలు..

మరోవైపు, ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్‌వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పీఎస్ఎల్‌వీ-సీ58 విజయవంతంగా ప్రయోగించి ఇస్రో మరో శిఖరం చేరిందని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని రేవంత్ ఆకాంక్షించారు.

# రియల్‌కు మళ్లీ 'ఊతం'

**ఫార్మా సిటీ, మెట్రో విస్తరణ రద్దు ఉండదన్న సీఎం**

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)



హైదరాబాద్ ఫార్మా సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైల్ పొడిగింపు ప్రాజెక్టులను రద్దు చేయడం లేదని.. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, సమూల మార్పులతో మరింత సమర్థంగా చేపడతామని సీఎం రేవంత్ ప్రకటించడం స్థిరాస్తి రంగానికి ఊతం కానుంది. రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్య అంచలంచెలుగా, కాలుష్య రహితంగా ఫార్మా సిటీని నిర్మిస్తామని స్పష్టం చేయడం పట్ల రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ శివారు కందుకూరు, యాచారం, కడ్తాల్ పరిధిలోని దాదాపు 20 వేల ఎకరాల్లో ఫార్మా సిటీ కోసం ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట, పంజాగూడ, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, కడ్తాల్, కర్కల్‌పహాడ్, ముద్విన్ గ్రామాల్లో 19,333 ఎకరాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 9,133 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 10,200 ఎకరాలను రైతుల నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. 13 వేల ఎకరాలకు పైగా సేకరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రపంచంలోనే ఫార్మా రంగానికి హైదరాబాద్ రాజధాని కానుంది. రూ.64 వేల కోట్లతో 5.6 లక్షల మందికి ఉపాధి కల్పించే ఫార్మా సిటీకి కేంద్రం నుంచి అనుమతులు కూడా వచ్చాయి. మరోవైపు ఫార్మా సిటీకి నిమ్జ్ హోదా దక్కడంతో పెట్టుబడులు పెడతామంటూ 400 పైగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే, భూ సేకరణపై న్యాయ వివాదాలు చుట్టుముట్టడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. కాగా, ఫార్మా సిటీ పేరుతో ఈ చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మా సిటీ వరకు అంటే కందుకూరు దాక మెట్రో రైల్ వేస్తామని ప్రకటించడంతో భూముల ధరలు పెరిగాయి. రియల్టర్లు భారీగా వెంచర్లు, విల్లాల నిర్మాణం చేపట్టారు. పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు భూములు కొన్నాయి. మిగతా ప్రాంతాల కంటే రియల్ ఎస్టేట్ ఈ మండలాల్లోనే పుంజుకుంది. గత నెలలో ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రియల్ లావాదేవీలు స్తంభించాయి. అయితే, సీఎం రేవంత్ తాజాగా తీసుకున్న నిర్ణయం.. ఫార్మా సిటీ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్‌కు ప్రాణం పోసినట్లయింది.

### ఇప్పటికే మౌలిక సదుపాయాలు

ఫార్మాసిటీ భూ సేకరణ, మౌలిక సదుపాయాల కోసం ఇప్పటికే రూ.2 వేల కోట్లకుపైగా ఖర్చుపెట్టారు. ఎస్‌బీఐ, హడ్కో నుంచి భారీగా రుణాలు తీసుకున్నారు. మీర్‌ఖాన్‌పేటలో వందెకరాల్లో 450 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారులకు ఫార్మా సిటీ రోడ్లను అనుసంధానం చేశారు. ఫార్మాసిటీ రక్షణ, శాంతిభద్రతల కోసం మేడిపల్లిలో గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేశారు.

# ఫార్మాసిటీ రద్దు కాదు

(మొదటిపేజీ తరువాయి)



తగ్గిస్తామని చెప్పారు. బీహెచ్ఈఎల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి 32 కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా విమానాశ్రయానికి మెట్రో మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు, నాగోల్ నుంచి ఎల్బీ నగర్, ఒవైసీ హాస్పిటల్ మీదుగా చాంద్రాయణగుట్ట వద్ద విమానాశ్రయానికి వెళ్లే మెట్రో లైన్‌కు లింక్ చేయనున్నట్లు చెప్పారు. అవసరమైతే మియాపూర్ నుంచి రామచంద్రాపురం వరకు, మైండ్ స్పేస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు మెట్రోను పొడిగిస్తామన్నారు. గచ్చిబౌలి నుంచి విమానాశ్రయానికి మెట్రోలో వెళ్లేవారు దాదాపు ఉండరని సీఎం అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం ప్రతిపాదించనున్న మెట్రో కారిడార్లు.. గత ప్రభుత్వం ప్రతిపాదించిన కారిడార్లతో పోలిస్తే.. తక్కువ ఖర్చుతో పూర్తవుతాయని, దూరం కూడా తగ్గుతుందని అన్నారు.

### యువతకు నైపుణ్యాల కోసం 10 వర్సిటీలు..

యువతకు అవసరమైన నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా 10 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన టాటా, మహేంద్ర వంటి సంస్థలు, ప్రముఖ పారిశ్రామికవేత్తల ద్వారా వారికి శిక్షణ ఇప్పిస్తామన్నారు. సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఈ డిగ్రీలకు ఉంటాయని, నైపుణ్యాలు అదనంగా ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో యువత ఉందని, వారికి ఆసక్తి కలిగిన విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పించనున్నట్లు, ఆయా దేశాలకు అవసరమైన మ్యాన్ పవర్‌ను ప్రభుత్వం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు.

### అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం..

అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు సీఎం చెప్పారు. మధ్యలో తాము జోక్యం చేసుకోబోమని, చెప్పేదొకటి.. చేసేది మరొకటి తన వద్ద ఉండవని స్పష్టం చేశారు. మూడు పోలీసు కమిషనరేట్లకు కమిషనర్లను నియమించామని, వారికి అవసరమైన సిబ్బందిని వారే ఎంపిక చేసుకుంటారని అన్నారు. శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకే తాను చూస్తానని, వారి పరిధిలో అవసరమైన అధికారులను నియమించుకుని యంత్రాంగం సక్రమంగా పనిచేసేలా వారే చూసుకోవాలని చెప్పారు. అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సంస్కరణలు తీసుకువచ్చి స్ట్రీమ్ లైన్ చేసే పనిలో ఉన్నట్టు పేర్కొన్నారు.

### స్టేట్ గెస్ట్‌హౌస్‌గా గత సీఎం క్యాంపు ఆఫీస్..

గతంలోని సీఎం క్యాంపు కార్యాలయాన్ని స్టేట్ గెస్ట్ హౌస్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రెస్ అకాడమీకి కొత్త చైర్మన్‌ను నియమించిన తరువాత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటినుంచి వంద రోజుల్లో జర్నలిస్టుల సమస్యల్ని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. ఇక రాష్ట్రంలో వంద పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కాలేజీ ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా హైదరాబాద్‌లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

### రేపు పీసీసీ విస్తృత స్థాయి సమావేశం..

ఈ నెల 3న (బుధవారం) పీసీసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, పార్టీ కోసం పనిచేసిన వారితో నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తనకు దగ్గరగా ఉండేవారనో, బంధువనో పదవులు ఇవ్వడం సాధ్యం కాదని, ఏది చేసినా పార్టీ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేస్తామని స్పష్టం చేశారు.

## టీఎస్‌పీఎస్సీ రాజీనామాలపై త్వరగా నిర్ణయం తీసుకోండి

- గవర్నర్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి!

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్ తమిళిసైను సీఎం రేవంత్ కోరినట్లు తెలిసింది. సోమవారం గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లిన సమయంలో ఆమెతో ప్రత్యేకంగా సమావేశమైన సందర్భంగా సీఎం ఈ విషయంపై చర్చించినట్లు సమాచారం. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డితోపాటు సభ్యులు తమ పదవులకు రాజీనామాలు సమర్పించిన విషయం తెలిసిందే. అయితే వారు రాజీనామా చేసి 20 రోజులు కావస్తున్నా.. గవర్నర్ ఇప్పటివరకు ఆమోదం తెలపలేదు. పుదుచ్చేరి పర్యటనలు, రాష్ట్రపతి శీతాకాల విడిదికి హైదరాబాద్ రావడం, ఇతరత్రా బిజీ షెడ్యూల్ కారణంగా రాజీనామాల విషయంలో గవర్నర్ నిర్ణయాన్ని వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో రాజీనామాలపై నిర్ణయాన్ని వెలువరిస్తే టీఎస్‌పీఎస్సీ విషయంలో తాము ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని గవర్నర్‌తో భేటీ సందర్భంగా సీఎం రేవంత్ చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు పరీక్షలు రద్దు కావడంతో వాటి నిర్వహణ, కొత్త నోటిఫికేషన్లు, ఇతర అంశాలపై ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని గవర్నర్‌కు వివరించినట్లు తెలిసింది.



# కొత్త బడ్జెట్‌పై కసరత్తు షురూ..

**ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు కోరిన ఆర్థిక శాఖ**

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ కొత్త బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను అన్ని ప్రభుత్వ శాఖల నుంచి ప్రగతి, నిర్వహణ పద్దులవారీగా ప్రతిపాదనలు కోరింది. ఉద్యోగుల వేతనాలు, భత్యాలు, ఇతర అత్యవసర ఖర్చులన్నింటినీ పంపాలని సూచించింది. ఈమేరకు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించిన ఉత్తర్వులు (జీవో నంబర్ 150)జారీ చేశారు. విభాగాధిపతులు(హెచ్ వోడీలు) తమ శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించి ఈనెల 9లోపు వారి శాఖల ముఖ్యకార్యదర్శులకు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిని ముఖ్యకార్యదర్శులు పరిశీలించి, తగు సలహాలు, సూచనలతో ఆర్థిక శాఖకు 11లోపు పంపించాలని తెలిపింది. అంతా ఆన్‌లైన్‌లో జరగాలని సూచించింది. 11 తర్వాత పంపే సవరణ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపింది. నిర్దేశిత గడువులోగా, పక్కా సమాచారంతో బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను పంపాలని ఆదేశించింది. అంచనాల్లో రాబడి, వ్యయాలు పక్కాగా ఉండాలని తెలిపింది. తమ శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కేడర్ స్ట్రెంథ్, వారి వేతనాలకయ్యే వ్యయాలను పొందుపర్చాలని సూచించింది. హోంగార్డులు, అంగన్‌వాడీలు, వీఆర్ఏ, డెయిలీ వేజ్ సిబ్బంది, జూనియర్ పంచాయతీ సెక్రటరీల వివరాలు కూడా పంపాలని తెలిపింది. కొత్త పథకాలకయ్యే వ్యయాలు, 2023 డిసెంబరు31 నాటికి మిగిలిపోయిన పథకాల వ్యయాలు పంపాలని పేర్కొంది. అంచనాలు వాస్తవ అవసరాలను ప్రతిబింబించాలని ఆదేశించింది.

# చాంద్రాయణగుట్టలో మెట్రో జంక్షన్!

**అమీర్‌పేట తరహాలో రెండు లైన్ల కలయిక**

- ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట-విమానాశ్రయం ఒకటి
- నాగోలు-చాంద్రాయణగుట్ట మరో మార్గం
- పాత బస్తీ మీదుగానే ఎయిర్‌పోర్టు మెట్రో
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అదనంగా మరో రెండు పొడిగింపులు
- రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్
- మియాపూర్ నుంచి రామచంద్రాపురానికి
- ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశం
- త్వరలో ఢిల్లీ మెట్రో అధికారులకు పిలుపు



హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌పై స్పష్టత వచ్చింది. అది పాతబస్తీలోంచే విమానాశ్రయానికి వెళ్లనుంది. కేసీఆర్ సర్కారు ఎన్నికలకు ఏడాది ముందు హైదరాబాద్ మెట్రోను భారీ ఎత్తున విస్తరించేందుకు ప్రణాళికను విడుదల చేసింది. వాటిపై గత నెల 13న సమీక్ష జరిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైండ్‌స్పేస్-ఎయిర్‌పోర్టు మెట్రో ప్రతిపాదనను, దాని టెండర్లను హోల్డ్‌లో పెట్టాలని నిర్ణయించారు. ప్రత్యామ్నాయంగా పాతబస్తీ మీదుగా రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దాంతో ఎయిర్‌పోర్టు మెట్రో రద్దయినట్లు రియల్ ఎస్టేట్ వర్గాలకు తప్పుడు సంకేతాలు వెళ్లడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి ఆ విషయమై స్పష్టత ఇచ్చారు. ఎయిర్‌పోర్టు మెట్రో రద్దు కావడం లేదని చెప్పారు. పాతబస్తీ బస్తీ నుంచి ఎయిర్‌పోర్టు మెట్రో వెళుతుందని ప్రకటించారు. కేసీఆర్ సర్కారు ప్రకటించిన మరో రెండు పొడిగింపులను కూడా కొనసాగించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాయదుర్గం రహేజా మైండ్‌స్పేస్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 31 కిలోమీటర్లు, బీహెచ్ఈఎల్-లక్డీకపూల్ మధ్య (26 కిలోమీటర్లు), నాగోలు-ఎల్‌బీనగర్ మధ్య (5 కిలోమీటర్లు) పనులను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. 2017లో మొదటి దశ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినప్పటికీ మెట్రో కార్యకలాపాలను అప్పటి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. కరోనా సమయంలో నిర్వహణ భారంతో ఎల్ అండ్ టీ వెళ్లిపోతామని చెప్పడంతో రూ.1000 కోట్ల పరోక్ష సాయం అందిస్తామని చెప్పినా.. అందులో కనీసం రూ.200 కోట్లు కూడా ఇవ్వలేదనే వాదనలు అప్పట్లో వినిపించాయి. ఈ తరుణంలో రెండో దశలో డీపీఆర్ సిద్ధమైన రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు కారిడార్(31 కిలోమీటర్లు) పనులకు నిర్మాణ సంస్థలేవి ముందుకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం తామే సొంతంగా పూర్తి చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.6,250 కోట్లను మంజూరు చేసింది. ఈ పనులకు 2022 డిసెంబర్ 9న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. గ్లోబల్ టెండర్లను ఆహ్వానించి పనులను మూడేళ్ల లోపు పూర్తి చేస్తామని చెప్పింది. నిధుల లేమితో వాటిని కూడా పక్కన పెట్టింది. చివరి దశకు వచ్చిన ఎల్-1(లోయస్ట్ కమర్షియల్ బిడ్)ను ఎంపిక చేయడంలోనూ సాగదీస్తూ వచ్చింది. ఈ లోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులకు బ్రేక్ పడింది.

### పాతబస్తీ నుంచే ఎయిర్‌పోర్టు కారిడార్!

కారిడార్-2లో భాగంగా జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 16 కిలోమీటర్ల పనులను ప్రతిపాదించగా.. ప్రార్థన మందిరాలు అడ్డు రావడంతో అప్పట్లో ఎంజీబీఎస్ వరకే ఎలివేటెడ్ మార్గాన్ని నిర్మించారు. అయితే ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5 కిలోమీటర్ల పెండింగ్ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇదే మార్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు కూడా మెట్రోను తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇదే విషయాన్ని గత డిసెంబర్ 13న హైదరాబాద్ మెట్రో అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, పీ-7రోడ్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలును తీసుకెళ్లాలని, లేకుంటే ఎల్‌బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట, బార్కస్, పహడీషరీఫ్, శ్రీశైలం రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అయితే, తాజాగా కొద్ది మార్పులతో సోమవారం ఇదే విషయాన్ని ఆయన మరోసారి స్పష్టం చేయడంతో పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్టు మెట్రో పక్కా అయ్యింది. సీఎం వ్యాఖ్యలతో హైదరాబాద్ మెట్రో అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ మెట్రో రైల్ అధికారులను నగరానికి రప్పించి వారి సమక్షంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

### చాంద్రాయణగుట్ట వద్ద ఎయిర్‌పోర్టు లింక్ ఏర్పాటు

ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి మీదుగా ఎయిర్‌పోర్టుకు సుమారు 13 కిలోమీటర్ల దూరం ఉంది. కాగా, ఎల్‌బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట, బార్కస్, పహడీషరీఫ్, శ్రీశైలం రోడ్డు మీదుగా 19 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ లెక్కన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన రాయదుర్గం నుంచి శంషాబాద్ కారిడార్ 31 కిలోమీటర్ల పోల్చితే సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఫలక్‌నుమా, ఎల్‌బీనగర్ కారిడార్ల దూరం సగం వరకే ఉంది. ఈ విధంగా పనులు చేస్తే నిర్మాణ వ్యయం చాలా తక్కువ కానుంది. దాంతో కొత్త ప్రభుత్వం మొగ్గు ఇటు వైపే ఉంది. తాజాగా చాంద్రాయణగుట్టను జంక్షన్‌గా చేసుకొని నాగోలు-చాంద్రాయణగుట్ట, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట-ఎయిర్‌పోర్టు రెండు కారిడార్లను చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. దాంతో నాగోలు-ఎల్‌బీనగర్ (5 కిలోమీటర్లను) కలపడంతోపాటు ఎల్‌బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు (9.1 కిలోమీటర్లను) పూర్తి చేస్తారు. దాంతో తూర్పు నగరానికి కూడా మెట్రో ద్వారా విమానాశ్రయ ప్రయాణం తేలిక అవుతుంది. ఈ మార్గం పూర్తి చేసి చాంద్రాయణగుట్ట వద్ద ఫలక్‌నుమా నుంచి వచ్చే లింకును కలిపితే ఇటు ఉప్పల్, నాగోలు, అటు ఎల్‌బీనగర్, పాతబస్తీ, అమీర్‌పేట, సికింద్రాబాద్, తదితర ప్రాంతాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఆలోచిస్తోంది.

### కొత్త మార్గాలపై కూడా ఫోకస్

ఇప్పటికే నిర్మితమైన కారిడార్లకు అనుసంధానంగా తక్కువ దూరంలో ఉన్న ప్రాంతాలకు మెట్రో రైళ్లను నడిపించడం ద్వారా ప్రజారవాణాను మరింత మెరుగు పరచవచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొనసాగుతున్న కారిడార్-1 లోని ఎల్‌బీనగర్- మియాపూర్‌కు అనుసంధానంగా రాంచంద్రాపురం వరకు(7 కిలోమీటర్లు), కారిడార్-3లోని నాగోలు- రాయదుర్గం (రహేజా మైండ్‌స్పేస్)కు అనుసంధానంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు(9 కిలో మీటర్లు) నిర్మించాలని ఆలోచిస్తోంది. తద్వారా తక్కువ ఖర్చుతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెట్రో రైలు సౌకర్యాన్ని కల్పించి రహదారులపై ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటోంది.

# హైదరాబాద్ కా షాన్.. నుమాయిష్

**మరింత గొప్పగా నిర్వహించేందుకు సహకారం అందిస్తాం.. ఎగ్జిబిషన్ సొసైటీలో సమస్యల పరిష్కారానికి కృషి**

- ఇంజనీరింగ్ కాలేజీగా కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల
- అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వపరంగా మద్దతు: రేవంత్‌రెడ్డి
- 83వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి నుమాయిష్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం

అఫ్జల్‌గంజ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో హైదరాబాద్ అంటే చార్మినార్, ట్యాంక్ బండ్ తరువాత గుర్తుకొచ్చేది నుమాయిష్ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ కా షాన్‌గా 83 ఏళ్లుగా నుమాయిష్ విజయవంతంగా కొనసాగుతుండటం గొప్ప విషయమన్నారు. సోమవారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో 83వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)ను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మహేశ్‌కుమార్ గౌడ్‌లతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొసైటీ సభ్యులు ప్రతి ఏటా నుమాయిష్ ప్రాధాన్యం ఏ మాత్రం తగ్గకుండా ఏటేటా పెంచుకుంటూ ముందుకెళుతున్నారని అభినందించారు. ఎగ్జిబిషన్ సొసైటీ, ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్లు నుమాయిష్‌ను కొనసాగించడం మాత్రమే కాకుండా.. సామాజిక బాధ్యతతో 20 విద్యా సంస్థలను నిర్వహిస్తూ విద్యార్థినులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయన్నారు. ఎంతో చరిత్ర కలిగిన కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం తరఫున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ నగరానికి మరింత గుర్తింపు తెచ్చేలా నుమాయిష్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీలో 2014 నుంచి 2023 వరకు ఉన్న దీర్ఘకాలిక సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ముఖ్యంగా ఎగ్జిబిషన్ సొసైటీలో పురుషులతో సమానంగా మహిళలకు సమానత్వం కల్పించడం గొప్ప విషయమన్నారు. గతంలో తాను ఎగ్జిబిషన్‌కు వచ్చేవాడినని, రాజకీయాల్లో బిజీగా ఉండటంతో రాలేకపోయానని సీఎం అన్నారు. ఈసారి తాను కచ్చితంగా మళ్లీ వస్తానన్నారు. సొసైటీ అధ్యక్షుడు, మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గత 8 దశాబ్దాలుగా నుమాయిష్‌ను జంట నగరాల ప్రజలతోపాటు ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతాల నుంచి 45 రోజులపాటు లక్షలాది మంది సందర్శకులు వీక్షించి, హైదరాబాద్‌ను గౌరవంగా గుర్తు చేసుకునేవారని అన్నారు. దేశంలోని నలుమూలల్లో ఉన్న పరిశ్రమలవారు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఇక్కడ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు, 2400కు పైగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకుగాను సొసైటీ నిర్వాహకులు అన్ని చర్యలూ చేపడుతున్నట్లు తెలిపారు. ఒక్క రూపాయి కూడా లాభాపేక్ష లేకుండా నుమాయిష్ ద్వారా ప్రత్యక్షంగా 2వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కాగా, నుమాయిష్‌ను సందర్శించే సీనియర్ సిటిజన్లు, నడవలేని వారి కోసం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహనాలతో సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి వి.హనుమంతరావు తెలిపారు.

## సీజేను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేను కలిశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కార్యాలయంలో సీజేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వెంట మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. కాగా.. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని పలువురు మంత్రులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిజాం కుటుంబ సభ్యుడు, ఆప్ పార్టీ నేత మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని వేదపండితులు ఆయన కార్యాలయంలో ఆశీర్వదించారు.

# ప్రజాపాలన ముగిశాకే నామినేటెడ్ కసరత్తు

- 6వ తేదీ తర్వాత భర్తీపై సీఎం దృష్టి
- సంక్రాంతి అనంతరం విడతల వారీ నియామకాలు!

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కార్యక్రమం ముగిశాక కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీపై కసరత్తు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నారు. అయితే అప్పుడు ప్రక్రియ మొదలుపెట్టినా.. సంక్రాంతి తర్వాతే నియామకాలు జరిగే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి డిసెంబరులో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో.. సంక్రాంతిలోపే కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పదవులను భర్తీ చేసే దిశగా సీఎం రేవంత్ కొంత స్పష్టతనిచ్చారు. ఈలోపు రేవంత్ గొంతు ఇన్‌ఫెక్షన్‌తో విశ్రాంతి తీసుకోవడం, వెనువెంటనే ప్రజాపాలన కార్యక్రమంపై దృష్టి పెట్టడం తదితరాల నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీ జాప్యమైంది. ప్రజా పాలన కార్యక్రమం ఈ నెల 6న ముగియనుంది. ఆ తర్వాత ఈ నియామకాలపైన సీఎం రేవంత్ పూర్తి స్థాయిలో దృష్టి పెడతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటుకు పోటీ తీవ్రం..

అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే టికెట్ దక్కని పార్టీ నేతలకు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవులిస్తామని కాంగ్రెస్ హామీలిచ్చింది. గవర్నర్ కోటాలో రెండు, ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానం ఆ పార్టీకి దక్కే అవకాశముంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో నిబంధనల ప్రకారం సాహిత్య కళా, సేవా రంగాల్లో భాగస్వామ్యం ఉన్నవారినే ఎంపిక చేసే ఆలోచనతో రేవంత్ ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటుకు పోటీ తీవ్రంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారులు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో కొంతమంది ముఖ్యనేతలను సర్దుబాటు చేసే ఆలోచనలో రేవంత్ ఉన్నట్లు చెబుతున్నారు. ఆయా పోస్టులకు నేతల ఎంపిక.. ఒకదానికొకటి ముడిపడి ఉన్నందున కసరత్తుకు సమయం పట్టే అవకాశముందంటున్నారు. సంక్రాంతి తర్వాత విడతల వారీగా నియామకాలుంటాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.




సిటీ సైడ్ చెక్ఇన్‌ను ప్రారంభిస్తున్న జీఎంఆర్ అధికారులు

## ఎయిర్‌పోర్టులో సిటీసైడ్ చెక్-ఇన్

- కారు పార్కింగ్ ప్రదేశంలోనే సేవలు
- అక్కడే బ్యాగేజీ డ్రాప్, బోర్డింగ్ పాస్
- సేవలను ప్రారంభించిన జీఎంఆర్ ఈడీ

శంషాబాద్ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): విమాన ప్రయాణికులకు శుభవార్త..! ఓ వైపు ఫ్లైట్ టైం అవుతుంటే.. మరోవైపు కారు పార్కింగ్ ఇబ్బందులు, టెర్మినల్ వైపు పరుగులు, సెక్యూరిటీ చెకింగ్, బ్యాగేజీ చెక్-ఇన్.. ఇవన్నీ ఆందోళన కలిగించే అంశాలే..! ఈ సమస్యకు శంషాబాద్ విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ చెక్ పెట్టింది. కారు పార్కింగ్ ప్రదేశంలోనే 'సిటీసైడ్ సెల్ఫ్ చెక్-ఇన్' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. జీఎంఆర్ ఈడీ ఎస్‌జీకే కిశోర్ సోమవారం ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాజా సేవలతో.. ప్రయాణికులు ఆందోళనచెందకుండా తొందరగా టెర్మినల్‌లోకి వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. "ప్రయాణికులు పార్కింగ్ వద్దే సెల్ఫ్ చెక్-ఇన్ చేసుకోవచ్చు. బ్యాగేజీ తనిఖీలను పూర్తిచేసుకోవచ్చు. ఇక్కడే బోర్డింగ్ పాసులను తీసుకోవచ్చు. దీనివల్ల బ్యాగేజీతో వెళ్లే ప్రయాణికుల సమయం చాలా వరకు ఆదా అవుతుంది" అని పేర్కొన్నారు. విమానం బయలుదేరడానికి ఆరు గంటల ముందు నుంచి ఒక గంట ముందు వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. బ్యాగేజీ చెక్-ఇన్ కోసం ఆయా విమానయాన సంస్థల లగేజ్ డ్రాప్ కౌంటర్లు పార్కింగ్ ప్రదేశంలోనే అందుబాటులో ఉంటాయని తెలిపారు. సిటీసైడ్ సెల్ఫ్ చెక్-ఇన్ ద్వారా విమానాశ్రయం లోపల కౌంటర్ల వద్ద రద్దీ తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కియోస్కల ద్వారా ప్రయాణికులు సెల్ఫ్ చెక్-ఇన్ చేసుకోవచ్చని వివరించారు.

## గతేడాది 2.54 కోట్లమందికి శ్రీవారి దర్శనం

- రూ.1,403.74 కోట్ల హుండీ ఆదాయం

గతేడాది(2023) తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని 2.54 కోట్ల మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ ద్వారా 1,403.74 కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. గతేడాది జనవరి 3న వైకుంఠ ఏకాదశి సందర్భంగా రికార్డు స్థాయిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.7.68 కోట్లు లభించగా, ఇటీవల వైకుంఠ ఏకాదశి రోజు రూ.5.05 కోట్లు లభించింది.

## శంషాబాద్‌లో 4.6 కిలోల బంగారం సీజ్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెద్దఎత్తున బంగారం పట్టుబడింది. డిసెంబరు 30, 31 తేదీల్లో మూడు వేర్వేరు ఘటనల్లో విదేశాల నుంచి ప్రయాణికులు అక్రమంగా తరలిస్తున్న రూ.2.91 కోట్ల విలువైన 4.6 కిలోల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. దుబాయ్ నుంచి ఇద్దరు మహిళలు దిగగా.. ఒకరి బ్యాగులో 1.87 కిలోలు, మరో మహిళ వద్ద 1.63 కిలోల బంగారం పట్టుబడింది. కువైట్ నుంచి దిగిన ఓ ప్రయాణికుడి వద్ద 1.1 కిలోల బంగారం పట్టుబడింది. ముగ్గురు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం నగరంలోని కస్టమ్స్ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

## మరో అదనపు అడ్వకేట్ జనరల్‌గా ఇమ్రాన్‌ఖాన్

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ)గా సీనియర్ న్యాయవాది మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

## ఛత్తీస్‌గఢ్ పోలీసుల కాల్పుల్లో ఆరేళ్ల చిన్నారి మృతి

- తల్లికి గాయాలు ఆస్పత్రికి తరలింపు.. గ్రామస్థుల ఆందోళన
- నష్ట పరిహారం ఇస్తామని పోలీసుల హామీ

చర్ల, జనవరి 1: ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ ఆరేళ్ల చిన్నారి మృతిచెందగా, పాప తల్లికి గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా ముట్వాడీ అడవుల్లో మావోయిస్టు నేత చంద్రన్న ఉన్నట్లు డీఆర్‌జీ బలగాలకు సమాచారం అందడంతో ప్రత్యేక బలగాలు అడవుల్లో గాలింపు ప్రారంభించాయి. ఈ క్రమంలో మావోయిస్టులకు పోలీసులకు మధ్య ముట్వాడీ గ్రామ సమీపంలో కాల్పులు జరిగాయి. మావోయిస్టులు ముట్వాడీ గ్రామంలోని ఇళ్ల మాటు నుంచి కాల్పులు జరుపుతుండగా, పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ముట్వాడీ గ్రామానికి చెందిన ఓ ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. పాప తల్లి గాయాలపాలైంది. వెంటనే ఆమెను బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులు ఆందోళన చేపట్టడంతో బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారి అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. ప్రభుత్వంతో మాట్లాడి నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో సంచలనంగా మారింది. కాగా, మావోయిస్టుల కాల్పుల్లో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. మావోయిస్టులు తప్పించుకుని పారిపోయారు.

## నోబెల్ గ్రహీత యూనస్‌కు 6 నెలలు జైలు శిక్ష వేసిన బంగ్లా కోర్టు

ఢాకా, జనవరి 1: నోబెల్ బహుమతి గ్రహీత యూనస్‌కు ఆరు నెలల జైలు శిక్ష ఖరారు చేస్తూ బంగ్లాదేశ్‌లోని ఓ కోర్టు తీర్పు చెప్పింది. ప్రముఖ ఆర్థిక వేత్త డాక్టర్ మహమ్మద్ యూనస్, కార్మిక చట్టాన్ని ధిక్కరించారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న టెలికాం కంపెనీలో కార్మిక చట్టాలకు అనుగుణంగా కార్మిక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలపై విచారణ చేపట్టిన మూడవ లాబర్ కోర్టు న్యాయాధికారి షేక్ మెరినా సుల్తానా సోమవారం తీర్పును ఇచ్చారు. ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష, 20 వేల టాకాలు చెల్లించాలని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించడంలో విఫలమైన పక్షంలో మరో 10 రోజులు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. తీర్పు వచ్చిన వెంటనే యూనస్ న్యాయవాదులు బెయిల్ కోసం దరఖాస్తు చేశారు. కోర్టు వెంటనే బెయిలు మంజూరు చేసింది.

# ఆలయాల్లో నూతన సంవత్సర సందడి

- యాదగిరిక్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తజనం
- గవర్నర్, సీఎంలకు యాదగిరీశుడి ఆశీర్వచనం
- రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్, వేములవాడ, జనవరి1: నూతన సంవత్సరం తొలిరోజున ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ తిరువీధులు, సేవామండపాలు, బస్‌బే ప్రాంతాలతోపాటు కొండకింద పట్టణ ప్రధాన రహదారులు, రాయగిరి చెరువు కట్ట పరిసర ప్రాంతాలు భక్తులతో కోలాహలంగా మారాయి. భక్తుల రద్దీతో ధర్మదర్శనాలకు 4గంటలు, ప్రత్యేక దర్శనాలకు 2గంటల సమయం పట్టింది. ఉదయం 3గంటలకే ఆలయాన్ని తెరచి నిత్య కైంకర్యాలు నిర్వహించి, 6.30గంటల నుంచి ఉభయ దర్శనాలను ప్రారంభించారు. ఒక్క రోజులో 50 వేలకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. యాదగిరీశుడిని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వికా‌స్‌రాజ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు ఎనుముల రవీందర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సోమవారం వివిధ విభాగాల ద్వారా రూ.76,78,268 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరక్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. దేవస్థానానికి అనుబంధంగా ఉన్న బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. సుమారు 40వేల మంది భక్తులు రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్ రెడ్డిలకు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. రాజభవన్‌లో గవర్నర్ దంపతులను కలిసిన అర్చకబృందం వేదోక్తంగా ఆశీర్వచనం అందించారు. అనంతరం సెక్రటేరియట్‌లోని సీఎం చాంబర్‌లో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలతో కలిసి యాదాద్రి దేవస్థాన అధికారులు, అర్చకబృందం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అర్చకులు ఆయనను ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



యాదాద్రిప్రధానాలయం లోపలి దర్శన క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

### సాగర్‌కు పర్యాటకుల తాకిడి..

కొత్త సంవత్సరం కావడంతో నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్‌కు వచ్చారు. సోమవారం ఉదయం జలాశయం మధ్యలోని నాగార్జునకొండకు పర్యాటకశాఖ లాంచీలో వెళ్లారు.

# మందు చుక్క.. మాంసం ముక్క

(మొదటి పేజీ తరువాయి)



సమయం దాటాక కూడా విక్రయించారు. దీనికితోడు పబ్‌లు, రిసార్టుల్లో మద్యం ఏరులై పారింది. రాజధానిలోనే రూ.40 కోట్ల పైగా మద్యం అమ్మకాలు సాగినట్లు లెక్కలు చెబుతున్నాయి. మద్యం అలవాటున్న వారు, లేనివారు కూడా ఆదివారం మాంసం తీసుకుంటారు. ఈ నేపథ్యంలో చికెన్, మటన్, చేపలు కూడా భారీగా అమ్ముడుపోయాయి. రాజధానిలో ఒక్క రోజే 4.5 లక్షల కిలోల చికెన్ విక్రయాలు జరిగినట్లు సమాచారం. సాధారణ రోజుల కంటే ఇది 50 శాతం అధికమని మార్కెట్ వర్గాలు చెప్పాయి.

### మూడు రోజుల ముందే మద్యం తరలింపు

మద్యం షాప్‌లు, బార్లు, క్లబ్‌లు, రిసార్ట్‌ల యాజమాన్యాలు డిసెంబరు 29 నుంచే ఎక్సైజ్ డిపోల ద్వారా రూ.642 కోట్ల మద్యాన్ని తీసుకెళ్లాయి. 5,75,521 కేసుల లిక్కర్, 6,26,111 కేసుల బీరును లిఫ్ట్ చేశాయి. సాధారణ రోజుల్లో సగటున రూ.80-100 కోట్ల మద్యాన్ని కార్పొరేషన్ విక్రయిస్తుంది. డిసెంబరు 29 నుంచి ఇది రూ.100 కోట్లు దాటడం గమనార్హం. 30వ తేదీన ఏకంగా రూ.313 కోట్ల లిక్కర్ డిపోల నుంచి బయటకు వెళ్లింది. రాష్ట్రంలోని 2,620 మద్యం షాపులలో 428, మొత్తం 1,000 పైగా బార్లు, క్లబ్‌లలో 500కు మించి జీహెచ్ఎంసీలోనే ఉన్నాయి. డిసెంబరు 31న వీటినుంచి రూ.70 కోట్లు, జిల్లాల్లోని దుకాణాల నుంచి రూ.230 కోట్ల విలువైన అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల అంచనా. డిసెంబరులో రూ.4,297 కోట్ల మద్యం అమ్ముడైంది. ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల్లో ప్రభుత్వానికి రూ.27,265 కోట్ల రాబడి వచ్చింది.

### సత్తుపల్లిలో చేతులు మారిన రూ.లక్షలు

ఏపీ సరిహద్దున ఉన్న ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతంలో కొత్త ఏడాది సందర్భంగా పేకాట, గుండాట, కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. సత్యనారాయణపురం, సదాశివునిపేటలోని పలు తోటల్లో ఆదివారం రాత్రి, సోమవారం జోరుగా నడిచాయి. దీనికి మూడు, నాలుగు రోజుల ముందు నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. కోడి పందేలు, కోసాట, గుండాట, మూడు ముక్కలాట, గ్లాస్ బాల్ ఆట అంటూ వివిధ పేర్లతో సాగిన జూదంలో రూ.లక్షలు చేతులు మారినట్లు సమాచారం. రాజకీయ పెద్దలు, బడా బాబుల కనుసన్నల్లో సాగిన జూదంలో ఎక్కువ మొత్తం నిర్వాహకుల జేబుల్లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. మూడు ముక్కలాట, గుండాటలో డబ్బు పోగొట్టుకున్నవారే తప్ప వచ్చినవారు లేరు. కోడిపందేల్లో కంటే వీటిలో పోగుట్టుకున్న సొమ్మే ఎక్కువని బాధితులు వాపోతున్నారు. సదాశివునిపేటలో పోలీసులు వస్తున్నారనే సమాచారం రావడంతో ఓ వ్యక్తికి చెందిన మొక్కజొన్న తోటను తొక్కివేశారు.

### ఏపీలో రూ.250 కోట్లు తాగేశారు!

అమరావతి: ఏపీలో డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో దాదాపు రూ.250 కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించినట్టు తెలుస్తోంది. ఆదివారమే.. రూ.147 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇది ఏపీలో రోజువారీ కంటే రెట్టింపు. అయితే, తెలంగాణతో పోలిస్తే సగమే కావడం గమనార్హం. ఇక ఏపీలో సోమవారం రూ.వంద కోట్లకుపైగా మద్యం అమ్ముడైంది. డిసెంబరు 31న 1.51 లక్షల కేసుల లిక్కర్, 67 వేల కేసుల బీరు విక్రయించారు. గతేడాది అదే రోజున రూ.142 కోట్ల విలువైన మద్యం అమ్మగా, ఈసారి రూ.5 కోట్ల మేర పెరిగింది.

### హైదరాబాద్ బిర్యానీ 'దమ్ము'

కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీకి దేశవ్యాప్తంగా 4.80 లక్షల పైగా బిర్యానీ ఆర్డర్లు వచ్చాయి. ఓ సమయంలో నిమిషానికి 1,244 ఆర్డర్లు రావడం విశేషం. ప్రతి నాలుగు బిర్యానీ ఆర్డర్లలో ఒకటి హైదరాబాద్ నుంచే ఉండడం మరో విశేషం. స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్‌కు నవంబరు 19న వన్డే ప్రపంచ కప్ సందర్భంగా నిమిషానికి వచ్చిన ఆర్డర్ల కంటే 1.6 రెట్లు ఆదివారం వచ్చాయి. స్విగ్గీ నిరుడు దేశవ్యాప్తంగా డిసెంబరు 31న 3.50 లక్షల బిర్యానీలు, 2.5 లక్షల పిజ్జాల ఆర్డర్లు రాగా, ఈసారి దానిని మించాయి. కొత్త సంవత్సరం ప్రవేశించే చివరి గంటలో 10 లక్షల మంది వినియోగదారులు స్విగ్గీలో యాక్టివ్ ఉన్నారని అన్ని రికార్డులను బద్దలు కొట్టామని సీఈవో రోహిత్ కపూర్ ప్రకటించారు. 2015-20 మధ్య డిసెంబరు 31న ఎన్ని ఆర్డర్లయితే డెలివరీ చేశామో.. 2023 చివరి రోజున సరిగ్గా అన్ని ఆర్డర్లనే పంపిణీ చేశామని, ఇదో సరదా గణాంకమని జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ ట్వీట్ చేశారు. క్విక్ కామర్స్ యాప్ బ్లింక్ ఇట్ సీఈవో అల్బిందర్ ధిండా.. ఒక్క రోజులో, ఒక్క నిమిషంలో అత్యధిక ఆర్డర్ల రికార్డు సాధించామని పేర్కొన్నారు.




కేక్ కట్ చేస్తున్న డీజీపీ రవిగుప్తా

## దేశానికే ఆదర్శం తెలంగాణ పోలీసులు

- ఇకపైనా అదే పనితీరు
- ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ నూతన సంవత్సర వేడుకల్లో డీజీపీ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సమర్థ పనితీరుతో తెలంగాణ పోలీసు వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని డీజీపీ రవిగుప్తా చెప్పారు. ఇకపైనా అదే స్థాయిలో పనిచేసి రాష్ట్ర ప్రజల భద్రత కాపాడుతామన్నారు. ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ మెస్‌లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. డీజీపీ రవిగుప్తా అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో పోలీసు వ్యవస్థ మొత్తం సమష్టిగా పనిచేసి అన్ని పండగలు, ఉత్సవాలు, వేడుకలు ప్రశాంతంగా ముగించామన్నారు. కొత్త ఏడాదీ అదేవిధంగా పనిచేస్తామన్నారు. రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అంజనీ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, ఇతర అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్ రెడ్డిని డీజీపీ రవిగుప్తా సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీతోపాటు పలువురు సీనియర్ అధికారులు గవర్నర్, సీఎంలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## బసవతారకం ఆస్పత్రిలో కార్ టి సెల్ థెరపీ

- తెలుగు రాష్ట్రాలలో ఇక్కడే తొలిసారి
- స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూపు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా కార్ టి సెల్ థెరపీని హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. దీనిద్వారా అత్యాధునిక జెనెటిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరంలోని టి సెల్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. మందులతో అదుపులోకి రాని కేన్సర్ సెల్స్‌పై పోరాడేలా చేసి.. లింఫోమా రకానికి చెందిన బ్లడ్ కేన్సర్ రోగుల జీవిత కాలాన్ని పెంపొందించవచ్చని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా 'స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్ టి సెల్ థెరపీ ప్రారంభం అనంతరం ఆస్పత్రి సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ స్టెమ్ సెల్, జెనెటిక్ ఇంజనీరింగ్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కేన్సర్ చికిత్సలో ఎంతో పురోగతి సాధించామన్నారు. భవిష్యత్‌లో కృత్రిమ మేధ, నానో టెక్నాలజీ, మిషన్ లెర్నింగ్ వంటివి వైద్య శాస్త్రంలో పెనుమార్పులు తీసుకొస్తాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో తమ ఆస్పత్రి ఎప్పటికీ ముందంజలో ఉంటుందన్నారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ ఆస్పత్రిలోని ట్రాన్స్‌ప్లాంట్ విభాగాన్ని దేశంలోనే అత్యుత్తమంగా అభివృద్ధి చేశామన్నారు. 500 పైగా స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ థెరపీలను పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్ ద్వారా పేషెంట్ కౌన్సిలర్లు, సోషల్ వర్క్ నిపుణులు, వైద్యులు ట్రాన్స్‌ప్లాంట్ సర్వైవర్స్‌తో నిరంతరం సంప్రదింపుల్లో ఉంటారని, అవసరమైన వారికి మార్గదర్శనం చేస్తారని వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఆర్ ప్రసాద్, వైద్యులు డాక్టర్ టీఎస్‌రావు, డాక్టర్ కల్పనా రఘునాథ్, డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, డాక్టర్ పవన్, డాక్టర్ వీరేంద్ర, పాల్గొన్నారు.

# కొత్త పొద్దులో విషాద మబ్బు!

- బీటెక్ విద్యార్థుల న్యూ ఇయర్ సంబరాలు విషాదాంతం
- డివైడర్‌ను ఢీకొన్న స్కూటీ.. ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి
- పటాన్‌చెరు సమీపంలో ఘటన
- వేర్వేరుప్రమాదాల్లో మరో ఇద్దరి మృతి



భరత్ చందర్



నితిన్



నటరాజ్



శ్రీనివాస్ (ఫైల్)

పటాన్‌చెరు, బచ్చన్నపేట, పాలకుర్తి, నల్లగొండ, కొల్లాపూర్, జనవరి 1: కొత్త ఏడాది వేడుకల తాలూకు ఉరకలేసే ఉత్సాహం.. ఆ ఊపులో మితిమీరిన వేగం, నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలిగొంటే.. మరో రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. మరో ఘటనలో ఈతకు వెళ్లి ఓ యువకుడు నీట మునిగి మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలో ఓ స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టడంతో దాని పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల్లో రాగం భరత్‌చందర్ (19), నితిన్ (18) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడు వంశీ గాయాలతో బయటపడ్డాడు. భరత్‌చందర్ స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి. నితిన్ స్వస్థలం జనగామ జిల్లా బచ్చన్నపేట. వంశీది ఖమ్మం జిల్లా. ముగ్గురూ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం రాత్రి 7గంటలకు న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ ముగ్గురు ఓ స్కూటీపై.. మరో ఆరుగురు స్నేహితులు రెండు బైక్‌లపై పటాన్‌చెరువైపు బయలుదేరారు. రుద్రారం గ్రామ శివారులోని సీటీప్యాలెస్ హోటల్లో భోజనాలు చేశాక దుర్గంచెరువుకు వెళ్లారు. అక్కడే పలుచోట్ల న్యూఇయర్ వేడుకల్లో తిరిగి తెల్లవారుజామున సుల్తాన్‌పూర్‌వైపు బయలుదేరారు. తెల్లవారుజామున 3గంటలకు పటాన్‌చెరు దాటగానే నవోపాన్ చౌరస్తా వద్ద భరత్, నితిన్, వంశీ ప్రయాణిస్తున్న స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టింది. పొగమంచే ప్రమాదానికి కారణం అని, దారి కనిపించకపోవడం వల్లే డివైడర్‌ను ఢీకొట్టి ఉంటారని భావిస్తున్నారు. కాగా వెనకే రెండు బైక్‌లపై ఉన్న స్నేహితులు ప్రమాదాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని ఆస్పత్రికి తరలించారు. భరత్, నితిన్ మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించి, అక్కడ పోస్టుమార్టం నిర్వహించారు. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో అక్కడ విషాదం నెలకొంది.

### లారీని కారు ఢీకొట్టడంతో..

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ముందు వెళుతున్న లారీని కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన మేకల నటరాజ్ (45), ముక్కోళ్ల శ్రీనివాస్, బోధన్ మల్లేశ్ సినిమా సెట్టింగ్‌లకు సీలింగ్ పనులు చేస్తుంటారు. నటరాజ్ తన స్నేహితుడి కారు తీసుకొని.. శ్రీనివాస్, మల్లేశ్‌తో కలిసి సోమవారం రాత్రి విజయవాడకు బయలుదేరాడు. సూర్యాపేట హైటెక్ బస్టాండ్ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు.. ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. కారు వెనుక సీట్లో కూర్చున్న నటరాజ్.. తలకు, ముఖానికి తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో వాహనం నడుపుతున్న మల్లేశ్‌కు, అతడి పక్కన కూర్చున్న శ్రీనివాస్‌కు ప్రమాదం తప్పింది. కాగా నల్లగొండ జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కొండమల్లేపల్లికి చెందిన గంజి శ్రీనివాస్ (49) కిరాణా వ్యాపారి. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై దేవరకొండకు వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున ఇంటికి వెళుతుండగా అతడి బైక్‌ను కొండమల్లేపల్లి నుంచి దేవరకొండకు వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడి.. తీవ్రగాయాలు కావడంతో గంజి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా నాగర్‌కర్నూలు జిల్లాలో ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. మృతుడు కోల్‌కతా వాస్తవ్యుడు కౌశిక్ (22). హైదరాబాద్‌లోని ఓ నగలషాపులో పనిచేస్తున్నాడు. కొత్త సంవత్సర వేడుకల కోసం ఆదివారం సాయంత్రం తన బంధుమిత్రులై 25 మందితో కలిసి కొల్లాపూర్ మండలంలోని సోమశిల గ్రామానికి వెళ్లాడు. కౌశిక్ కృష్ణానదిలో ఈతకు దిగాడు. కాసేపటికి అతడు గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారులు గాలించి కౌశిక్‌ను ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతిచెందాడు.

# రాజధానిలో కరోనా నిశ్శబ్దవ్యాప్తి

### చాప కింద నీరులా విస్తరిస్తున్న వైరస్



హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మనమంతా మర్చిపోయిన కరోనా మళ్లీ పడగ విప్పుతోంది! రాజధాని నగరంలో నిశ్శబ్దంగా.. చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఇది.. కొత్తగా వచ్చిన జేఎన్1 వేరియంట్ తాలూకూ సైలెంట్ వేవ్ అని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. కొవిడ్ కొత్త వేరియంట్ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో.. సీఎస్ఐఆర్-సీసీఎంబీ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ), టిగ్స్ (టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ అండ్ సొసైటీ-బెంగళూరు) శాస్త్రజ్ఞులు జంటనగరాలకు సంబంధించిన మురుగునీటి నమూనాలను పరిశీలించి ఈ నిర్ణయానికి వచ్చారు. ఉపశమనం ఏమిటంటే.. వైరస్ సోకిన చాలామందిలో ఎలాంటి లక్షణాలూ కనిపించట్లేదు. కొందరిలో స్వల్పంగా జలుబు, దగ్గు, జ్వరం, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. లక్షణాలు కనిపించినవారిలో కూడా అతికొద్దిమంది పరీక్షలు చేయించుకుంటుండడంతో.. కేసులు తక్కువ సంఖ్యలోనే నమోదవుతున్నాయి. వాస్తవంగా మాత్రం జంటనగరాల్లో అత్యధికులకు జేఎన్-1 వేరియంట్ ఇప్పటికే సోకిందని శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. "ఈ కొత్త వేరియంట్.. ఒమైక్రాన్‌కు దగ్గరి బంధువు. గతంలో కరోనా బారిన పడడం వల్ల, వ్యాక్సిన్ల వల్ల వచ్చిన రోగనిరోధక శక్తిని సైతం తప్పించుకోగలుగుతున్న ఆసక్తికర వేరియంట్ ఇది. ఇది చాలా నిశ్శబ్దంగా వ్యాపిస్తోంది. కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించట్లేదు. మరికొందరిలోనేమో.. అసలు గుర్తించలేనంత స్వల్పస్థాయిలో మాత్రమే లక్షణాలుంటున్నాయి. దీనివల్ల ఎలాంటి ఆందోళనకర అనారోగ్యం కలగట్లేదు" అని టిగ్స్ డైరెక్టర్, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు. ఈ వేరియంట్ వల్ల ఆస్పత్రిపాలయ్యేవారి సంఖ్య చాలా తక్కువగా ఉందని వెల్లడించారు. తమ పరిశీలన కోసం హైదరాబాద్‌లోని 18 ప్రాంతాల్లో ఓపెన్ నాలాలు.. బెంగళూరులో 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి, విజయవాడ, పుణె తదితర నగరాల నుంచి కూడా నమూనాలు సేకరించామని.. వాటిలో వైరల్ లోడ్ పెరిగే ట్రెండ్ గత ఏడాది డిసెంబరు మొదటి నుంచీ కనిపిస్తోందని ఆయన వెల్లడించారు. మురుగునీటి నమూనాలను తరచుగా పరిశీలించడం ద్వారా.. ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయా లేదా తగ్గుతున్నాయా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు తెలుపుతామని వివరించారు. వైరస్ సోకినా అత్యధికుల్లో ఎలాంటి లక్షణాలూ కనిపించట్లేదు కాబట్టి.. ఆస్పత్రిపాలైనవారి నమూనాలకు వైద్యాధికారులు తప్పనిసరిగా మాలిక్యులార్ టెస్టింగ్ చేయించాలని రాకేశ్ మిశ్రా అభిప్రాయపడ్డారు. "65 ఏళ్లు దాటినవారు.. ఇతర దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉన్నవారు.. మాస్కులను తప్పనిసరిగా ధరిండం, జనసమర్ద ప్రదేశాలకు వీలైనంత దూరంగా ఉండడం, ఒకవేళ అలాంటి చోట్లకు వెళ్లాల్సి వస్తే ఎన్-95 మాస్కు ధరించడం, చేతుల పరిశుభ్రతను పాటించడం వంటి ముందుజాగ్రత్త చర్యలను పాటించాలి" అని సూచించారు. ఫ్లూ లక్షణాలు కనిపించినా కరోనా పరీక్ష చేయించుకోవాలన్నారు. "వైరస్ అంత ఆందోళనకరమైనది కాదు. కానీ, నిరంతరాయంగా దాన్ని పర్యవేక్షించడం మాత్రం తప్పనిసరి" అని రాకేశ్ మిశ్రా హెచ్చరించారు.

### గాంధీ ఆస్పత్రిలో..

జేఎన్-1 వేరియంట్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. గాంధీ మెడికల్ కాలేజీలోని ల్యాబొరేటరీలో దీనికి సంబంధించిన పరీక్షలు వేగంగా జరుపుతున్నారు. ఇప్పటికే ఈ ల్యాబ్‌కు పలు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి 60కి పైగా నమూనాలు వచ్చినట్లు సమాచారం.

### అస్వస్థతతో వచ్చిన వారికి పరీక్ష చేస్తే..



జేఎన్-1 సోకినవారిలో లక్షణాలు స్వల్పంగా ఉంటున్నాయి. దీంతో వాటికి సంబంధించిన మందులు ఇస్తున్నాం. ఇటీవల ఓ వ్యక్తికి నాలుగు రోజుల పాటు జ్వరం, మరో యువతికి 5 రోజుల పాటు తీవ్ర జ్వరం ఉండడంతో పరీక్ష చేయగా కొవిడ్ నిర్ధారణ అయ్యింది. ఇలా ఇతర సమస్యలతో వచ్చిన వారికి పరీక్ష చేస్తే కొందరిలో కొవిడ్ నిర్ధారణ అవుతోంది. ఇంట్లో ఒకరికి ఫ్లూ లక్షణాలు ఉండి, అవి అందరికీ సోకి, అయిదారు రోజులు అలాగే ఉంటే.. కొవిడ్ ఉన్నట్లు అనుమానించి పరీక్ష చేయించుకోవడం మంచిది.

**- డాక్టర్ జగదీష్, సీనియర్ జనరల్ ఫిజిషియన్, కిమ్స్ ఆస్పత్రి**

### దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జర భద్రం




ఇటీవలే అమెరికాకు, కేరళకు వెళ్లి వచ్చిన ఓ 65 ఏళ్ల వ్యక్తికి కొవిడ్ వచ్చింది. ఆయనకు గుండె సంబంధిత జబ్బు ఉన్నందున.. ముందు జాగ్రత్త చర్యగా ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స చేస్తున్నాం. మా ఆస్పత్రికి వచ్చినవారిలో లక్షణాలున్న 10 మందికి పరీక్షలు చేయగా నలుగురికి కొవిడ్ నిర్ధారణ అయ్యింది. వారిలో గుండె జబ్బు ఉన్న ఒక్కర్ని మాత్రమే చేర్చుకున్నాం. వేరియంట్ ఏదైనా.. కేన్సర్, గుండె, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి. **- డాక్టర్ వెంకట్ నాని, జనరల్ ఫిజిషియన్, అపోలో ఆస్పత్రి**

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 2 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

# యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంట్రెన్స్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 19 సీట్లు ఉన్నాయి. పీహెచ్‌డీ 2023 జూలై సెషన్‌కు సంబంధించి 2023 సెప్టెంబరు 30 నాటికి ఖాళీగా ఉన్న 15 సీట్లను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయనున్నారు. 2023 జూలై సెషన్‌కు అప్లయ్ చేసుకున్న అభ్యర్థులు ప్రస్తుతం కొత్త ఈ-మెయిల్, పాస్‌వర్డ్‌లతో దరఖాస్తు చేసుకోవాలి.

### విభాగాలు-సీట్లు

- **2024 జనవరి సెషన్ సీట్లు:** ఫిజిక్స్ 4, కెమిస్ట్రీ 6, సైకాలజీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 7
- **2023 జూలై సెషన్ సీట్లు:** ఫిజిక్స్ 4, ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 1, కెమిస్ట్రీ 3, బయోకెమిస్ట్రీ 1, శాంస్క్రిట్ స్టడీస్ 1, సైకాలజీ 1, కాగ్నిటివ్ సైన్స్ 1, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 2, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 1.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జనవరి 24 నుంచి
- **పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జనవరి 28
- **ఎగ్జామ్ సెంటర్:** యూఓహెచ్ క్యాంపస్
- **వెబ్‌సైట్:** acad.uohyd.ac.in

# అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. హైస్కూల్ స్థాయి మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం ఉండాలి. అకడమిక్ మెరిట్, అసెస్‌మెంట్ టెస్ట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.


### ప్రోగ్రామ్ వివరాలు

- మొదటి సెమిస్టర్‌లో బేసిక్ స్టాటిస్టిక్స్, బేసిక్ ప్రాబబిలిటీ, స్టాటిస్టికల్ మెథడ్స్ సర్వే శాంపిలింగ్, ఇంట్రడక్షన్ టు అఫీషియల్ స్టాటిస్టికల్ సిస్టమ్, స్టాటిస్టిక్స్ అండ్ ఎకానమీ కోర్సులు ఉంటాయి.
- రెండో సెమిస్టర్‌లో అఫీషియల్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్లు, క్విజ్‌లు, అసైన్‌మెంట్లు, ఇంటరాక్షన్ సెషన్స్, కెరీర్ వర్క్‌షాప్‌లు, మెంటార్‌షిప్ సెషన్స్ ఉంటాయి.

**అసెస్‌మెంట్ టెస్ట్ అంశాలు:** లీనియర్ ఈక్వేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, అర్థమెటిక్ అండ్ జామెట్రిక్ ప్రోగ్రెషన్స్/సిరీస్, సింపుల్ ఇన్‌ఈక్వాలిటీస్, ఈక్వేషన్స్ ఆఫ్ స్ట్రయిట్ లైన్ అండ్ సర్కిల్, ఎలిమెంటరీ సెట్ థియరీ, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ ఎక్స్‌పాన్షన్, ఎలిమెంటరీ ప్రాబబిలిటీ అండ్ కండిషనల్ ప్రాబబిలిటీ, బేసిక్స్ ఆఫ్ ఫంక్షన్స్-లిమిట్స్-కంటిన్యుటీ-డిఫరెన్షియేషన్-మాగ్జిమమ్ అండ్ మినిమమ్-ఇంటిగ్రేషన్, ఎలిమెంటరీ నాలెడ్జ్ ఆఫ్ కాంప్లెక్స్ నెంబర్స్, బేసిక్స్ ఆఫ్ వెక్టర్స్ అండ్ మాట్రిసెస్

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 7
- **అసెస్‌మెంట్:** 2024 జనవరి 21
- **వెబ్‌సైట్:** www.isical.ac.in



# ఐబీఏలో పీజీ డిప్లొమా

బెంగళూరులోని ఇండస్ బిజినెస్ అకాడమీ(ఐబీఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ, ఎన్‌బీఏ, ఐఏసీబీఈ-యూఎస్ఏ సంస్థల గుర్తింపు ఉంది. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ కోర్సు. ఈ ప్రోగ్రామ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్స్ ఇస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది.

**స్పెషలైజేషన్‌లు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఈ-బిజినెస్, రిటైల్, ఆపరేషన్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్

**ప్రోగ్రామ్ వివరాలు:** ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. మూడో ట్రైమెస్టర్ ప్రారంభంలో స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. మూడో ట్రైమెస్టర్ కోర్సు పూర్తికాగానే రెండు నెలల కార్పొరేట్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ అనాలిసిస్, ప్రజంటేషన్స్, గెస్ట్ లెక్చర్స్, సెమినార్స్, మాక్ ఇంటర్వ్యూ సెషన్స్, గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి.

**అర్హత వివరాలు:** ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2024/ఎన్‌మ్యాట్ 2023/మ్యాట్ (2023 సెప్టెంబరు/డిసెంబరు; 2024 ఫిబ్రవరి/మే)/ఏటీఎంఏ 2024/జీమ్యాట్ (2022 సెప్టెంబరు తరవాత)/జీఆర్ఈ (2022 సెప్టెంబరు తరవాత)/గేట్ (2022-23) అర్హత పొంది ఉండాలి.

**వెయిటేజీ:** జాతీయ పరీక్ష స్కోర్‌కు 20 మార్కులు, అకడమిక్ ప్రతిభకు 35 మార్కులు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 మార్కులు, గ్రూప్ డిస్కషన్-పర్సనల్ ఇంటర్వ్యూకు 35 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**స్కాలర్‌షిప్స్:** పదోతరగతి నుంచి డిగ్రీ వరకు 60 శాతానికిపైగా మార్కులు ఉంటే 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.50,000; 70 శాతానికి పైగా మార్కులు ఉంటే 'సర్దార్ వల్లబ్‌భాయ్ జావేర్‌భాయ్ పటేల్ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.60,000; 80 శాతానికి పైగా మార్కులు ఉంటే 'నేతాజీ సుభాష్ చంద్ర బోస్ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.70,000 ఇస్తారు.

- 'అటల్ బిహారి వాజపేయి మెమోరియల్ స్కాలర్‌షిప్'నకు పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/ ఎక్స్‌ఏటీ/(జీమ్యాట్/జీఆర్ఈ)(2023 జూలై తరవాత)లో 85 శాతానికి పైగా, మ్యాట్/ఏటీఎంఏలో 750కి పైగా, సీమ్యాట్‌లో 95 శాతానికి పైగా స్కోర్ సాధించినవారికి రూ.1,00,000 ఇస్తారు. వీటికంటే తక్కువ స్కోర్‌లు సాధించినవారికి అంచెలవారీగా స్కాలర్‌షిప్ మొత్తం తగ్గుతూ ఉంటుంది.
- అభ్యర్థులు దరఖాస్తు ఫారంలోనే తమకు అనువైన స్కాలర్‌షిప్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

### ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.1,050
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6
- వెబ్‌సైట్: www.iba.ac.in



# జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో పీహెచ్‌డీ

జోధ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పీహెచ్‌డీ 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 158 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

**విభాగాలు:** అనెస్తీషియాలజీ అండ్ క్రిటికల్ కేర్, అనాటమీ, బయోకెమిస్ట్రీ కమ్యూనిటీ మెడిసిన్ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, డెంటిస్ట్రీ, ఎండోక్రైనాలజీ & మెటబాలిజం, ఫోరెన్సిక్ మెడిసిన్, మైక్రోబయాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియేషన్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, యూరాలజీ, నియోనాటాలజీ, ఆప్తల్మాలజీ, గైనకాలజీ, నెఫ్రాలజీ, డెర్మటాలజీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్, పాథాలజీ, న్యూరోసర్జరీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్

### అర్హత

- మెడికల్ విభాగాలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/బీడీఎస్/మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌బీఈ నుంచి ఎండీ/ఎంఎస్ పూర్తి చేసినవారు కూడా అర్హులే.
- నాన్ మెడికల్/లైఫ్ సైన్సెస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో ఎమ్మెస్సీ/ఎంవీఎస్సీ/ఎమ్మెస్సీ(ల్యాబొరేటరీ టెక్నాలజీ/స్పీచ్&హియరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. వీరు అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్ హ్యూమన్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఇమ్యూనాలజీ, లైఫ్ సైన్సెస్(బోటనీ, జువాలజీ, జెనెటిక్స్ సెల్ బయాలజీ, ఫార్మకాలజీ, ఫార్మసీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆంత్రోపాలజీ)లలో ఒకటి/రెండు సబ్జెక్టులు చదివి ఉండాలి. ఎమ్మెస్సీ(హ్యూమన్ జీనోమిక్స్)/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- సోషల్ బిహేవియరల్ సైన్సెస్ విభాగాలకు(ఎంఏ/ఎమ్మెస్సీ/ఎంఫిల్)(హెల్త్ ప్రమోషన్/ఎడ్యుకేషన్/హెల్త్ మేనేజ్‌మెంట్/ఎపిడిమియాలజీ/ఎన్విరాన్‌మెంటల్ హెల్త్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ అండ్ పబ్లిక్ హెల్త్/ న్యూట్రిషన్/అప్లయిడ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్/హెల్త్ ఎకనామిక్స్/అప్లయిడ్ ఎకనామిక్స్/ఎకనామిక్స్/ పబ్లిక్ హెల్త్/కమ్యూనిటీ హెల్త్)/ ఎంపీహెచ్/ఎల్ఎల్ఎం పూర్తిచేసినవారు అర్హులు.
- అభ్యర్థులందరికీ నెట్/ఐసీఎంఆర్/గేట్ అర్హత ఉండాలి.

**రాత పరీక్ష వివరాలు:** ఇందులో రీసెర్చ్ మెథడాలజీ, బయోస్టాటిస్టిక్స్, బేసిక్ సైన్సెస్ అంశాల నుంచి 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 50. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడో వంతు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం గంట. తరవాత స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ రాయాల్సి ఉంటుం ది. ఆబ్జెక్టివ్ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులకు సంబంధించిన స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలించి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 జనవరి 8
- **వెబ్‌సైట్:** aiimsjodhpur.edu.in

# కాప్ 28 లోటుపాట్లు

**కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే**

(నిన్నటి తరువాయి)

1. శిలాజ ఇంధన వినియోగం తగ్గింపుపై నిర్దిష్ట లక్ష్యాలు, కాల అవధులపరంగా ఎలాంటి నిర్ణయాలు లేవు. ప్రతిపాదిత ఫేజ్-ఔట్(ఉపహరణ) బదులు కేవలం ట్రాన్సిషనింగ్ అవే(క్రమంగా వైదొలగడం) అనే పదాన్ని వినియోగించారు. తద్వారా లక్ష్యం నీరు కారుతుందని, ఈ పోడకతో 2050 నాటికి శిలాజ ఇంధనాల వినియోగం నికర శూన్యానికి తీసుకురావడం సాధ్యం కాదని కొన్ని దేశాలు నిరసిస్తున్నాయి.
2. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు లక్ష్యాలనైతే నిర్దేశించారు కానీ వాటి సాధనకు ఎలాంటి హామీలు తీసుకోలేదు.
3. శిలాజ ఇంధన కట్టడిలో కేవలం బొగ్గుకే ప్రాధాన్యం ఇవ్వడం, 60 శాతం కర్బన ఉద్గారాలకు కారణమవుతున్న ఇతర శిలాజ ఇంధనాలైన చమురు, సహజ వాయువులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం విమర్శలకు దారితీసింది. బొగ్గు దశలవారీ నియంత్రణ ఏవిధంగా సాధ్యమవుతుందో, ఏ స్థాయి నుంచి మరే స్థాయికి తగ్గించాలో అనే అంశాలపై స్పష్టమైన విధానాలు లేకపోవడంతో దీని సాధనకు ఆదిలోనే హంసపాదు పడింది. అదేవిధంగా మీథేన్ విషయంలోనూ ఇదే సమస్య ఏర్పడుతోంది.
4. లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్‌కు ఏటా 400 బిలియన్ డాలర్లు సమకూరితేగానీ పేద దేశాలకు సంభవిస్తున్న నష్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని అంచనా. అయితే ఈ సమావేశంలో ధనిక దేశాలు హామీపడిన మొత్తం కేవలం 700 మిలియన్ డాలర్లనే అవి సమకూర్చాయి. ఇది ప్రస్తుతం ఉన్న అవసరతలో కేవలం 0.27 మాత్రమే. కాబట్టి ధనిక దేశాలు చేస్తున్న పర్యావరణ హనన స్థాయిలోనే అవి సమకూర్చే నిధులు కూడా ఉండాలనే వాదన వినిపిస్తోంది.

అయితే ఒక అతిపెద్ద చమురు దేశంలో, ప్రపంచంలోనే అతిపెద్ద చమురు సంస్థ అధినేత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శిలాజ ఇంధనాల కట్టడికి, పునరుత్పాదక ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం పెంపునకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాలు ఆశావాహ భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే ఈ ఏడాదిలో 80 రోజులకు పైగా పారిశ్రామిక పూర్వయుగ స్థాయి కన్నా 1.5 డిగ్రీల సెల్సియస్ పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2023 సంవత్సరాన్ని అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో జరిగిన కాప్-28 సమావేశంలో 2030 వరకు సాధించాల్సిన లక్ష్యాల పరంగా తీసుకున్న విధాన నిర్ణయాలు, నిర్ణయించుకున్న లక్ష్యాలను చేరడానికి పూర్తిస్థాయిలో సహకరించవన్నది జగమెరిగిన సత్యం. అయితే దేశాల పరంగా వైయక్తింగా చూపించే నిబద్ధత మాత్రమే ప్రస్తుత తరుణంలో పర్యావరణ పరిరక్షణకు బాసట కాగలదని నిపుణుల భావన.

ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



### భారత్ చొరవలు

**1. గ్రీన్ క్రెడిట్ ఇనీషియేటివ్:** వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు దేశాలు స్వచ్ఛందంగా చేపట్టే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు అనుసంధానతను కలిగించే చొరవ ఇది. దీని కోసం ఈ కార్యక్రమంలో ఒక వెబ్ ప్లాట్‌ఫాంను కూడా ఏర్పాటు చేశారు. ఇది వివిధ దేశాలు పాటిస్తున్న అత్యుత్తమ విధానాలు, చేపట్టిన పాలసీలు, పర్యావరణ అనుకూల విధానాల గురించిన సమాచారానికి, సహకారానికి, విజ్ఞాన మార్పిడికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

ఈ ఇనీషియేటివ్‌లో భాగంగా నిరుపయోగంగా ఉన్న వ్యర్థ భూముల్లో, నదీ పరివాహక ప్రాంతాల వెంబడి చెట్ల పెంపకం ద్వారా అక్కడి ఆవరణ వ్యవస్థను పునరుజ్జీవింప చేయడం వంటి చర్యలకు గ్రీన్ క్రెడిట్‌లు జారీ చేస్తారు.

**2. గ్లోబల్ రివర్ సిటీస్ అలయెన్స్:** నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ ప్రాజెక్టులో భారత్ విస్తృత అనుభవం దృష్ట్యా 11 దేశాలు కాప్-28 వేదికగా తమ దేశాల్లోని నదీప్రాంత పట్టణాల అభివృద్ధికి భారత్ నేతృత్వంలో ఒక కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా 11 దేశాల్లోని 275కు పైగా నదీతీర పట్టణాలను పర్యావరణహితంగా తీర్చిదిద్దవచ్చు. నదీ పరిరక్షణ, సుస్థిర నీటి యాజమాన్యం, నదీ కేంద్రిత సుస్థిరాభివృద్ధి సంబంధిత పరస్పర సహకారం, విజ్ఞాన మార్పిడి ఈ దేశాల మధ్య ఏర్పడుతుంది. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మినిస్ట్రీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అర్బన్ అఫైర్స్ ఈ కూటమిని సెక్రటేరియెట్‌గా వ్యవహరిస్తుంది.

**3. ఫేజ్-2 ఆఫ్ లీడర్‌షిప్ గ్రూప్ ఫర్ ఇండస్ట్రీ ట్రాన్సిషన్:** సమ్మిళిత, విచక్షణాయుత పారిశ్రామిక పరివర్తనకు సంబంధించిన చొరవ ఇది. తక్కువ కర్బన ఉద్గారాలు గల సాంకేతికతలకు సంబంధించి పరస్పర సహకారం, సాంకేతికతల బదిలీ, పర్యావరణహిత పారిశ్రామికత వైపుగా మారడానికి అభివృద్ధి చెందుతోన్న దేశాలకు ఆర్థికంగా సహకరించడం వంటి అంశాలు ఈ చొరవలో భాగం.

**4. క్వాడ్ క్లయిమేట్ వర్కింగ్ గ్రూప్ ఆన్ లోకలైజ్డ్ క్లయిమేట్ యాక్షన్:** సుస్థిర జీవన విధానాన్ని అభివృద్ధి చేసేందుకు క్లయిమేట్ యాక్షన్ ప్లాన్స్‌లో స్థానిక కమ్యూనిటీలో - స్థానిక ప్రభుత్వాల తోడ్పాటును సమీకరించేందుకు చేపట్టిన చొరవ ఇది.



# ఏడో సంచి

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఓ పిరికివాడు ఉండేవాడు. అడవిలో వెళ్తుంటే 'ఇటు రమ్మ' అంటూ కేక వినపడింది. చెట్టు మీద ఉండేది దెయ్యం అయితే ఇబ్బందే కదా! అని వెనక్కి చూడకుండా వెళ్లిపోతుంటే.. మళ్లీ రమ్మని కబురు వచ్చింది. ఆ చెట్టు దగ్గరకు వెళ్లి చూసాడు. 'నీకు డబ్బు కావాలి కదా!' అన్నాడు. అవును అన్నాడు ఈ పిరికోడు. 'ఏడు సంచి నింపాలి' అన్నది ఆ చెట్టుమీద స్వరం. 'అంటే..' అన్నాడు పిరికివాడు. 'ముందు నువ్వు ఇంటికి వెళ్లు. అక్కడ ఏడు సంచులు ఉంటాయి. ఆరింటిలో వరహాలుంటాయి. ఏడో సంచి కూడా చూడు' అన్నది ఆ స్వరం. ఆ మాట వింటూనె ఇంటికి పరుగు తీశాడు పిరికివాడు.

ఇంటికి వెళ్లి తలుపు తీసిన వెంటనే ఏడు సంచులున్నాయి. అరు సంచుల్లో వరహాలు. అవి చూస్తూనే ఆశ కలిగింది. ధనవంతుడు అయ్యానని సంతోషపడ్డాడు. వెంటనే ఏడో సంచి చూశాడు. అందులో చిన్న చెక్క ముక్క ఉంది. ఈ సంచిని నింపితే.. ఆరు సంచులూ నీవే అని దానిపై రాసి ఉంది. వెంటనే ఇది నిజమని నమ్మాడు. ఏమాత్రం ఆలోచించకుండా ఆ సంచిని నింపాలనుకున్నాడు. తన ఇంట్లో బంగారం, ధనంతో వరహాలు కొని ఏడో సంచిలో వేశాడు. అయితే అది నిండలేదు. పైగా ఇతనికి ఆందోళన కలిగింది.





అప్పుచేసి మరీ వరహాలు కొన్నా ఆ సంచి నిండలేదు. దీంతో రాజుగారి దగ్గరకు వెళ్లి అయ్యా.. నేను మీకు క్షవరం తీస్తున్నాను. పది వరహాలకు పని చేయలేను అన్నాడు. ఆయన ఇరవై వరహాల జీతం పెంచాడు. అయినా ఈ పిరికోడికి బాధ. సంచులు దొరకవేమోనని బాధ వెంటాడేది. రాజుగారు ఇచ్చిన వరహాలను వేసినా నిండలేదు. ఆ ఏడో సంచి నిండుతుందా? అనే దాని కంటే ఈ ఆరు సంచులు మాయమైతాయేమోననే భయం పట్టి పీడించింది. నిద్ర కూడా సరిగా లేదు.

ఒక రోజు రాజుగారి దగ్గరకు పోయాడు. పిరికివాడి ఆందోళన చూసి రాజుగారు 'ఏమైందని' అడిగారు. ఏమీ లేదన్నాడు పిరికోడు. ఆ ఏడో సంచి నిండని వాడే నీలా ఉంటాడు అన్నాడు. పిరికివాడికి భయం వేసింది. మీకెలా తెలుసనే ఆశ్చర్యం కలిగింది. పిచ్చోడా.. ఆ చెట్టు మీద యక్షుడు ఉన్నాడు. అతడు మాయావి. నాకూ ఇలా ఏడు సంచుల నాటకం ఆడాడు. అయితే మొదటిరోజే నాకు కాదని.. తన చెట్టు కింద ఆరు సంచులు, ఏడో ఖాళీ సంచి ఇచ్చాను అన్నాడు. వెంటనే భయం పోయింది పిరికివాడికి. నేనేమి చేయాలి? అనడిగాడు. 'నువ్వు కూడా నాలానే వెళ్లి ఇదే మాట చెప్పు' అన్నాడు. వెంటనే పరిగెత్తుకుపోయి ఆరు వరహాల సంచులు నాకొద్దు. ఏడో సంచి నిండదు. కష్టం. ఈ పని చేయలేను అన్నాడు. సరేనన్నాడు. ఆరుసంచులతో పాటు ఏడో సంచి కూడా మాయం అవటంతో తను దాచుకున్న డబ్బు, వరహాలు పోయాయి. ఈ దుర్ఘటన పలుమార్లు తలచుకుంటూ బాధపడేవాడు. కేవలం అత్యాశనే తన కొంప ముంచిందని తెలుసుకున్నాడు.

### 10 తేడాలు గుర్తించండి





### సరైన నీడ ఏది?



### డైలీ సుడోకు - 193

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | | | | | | | 6 | |
| | 5 | | | | | | | 3 |
| 4 | | 3 | 7 | | | 8 | | |
| | | 7 | | | 5 | 9 | 3 | |
| | | 2 | 8 | | 7 | 4 | | |
| | 3 | 4 | 1 | | | 7 | | |
| | | 6 | | | 8 | 5 | | 4 |
| 3 | | | | | | | 9 | |
| | 7 | | | | | | | 2 |

### సుడోకు - 192 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 7 | 6 | 2 | 1 | 9 | 3 | 4 | 5 |
| 5 | 3 | 9 | 6 | 7 | 4 | 1 | 8 | 2 |
| 4 | 1 | 2 | 5 | 8 | 3 | 6 | 9 | 7 |
| 7 | 6 | 5 | 1 | 4 | 8 | 2 | 3 | 9 |
| 9 | 8 | 3 | 7 | 2 | 6 | 5 | 1 | 4 |
| 1 | 2 | 4 | 3 | 9 | 5 | 8 | 7 | 6 |
| 2 | 5 | 1 | 4 | 3 | 7 | 9 | 6 | 8 |
| 6 | 4 | 8 | 9 | 5 | 1 | 7 | 2 | 3 |
| 3 | 9 | 7 | 8 | 6 | 2 | 4 | 5 | 1 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.